అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఉపకారం కాదు.. అవసరం
తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణం
అజిత్ పవార్ విమానం బ్లాక్ బాక్స్ లభ్యం 05

సంపుటి 09, సంచిక: 62 | శుక్రవారం | 30-01-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఎయిర్‌పోర్టులను
## త్వరితగతిన పూర్తిచేయాలి

● మామునూరు ఎయిర్‌పోర్టుకు భూమి అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు

03



సిఎం, మంత్రుల ప్రమేయం లేకుండా...
## ఫోన్ ట్యాపింగ్ జరగదు

● సిట్ విచారణతో అసలు నిజాలు బయటికి వస్తాయి
● టిపిసిసి అధ్యక్షుడు

03

వచ్చే ఆర్థిక సంవత్సరంలో
# 7% వృద్ధిరేటు

ఎకనామిక్ సర్వే అంచనా

● ఎఐతో ముప్పు; నియంత్రణకు ఎఐ ఆర్థిక మండలి అవసరం
● 100 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి లక్ష్యం ● కార్మికులు, గిగ్ వర్కర్లకు లేబర్ కోడ్‌లతో రక్షణ




**న్యూఢిల్లీ:** భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటుకు సమర్పించిన ఎకనామిక్ సర్వే నివేదికను అనుసరించి, 2026–27 ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధిరేటు 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతున్నదని ఆ నివేదికలో పేర్కొన్నారు. సంభావ్య వృద్ధి రేటును సుమారు 7 శాతంగా సర్వేలో తెలిపారు. ఆర్థిక సలహాదారుడు వి. అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని నిపుణుల బృందం సిద్ధం చేసిన ఆర్థిక సర్వేను

తరువాయి 2లో

## భారత్ అభివృద్ధి చర్యల్లో భాగస్వాములు కండి



● తెలంగాణలో ఉన్న అవకాశాలు రాష్ట్ర బలాబలాలను ప్రపంచానికి తెలిసేలా బ్రాండ్ అంబాసిడర్లుగా ముందుకు రావాలి
● హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్ఠి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బిఎస్) లో చదువుతున్న భారతీయ విద్యార్థుల బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తమ స్కూల్‌కు ఆహ్వానించింది. అత్యంత బిజీ షెడ్యూల్, తరగతులు, అసైన్‌మెంట్లను పూర్తి చేసిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల

తరువాయి 2లో

# మేడిగడ్డ బ్యారేజీ అత్యంత ప్రమాదకరం



● డేంజరస్ డ్యాముల కేటగిరి 1లో ఉన్నట్లు కేంద్ర జల్‌శక్తి వెల్లడి
● తగిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు స్పష్టీకరణ
● లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం
● వర్షాకాలం తర్వాత 6,553 డ్యాములు తనిఖీ
● దేశవ్యాప్తంగా 50 ఏళ్ల పైబడిన డ్యాములు 1681
● గణాంకాలను ప్రకటించిన కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే అత్యంత ప్రమాదకర డ్యాముల కేటగిరి 1 పరిధిలో తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ బ్యారేజీ(లక్ష్మి బ్యారేజీ) ఉన్నదని కేంద్ర జల్‌శక్తి వెల్లడించింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఇదివరకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. వర్షాకాలం తర్వాత 6553 డ్యాములను తనిఖీ చేశామని, ఇందులో మూడు డ్యాములు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని, ఇందులో మేడిగడ్డ(తెలంగాణ),

తరువాయి 2లో

# కేరళలో సకల వర్గాలకు సమప్రాధాన్యం

కేరళ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

‘కోటి మందికి చేరువయ్యే సామాజిక భద్రతా సాయం, ఐదు లక్షల మందికి ఇళ్లు, కోటి మందికి పైగా ఉచిత చికిత్స, కడు పేదరికం నుండి విముక్తి, అప్పుల ఊబిలో పడిన వారికి ఇళ్లను కాపాడి ఇవ్వడం, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరచడం మేము చేపట్టిన బాధ్యతలు. అది మా రాజకీయం. ఆ రాజకీయాన్ని ప్రతి నిశ్వాసంలోనూ ఉన్నతంగా చాటుతాం’
– బడ్జెట్ ప్రసంగంలో కేరళ ఆర్థిక మంత్రి కె.ఎస్.బాలగోపాలన్

● తొలిసారిగా వృద్ధులకు ప్రత్యేక బడ్జెట్ ● సంక్షేమ పెన్షన్‌లకు రూ.14,500 కోట్లు
● ఆశావర్కర్‌లు, వంట కార్మికులు, సాక్షరత ప్రేరక్‌లకు వేతనాల పెంపు
● ఉద్యోగులపై వరాల వర్షం, పిఆర్‌సి, అష్యూర్డ్ పెన్షన్ పథకం ప్రకటన
● అన్ని వర్గాలకు కేటాయింపులు : సిఎం పినరయ్ విజయన్
● కేరళ ప్రత్యామ్నాయాన్ని ప్రతిబింబించిన బడ్జెట్: బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** ప్రతి ఒక్క కుటుంబాన్ని తడుతూ, బడి పిల్లల నుంచి శ్రామిక మహిళలు, వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి సంక్షేమమే కేంద్రంగా కేరళ వామపక్ష సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం గురువారం రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది.సంక్షేమ పెన్షన్ లబ్ధిదారులు, సామాన్య కార్మికులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా అన్ని రంగాల వారికి పెద్ద పీట వేసింది. వృద్ధుల కోసం ప్రత్యేక ‘ఎల్డర్లీ బడ్జెట్ (పెద్దల బడ్జెట్)’ను ప్రవేశపెట్టి కేరళ దేశానికి

తరువాయి 12లో

# గద్దెపైకి సమ్మక్క

● చిలకల గుట్ట నుండి భారీ పోలీసు బందోబస్తు మధ్య సమ్మక్కను గద్దెకు చేర్చిన పూజారులు ● లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
● ఇప్పటికే 80లక్షలు దాటినట్లుగా అంచనా
● దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు ● జనసంద్రాన్ని తలపిస్తున్న మేడారం



దర్శించుకున్న కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, ఓరమ్

ప్రజాపక్షం/మేడారం/ములుగు

ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతరలో గురువారం మహాఘట్టం జరిగింది. జాతరలోనే అతి కీలక ఘట్టమైన సమ్మక్క తల్లి గద్దెకు చేరుకున్నది. చిలకల గుట్ట నుండి సమ్మక్క పూజారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య సమ్మక్కను గద్దెలపైకి చేర్చారు. తొలుత జాతరలో వెదురు కర్రలను గద్దెపై ప్రతిష్ఠించారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన సమ్మక్క పూజారులు ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం చిలుకల గుట్టకు చేరుకుని కుంకుమ భరిణ రూపంలో ఉన్న సమ్మక్కను మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు.దీంతో అప్పటికే వనదేవతలు పగిడిద్దరాజు, సారలమ్మ, గోవిందరాజులు మేడారం గద్దెలపైకి రావడంతో భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. గద్దెలను దర్శించుకున్న భక్తుల సంఖ్య ఇప్పటికే 80లక్షల పైగా దాటినట్లుగా అధికారులు చెబుతుండగా, గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 15 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్ల దర్శించుకున్నారని అంచనా వేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో సారలమ్మను, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, గోవిందరాజులను పూజారులు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం.. రహస్య పూజలు నిర్వహించిన అనంతరం గద్దెలకు చేర్చారు. ముగ్గురు దేవరులు గద్దెలపైకి చేరడంతో గురువారం తెల్లవారుజాము నుంచే గద్దెల వద్ద భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. గద్దెల ప్రాంగణానికి అనుసంధానమై ఉన్న క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఉదయం జంపన్న వాగువద్ద ఇసుక వేస్తే రాలనంత జనం కనిపించడం గమనార్హం. ఘాట్లకు రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర భక్తుల స్నానాలు ఆచరించే దృశ్యాలు కనిపించాయి. జంపన్న వాగుకు అను సంధానమైన రహదారులు ట్రాఫిక్ జామ్‌లతో కనిపించాయి. ప్రైవేటు వాహనాలను రద్దీ ప్రాంతాల్లోకి రానివ్వకుండా నివారించడంలో

తరువాయి 12లో



ఫోన్ ట్యాపింగ్ కేసులో
## కెసిఆర్‌కు నోటీసులు

● నేడు విచారణకు రావాలని పేర్కొన్న అధికారులు
● విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు లేఖ రాసిన మాజీ సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

:దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు గురువారం

తరువాయి 2లో

## సమాజాన్ని చీల్చే ప్రమాదం

● యుజిసి కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే
● రెగ్యులేషన్స్‌ను పున: పరిశీలించాలని జడ్జిలతో కూడిన కమిటీకి సూచన





**న్యూఢిల్లీ :** విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో కుల ఆధారిత వివక్షను నిరోధించడంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) జారీ చేసిన సమానత్వ (ఈక్విటీ) నిబంధనలపై గురువారం సుప్రీంకోర్టు ‘స్టే’ విధించింది. ఆ నిబంధనలు ప్రాథమికంగా ‘అస్పష్టమైనవి’, ‘దుర్వినియోగం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి’ అని నిరూపించిందని సర్వోన్నత న్యాయస్థానం కీలక

తరువాయి 2లో


## ఏ దేశానికీ చైనా ముప్పుకాదు

● ఇతరదేశాల అంగుళం భూమిని కూడా ఆక్రమించలేదు
● బ్రిటన్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం
● స్టార్మర్‌తో భేటీలో జిన్‌పింగ్ ప్రకటన
● బ్రిటన్ నుండి చైనాకు 30 రోజులు వీసాలేని ప్రయాణాలు



**బీజింగ్:** లోతైన సంబంధాలు పటిష్టం చేసుకోవడానికి దీర్ఘకాలిక సమగ్ర వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్య సహకారం కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఉద్ఘాటించారు. మూడు రోజులు చైనా పర్యటనలో ఉన్న కీర్‌స్టార్మర్–జిన్ పింగ్ మధ్య బీజింగ్‌లోని గ్రేట్‌హాల్‌లో అనుకున్నదానికంటే రెట్టింపు సమయం ముఖాముఖీ సమావేశం జరిగింది.
రెండు దేశాలమధ్యా సంబంధాల్లో మలుపులు, మెలికలూ ఉన్నప్పటికీ ఇరు దేశాలమధ్యా సంబంధాలు మాత్రం అనివార్యంగా కొనసాగుతాయని జిన్‌పింగ్ అన్నారు. చైనా ఎంతగా అభివృద్ధి చెందినా, ఎలా అభివృద్ధి చెందినా ఏ ఇతర దేశానికీ ముప్పు కలిగించదని అన్నారు. శాంతియుతమైన అభివృద్ధితో చైనాకు ఉన్న నిబద్ధతను జిన్‌పింగ్ ఉద్ఘాటించి చెబుతూ, చైనా ఎప్పుడూ ఎక్కడా యుద్ధం ప్రారంభించలేదని, విదేశాలకు చెందిన ఒక్క అంగుళం భూమిని కూడా ఏనాడూ ఆక్రమించలేదని స్పష్టం చేశారు. ప్రపంచశాంతి,సుస్థిరత, ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాల రీత్యా రెండు దేశాలమధ్యా మరింతగా సంభాషణలు జరగడం అనివార్యమని జిన్‌పింగ్ అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధానంతరం ప్రపంచ క్రమానికి ఎదురైన సవాళ్ళను, నాటో మిత్రులు,గ్రీన్‌లాండ్, ఇరాన్‌తో అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ విషయాలను నాయకులిద్దరూ ప్రస్తావించకపోయినప్పటికీ వ్యక్తీకరణలో

తరువాయి 12లో



## గుట్టలో గోల్డ్ డాలర్ల మాయం!

● ఆడిట్‌లో వెలుగుచూసిన అవకతవకలు ● భక్తుల్లో ఆందోళన
● విచారణకు ఆదేశించిన మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ ప్రసిద్ధ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఆలయ ప్రచార విభాగానికి చెందిన రూ.20 లక్షల విలువైన బంగారు డాలర్లు మాయమైనట్లు వార్షిక ఆడిట్‌లో బయటపడటంతో తీవ్ర కలకలం నెలకొంది.ఈ ఉదంతంపై విచారణ జరిపాలని దేవాదాయ శాఖ మంత్రి

తరువాయి 2లో

# ఇరాన్ మెడలు వంచేందుకు ట్రంప్ తీవ్ర యత్నం





**వాషింగ్టన్ :** సమయం మించిపోతోందని, ఇరాన్ తొందరపడి అణు ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక చేశారు. అణ్వాయుధాలను నివారించే ఒప్పందం అన్ని దేశాలకూ మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో ఇరాన్ ప్రభుత్వం కూడా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. అమెరికా చర్యలను వివరిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరింది. ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా ట్రంప్‌కు దీటుగా సమాధానం ఇచ్చారు. యుద్ధం ముంచుకువస్తే తమదేశం బలంగా ప్రతిఘటిస్తుందని మరోసారి ప్రతి హెచ్చరిక చేశారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయడం లేదని శాంతియుత ప్రయోజనాలకోసమే అణుశక్తిని ఉపయోగిస్తోందని మరోసారి ఆయన ఉద్ఘాటించారు. అమెరికా ఇరాన్ మధ్య గత ఏడాది ఏప్రిల్ 12 వ తేదీన వరుసగా ఐదుసార్లు అణు చర్చలు పలుచోట్ల జరిగాయి. ఆ తర్వాత ఈ చర్చల్లో ఫలితాలు రాకపోవడంతో నిరవధికంగా వాయిదాపడ్డాయి. ఇక ఉద్రిక్తతలు పెరిగి ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా వరుస దాడులు చేశాయి. అప్పటినుండీ ఇప్పటివరకూ ఆ ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌లో ఖమేనీ పరిపాలన అంత్య దశకు చేరిందని ట్రంప్ పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. పశ్చిమాసియాకు మరిన్ని యుద్ధ విమానాలను మోసుకెళ్ళే నౌకల దండు బయలుదేరిందని బుధవారంనాడే ట్రంప్ ప్రకటించారు. అబ్రహాంలింకన్ నౌక నుండి ఇప్పటికే అమెరికా సేనలు ఇరాన్ సమీపంలో గగనతల విన్యాసాలు చేస్తున్నాయి. ఇదేసమయంలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సెనేట్ విదేశీ వ్యవహారాల కమిటీ ఎదుట మాట్లాడుతూ, ఇరాన్‌లో ఆ దేశ సర్వాధినేత ఆయొతొల్లా అలీ ఖమేనీని అధికారం నుండి తప్పిస్తే చివరకు పరిపాలనపగ్గాలు ఎవరి చేతుల్లోకి వెళతాయో తెలియదన్నారు. ఐతే ఇరాన్ మాజీ యువరాజుగా ప్రకటించుకున్న రెజా పహ్లావీ చాలా దశాబ్దాల అజ్ఞాతం తర్వాత అమెరికా ప్రోత్సాహంతో ఇరాన్‌లో అడుగుపెట్టేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. ఇరాన్‌కు వెళ్ళేందుకు సమయం కోసం ఆయన కాచుకుని ఉన్నారు.

**వెనిజులాకు సోఫియా నౌకను స్వాధీనం చేసిన అమెరికా :** కరీబియన్ జలాల్లో స్వాధీనం చేసుకున్న అతిపెద్ద చమురు నౌక సోఫియాను వెనిజులాకు అమెరికా తిరిగి స్వాధీనం చేసింది. గడచిన ఆరునెలలుగా వెనిజులాపై ప్రత్యేక మిషన్‌ను నడిపిన అమెరికా కరీబియన్ జలాల నుండి ఏడు వెనిజులా నౌకలను స్వాధీనం చేసుకుంది. వీటిల్లో అతిపెద్దదైన సోషియా నౌకను మొదటి విడతతా వెనిజులా తాత్కాలిక ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. జనవరి మూడో తేదీన వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్‌చేసి న్యాయార్క్‌కు తరలించిన తర్వాత కూడా కరీబియన్ జల్లాలలో మాఫియా డ్రగ్స్ ముఠాల పేరుతో ఒక పడవపై అమెరికా దళాలు దాడిచేసి ఇద్దరిని హతమార్చాయి. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలితో సానుకూల సంబంధాలు కొనసాగించే క్రమంలో భాగంగా సోఫియా నౌకను స్వాధీనం చేశారు. ఇదే సమయంలో వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌కు పోలీసులు, సైనికులు పూర్తి విధేయత ప్రకటించారు. అంతర్గత సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోవాలని ఆమె ఇప్పటికే దేశంలోని అన్ని విభాగాలకు పిలుపు ఇచ్చారు.

## బాగ్దాద్‌లో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు



**బాగ్దాద్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో వందలాదిమంది నిరసన ప్రదర్శన జరిపారు. బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయం ఎదుట గురువారం వందలమంది గుమిగూడి అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. ఇరాక్ దేశ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని నినాదాలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ అనుసరిస్తున్న దుందుడుకు విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఇరాక్‌లో ఎవరు ప్రధానమంత్రిగా ఉండాలో ట్రంప్ నిర్ణయించలేరని, ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విధమైన జోక్యం ఇరాక్ సార్వభౌమాధికారాన్ని, ఇరాన్ ప్రజాస్వామ్య విధానాన్ని ఉల్లంఘించడమేనని ప్రదర్శకులు విమర్శించారు. ఇరాన్ మాజీ ప్రధానమంత్రి నూరీ అల్ మలికిని తిరిగి ప్రధానమంత్రి పదవిలో కూర్చోబెడితే సహించేదిలేదని, ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించబోమని, ఆ దేశంతో సంబంధాలు తెంచుకుంటామని ట్రంప్ చేసిన హెచ్చరికలతో బాగ్దాద్‌లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. 2006 నుండి 2014 వరకూ అల్ మలికి ఇరాక్ ప్రధానమంత్రిగా ఆ తర్వాత రెండేళ్ళు ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. ఇరాక్ పార్లమెంటులో అత్యధికంగా ఉన్న షియా ప్రజాప్రతినిధుల కూటమి గడచిన శనివారం అల్ మలికీని దేశ ప్రధానమంత్రి పదవికి ఎంపిక చేస్తూ తీర్మానం చేసింది. తదుపరి ప్రభుత్వానికి మూడోసారి ఆయనే ప్రధానమంత్రిగా నాయకత్వ బాధ్యతలు తీసుకుంటారని షియా కూటమి ప్రకటించింది. దీనిని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## ద.కొరియా మాజీ ఫస్ట్‌లేడీకి 20నెలల జైలుశిక్ష



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుఖ్ యోల్ సతీమణి, ఆ దేశ మొదటి పౌరురాలు(మాజీ) కిమ్ కియోన్ హీ (52)కు సియోల్ సెంట్రల్ జిల్లా న్యాయస్థానం అవినీతి కేసులో ఇరవై నెలలు జైలుశిక్ష విధించింది. రెండు లగ్జరీ హ్యాంగ్‌బ్యాగ్‌లు, బిఎండబ్ల్యు కారు డీలర్‌షిప్, ఒక వివాదాస్పద చర్చి వంటివన్నీ ఆమెపై కేసు విచారణకు, జైలుశిక్షకు దారితీశాయి. గత ఏడాది ఆగస్టు నెలలో దర్యాప్తు అధికారులు కియోన్ హీను అరెస్టు చేశారు. మతపరమైన వివాదాస్పద యూనిఫికేషన్ చర్చికి మేలు చేసినందుకుగాను చర్చి నుండి ఆమె వజ్రాల హారం, లగ్జరీ ఛానెల్ బ్యాగ్ వంటివాటిని లంచాలు తీసుకున్నందుకు న్యాయస్థానం ఆమెను దోషిగా నిర్ధారించింది. బిఎండబ్ల్యు డీలర్ డ్యూచ్ తో కలిసి మోటార్ స్టాక్ ధరలను రిగ్గింగ్ చేయడం ద్వారా 2010–2012 మధ్యకాలంలో 552,570 డాలర్లు ఆమె సంపాదించారని న్యాయస్థానం ఎదుట ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. 2024లో ఆమె భర్త, దేశాధ్యక్షుడు యూన్‌సుఖ్ యోల్ దేశంలో మార్షల్ లా విధించి తప్పిదం చేయడంతో ఆయన పదవీచ్యుతుడయ్యారు. ఐదేళ్ళు జైలుశిక్షకు గురయ్యారు. ఐతే భర్త నిర్ణయాల్లో కియోన్ హీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమె అవినీతి కేసులో శిక్షకు గురయ్యారు. మూడు నేరాల కింద ఆమెకు 15 సంవత్సరాలు జైలు శిక్ష విధించాలని ప్రాసిక్యూటిర్ వాదించారు.

## వియత్నాం–యూరప్ మధ్య మరింత మెరుగైన భాగస్వామ్య బంధం

**హనోయ్ :** వియత్నాం–యూరోపియన్ యూనియన్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలు నాయకులు మరింత మెరుగైన స్థాయిలో పునరుద్ధరించుకున్నారు. భారత్‌తో వ్యూహాత్మక,దీర్ఘకాలిక సమగ్ర స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం చేసుకున్న తర్వాత యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా గురువారం వియత్నాంలో పర్యటించి ఇప్పటివరకూ ఉన్న భాగస్వామ్య ఒప్పందాన్ని మరింత మెరుగైనస్థాయిలో పునరుద్ధరించుకున్నారు. అమెరికా టారిఫ్ ఒత్తిడుల నేపథ్యంలో ప్రపంచక్రమం, వాణిజ్యం, ఇంధన భద్రత, సరఫరాల వ్యవస్థ ఏ మాత్రం దెబ్బతినకుండా ఉండటంకోసం మరింత శక్తిని కూడదీసుకునేలా ఈ మెరుగైనస్థాయిలో ఒప్పంద పునరుద్ధరణ జరిగింది. దేశంలో ఆర్థిక వృద్ధి సాధ్యమని వియత్నాం కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి తో లామ్ ప్రకటించిన వారంరోజుల తర్వాత ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

## దక్షిణాఫ్రికాలో ప్రమాదం : 11 మంది మృతి

**జోహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికాలో ఒక మినీబస్ టాక్సీ, లారీ ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. డర్బన్ నగర సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన జరిగిందన రవాణా విభాగం అధికారి సిబొనిసో దుమా చెప్పారు. మరణించినవారిలో ఒక పాఠశాల విద్యార్థి కూడా ఉన్నారు. లారీ డ్రైవర్ యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వారం రోజుల క్రితం దేశంలో జరిగిన ఘోర ప్రమాదంలో 14 మంది స్కూలు పిల్లలు మరణించారు. ఈ ఘటన మరువకముందే మరో ప్రమాదం చోటుచేసుకుంది. మినీబస్ డ్రైవర్ నలిగిపోయిన భాగాలమధ్య ఇరుక్కుని మరణించాడు.

## 11మంది మాఫియా కుటుంబీకులకు ఉరి



**బీజింగ్ :** మయన్మార్ ఈశాన్య ప్రాంత సరిహద్దుల్లో అవినీతిని ప్రోత్సహించే అనేక కేంద్రాలను నడిపిని ఒకే కుటుంబానికి చెందిన 11 మంది మాఫియా సభ్యులను చైనా ప్రభుత్వం ఉరితీసింది. చైనా–మయన్మార్ మధ్య 2,129 కి.మీ పొడవునా సరిహద్దులున్నాయి. ఈ సరిహద్దు ప్రాంతాల్లో మింగ్ కుటుంబానికి చెందినవారు హత్యలు, అక్రమాలు,మోసాలు,జూదం, వ్యభిచార గృహాలు వంటి అనేక నేర కేంద్రాలతో మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మయన్మార్ ప్రభుత్వం ఈ కుటుంబీకులను పట్టుకుని చైనాకు స్వాధీనం చేసింది. చైనా జెజియాంగ్ రాష్ట్రంలోని న్యాయస్థానం వారికి ఉరిశిక్షలు విధించి శిక్ష లు అమలు చేసిందని వార్తా నివేదికలు చెబుతున్నాయి. లక్కింగ్ అనే పట్టణాన్ని నడిపిన వంశాలలో మింగ్ వంశం ఒకటి. ఈ వంశీకులు చివరకు తరాలు మారేసరికి మాఫియా కార్యకలాపాలకు దిగారు. ఈ లక్కింగ్ పట్టణాన్ని మింగ్ కుటుంబీకులు అతి పెద్ద క్యాసినో, వ్యభిచార కేంద్రంగా మార్చడంతో ఈ మాఫియా కార్యకలాపాల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2023లో మయన్మార్ ప్రభుత్వం సైన్యంతో వెళ్ళి వారి మాఫియా సామ్రాజాన్ని కుప్పకూల్చి వారందరినీ అరెస్టు చేసింది. చైనాకు అప్పగించింది. ఇక మీదట ఇలాంటి మోసాలు చెల్లుబాటు కావని చైనా సందేశం పంపింది. కానీ ఇప్పుడు ఈ విధమైన మాఫియా కార్యకలాపాల కేంద్రాలన్ని చైనా సరిహద్దులకు దూరంగామయన్మార్–థాయ్‌లాండ్, కాంబోడియా, లావోస్ సరిహద్దు ప్రాంతాలకు తరలివెళ్ళాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మయన్మార్–ఆగ్నేయ ఆసియా ప్రాంతాలలో ఆన్‌లైన్ మోసాలు, కార్యకలాపాలు నిర్వహించడానికి లక్షలమందిని అక్రమంగా తరలించారు. ఈ విధంగా అక్రమంగా తరలించినవారిలో చైనా జాతీయులే ఎక్కువమంది ఉన్నారు. పైగా వీరంతా చైనీయులనే మోసం చేసి అక్రమంగా డబ్బులు గుంజుతున్నారన్నది ఐక్యరాజ్యసమితి నివేదిక చెబుతున్నది. గడచిన నవంబరునెలలో బాయ్ కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులను కూడా ఉరితీశారు. ఈ నేర కేంద్రాల కారణంగా 2015 నుండి 2023 వరకూ 14 మంది చైనీయులు మరణించారని, అనేకమంది గాయపడ్డారని తీర్పు సందర్భంగా చైనా కోర్టు పేర్కొంది.

## భాగస్వాములు కండి
(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానానికి స్పందించి వారితో సానుకూలంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌బిఎస్ విద్యార్థుల కెరీర్ లక్ష్యాలు, వృత్తి పరమైన సవాళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తెలుసుకున్నారు. అలాగే వృత్తి జీవనంలో విజయం సాధించడానికి అవసరమైన అంశాలు, తన వ్యక్తిగత అనుభవాల ఆధారంగా రూపొందించుకున్న విజయ మంత్రాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలోని ముఖ్యాంశాలను వివరిస్తూ, తమ నెట్‌వర్క్, ప్రతిభను వినియోగించి భారత్ అభివృద్ధి చర్యలలో భాగస్వాములు కావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో ఉన్న అవకాశాలు, రాష్ట్ర బలాబలాలను ప్రపంచానికి తెలియజేసే బ్రాండ్ అంబాసిడర్లుగా విద్యార్థులు ముందుకు రావాలని సిఎం కోరారు. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలో చదువుతున్న యువత దేశ అభివృద్ధికి దోహదపడాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కీలకమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అత్యంత ప్రమాదకరం
(మొదటి పేజీ తరువాయి)

ఖజురి (యుపి),బొకారో (ఝార్ఖండ్) డ్యాములు ప్రమాదకరంగా ఉన్నాయని ఆ శాఖ వెల్లడించింది. పార్లమెంట్‌లో ఎంపిలు లక్ష్మి నారాయణ, బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. దేశంలో 50 ఏళ్ల పైబడిన డ్యాములు 1681 ఉన్నాయని, ఇందులో గత ఏడాది వర్షాకాలంలో 6553 డ్యాములను తనిఖీ చేశామని, దేశ వ్యాప్తంగా 50 ఏళ్లకు పైబడిన 1,681 డ్యాములు ఉన్నట్టు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ ) రూపొందించిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ స్పెసిఫైడ్ డ్యాముల 2025 నివేదిక ఆధారంగా ఈ గణాంకాలను కేంద్రం ప్రకటించింది. వర్షాకాలంలో తనిఖీల్లో భాగంగా దేశంలోని డ్యామ్‌ల భద్రతను మూడు వర్గాలుగా వర్గీకరించింది. ఇందులో అత్యంత ప్రమాదకరం స్థితిని 'కేటగిరీ1' పరిధిలో పొందుపర్చింది. కాగా తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ బ్యారేజీ విషయంలో నిర్మాణ, భద్రత, స్థిరత్వం, దీర్ఘకాలిక దృఢత్వాన్నికాపాడేందుకు ఎన్‌డిఎస్‌ఎ సూచించిన వివిధ నివారణ , ప్రమాద నియంత్రణ చర్యలను అమలు చేయాలని కేంద్ర జలశక్తి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. బ్యారేజ్ భద్రతకు ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టలని స్పష్టం చేసింది.

## డాలర్లు మాయం!
(మొదటి పేజీ తరువాయి)

కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆదికారులను కోరారు. భక్తులకు అమ్మకానికి ఉంచిన బంగారు డాలర్ల నిల్వలు, రికార్డుల మధ్య భారీ తేడా ఉండటాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారని, ఈ వ్యవహారం ఆలయ పరిపాలనలో లోపాలు, నిర్లక్ష్యంపై అనుమానాలకు తావిస్తోందన్నారు.ఈ వ్యవహారం పై నేరాకి పాల్పడిన ఓ క్లర్క్ నుంచి ఇప్పటికే రూ.17 లక్షలు రికవరీ చేసినట్లు తెలిసింది. మరో రూ.3 లక్షలు రివకరీ చేయాలి ఉంది. అయితే ప్రతి ఏడాది యాదగిరిగుట్ట ఆడిట్ రిపోర్టు పరిశీలిస్తురు. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం ఆడిట్ చేస్తుండగా ఈ వ్యవహారం బయటపడింది. ఆలయ ప్రచార విభాగానికి చెందిన క్లర్క్ వెండి, బంగారు డాలర్లను విక్రయించి వచ్చిన సొమ్మును యాదగిరిగుట్ట దేవస్థానం అకౌంట్‌లో జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్నాడని తెలిసింది. ఇలా ఇతగాడు ఏడాది కాలంలో రూ.20 లక్షలు కాజేశాడని తేలింది. నెలవారి వాయిదాల చొప్పున నిందితుడి నుంచి రూ.17లక్షలు రికవరీ చేయగా మిగిలిన సొమ్మును కూడా రివకరీచేసే పనిలో పడ్డారు. ఇప్పటికే గతంలోనూ ఆలయ పరిపాలనపై ఆరోపణలు రావడంతో, ఈ తాజా ఘటన ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారినట్లు చర్చ సాగుతోంది.భక్తుల నమ్మకానికి భంగం కలిగించే ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే ఉద్యోగులు, అధికారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

## కెసిఆర్‌కు నోటీసులు
(మొదటి పేజీ తరువాయి)

నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెంబర్ 243/2024 కేసు విచారణలో భాగంగా కెసిఆర్‌కు జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి నోటీసులు జారీ చేశారు. సైబర్ నేరాలు, మోసం, ఫోర్జరీ తదితర తీవ్రమైన ఆరోపణలతో నమోదైన ఈ కేసు ప్రస్తుతం మరింత విచారణ దశలో ఉందని నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలు, పరిస్థితులపై కెసిఆర్‌కు అవగాహన ఉన్నట్లు దర్యాప్తులో వెలుగులోకి రావడంతో ఆయన వాంగ్మూలం అవసరమని ఎసిపి తను జారీ చేసిన నోటీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే కెసిఆర్ వయస్సు 65 ఏళ్లు దాటిన కారణంగా, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 160 నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్‌కు హాజరు కావడం తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. కావాలంటే స్వచ్ఛందంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు రావచ్చని, లేకపోతే హైదరాబాద్ నగర పరిధిలో తనకు అనుకూలమైన ఇతర ప్రాంతాన్ని సూచిస్తే అక్కడే విచారణ చేపడతామని నోటీసులో వెల్లడించారు. విచారణ జరిపే స్థలాన్ని ముందుగా తెలియజేయాలని కూడా సూచించారు.

ఈ నోటీసును జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి జారీ చేశారు. రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన వ్యక్తికి నోటీసులు జారీ కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**విచారణకు హాజరుకాలేను**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు స్పందించారు. ఈ మేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ డివిజన్ ఎసిపి వెకంటగిరికి గురువారం రాత్రి ఆయన లేఖ రాశారు. మున్సిపల్ ఎన్నికలు, నామినేషన్ల పర్వం కొనసాగుతుండడంతో శుక్రవారం విచారణకు హాజరు కాలేనని, తనకు కాస్త సమయం కావాలని కెసిఆర్ కోరారు. ఎర్రవెల్లిలోని ఫామ్హౌజ్లోనే విచారణ చేయాలని లేఖలో పోలీసులకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసిన తర్వాత విచారణ చేపట్టాలని కోరారు. బాధ్యత గల పౌరుడిగా విచారణకు సహకరిస్తానని అన్నారు. సిఆర్‌పిసి సెక్షన్ 160 ప్రకారం, విచారణ నిమిత్తం పిలవబడే వ్యక్తి 65 సంవత్సరాల పైబడినవారైతే, అతడిని అతని నివాస స్థలం తప్ప మరెక్కడికీ హాజరుకావాలని ఆదేశించరాదని చట్టం స్పష్టంగా పేర్కొంటుందని కెసిఆర్ గుర్తుచేశారు. మహిళలు, వృద్ధులు, శారీరకంగా బలహీనులైన వారిని కూడా వారి నివాసంలోనే విచారించాల్సి ఉంటుందని వివరించారు.కావున తనను కూడా తన నివాసంలోనే విచారించాలన్నారు. చట్టబద్ధమైన విచారణకు పూర్తి సహకారం అందిస్తానని, అయితే నిబంధనలకు విరుద్ధమైన ఆదేశాలను అంగీకరించలేనని లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

**సానుకూలంగా స్పందించిన సిట్ అధికారులు..**

కెసిఆర్ రాసిన లేఖపై సిట్ అధికారులు సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జరగాల్సిన విచారణను వారు వాయిదా వేసినట్లు సమాచరం. తదుపరి విచారణ తేదీలను త్వరలో ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

## చీల్చే ప్రమాదం
(మొదటి పేజీ తరువాయి)


వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోని పక్షంలో ఆ నిబంధనలు ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతాయని, 'సమాజాన్ని విభజిస్తుందని' అత్యున్నత న్యాయస్థానం మౌఖికంగా వ్యాఖ్యానించింది. యుజిసి కుల ఆధారిత వివక్షకు 'చేర్చబడని' నిర్వచనాన్ని స్వీకరించిందని, సంస్థాగత రక్షణ నుంచి కొన్ని వర్గాలను మినహాయించిందని వివిధ పిటిషన్లు వాదించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిబంధనలు వివిధ ప్రాంతాలలో నిరసనలకు దారితీసాయి. విద్యార్థి సంఘాలు, సంస్థలు దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌ను లేవనెత్తాయి. కేంద్రం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు నోటీస్ జారీ చేస్తున్నప్పుడు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ ఈ నిబంధనలను ప్రముఖ న్యాయమూర్తులతో కూడిన కమిటీ పున: పరిశీలించాలని సూచించింది.'ఇష్యూ నోటీస్ మార్చి 19న తిరిగి ఇవ్వబడుతుంది. సొలిసిటర్ జనరల్ నోటీస్...అదే సమయంలో 2026 యుజిసి నిబంధనలూ అలాగే ఉండనివ్వండి. 2012 నిబంధనలు కొనసాగుతాయి' అని బెంచ్ పేర్కొంది. విచారణ సందర్భంగా ధర్మాసనం ఇలా వ్యాఖ్యానించింది.'ప్రాథమికంగా రెగ్యులేషన్ భాష అస్పష్టంగా ఉందని మేం భావిస్తున్నాం. నిపుణులు భాషనుదుర్వినియోగం చేయకుండా మాడ్యులేట్ చేయాలో? లేదో? పరిశీలించాలి. కాగా వివక్షత ఫిర్యాదులను పరిశీలించడానికి 'ఈక్విటీ కమిటీలు' ఏర్పాటు చేయాలనే కొత్త నిబంధనలను జనవరి 13న నోటిఫై చేశారు. ఈక్విటీని ప్రోత్సహించడానికి ఈక్విటీ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఆదేశించాయి. యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈక్విటీ ఉన్నత విద్యా సంస్థల ప్రమోషన్) నిబంధనలు 2026 ప్రకారం కమిటీలలో ఇతర వెనకబడిన తరగతులు (సి, షెడ్యూల్డ్ కులాలు(ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి) దివ్యాంగులు, మహిళలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. కుల ఆధారిత వివక్షను ఎస్‌టిలు, ఎస్‌సిలు, ఒబిసిల సభ్యులపై వివక్షగా కచ్చితంగా నిర్వచించారనే కారణంతో పిటిషన్లు రెగ్యులేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించాయి. కుల ఆధారిత వివక్షను కేవలం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల సభ్యులపై వివక్ష మాత్రమే పరిమితం చేయడం ద్వారా యుజిసి జనరల్ లేదా నాన్ రిజర్వ్ వర్గాలకు చెందిన వ్యక్తులకు సంస్థాగత రక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని సమర్థవంతంగా నిరాకరించిందని, వారు వారి కుల గుర్తింపు ఆధారంగా వేధింపులు లేదా పక్షపాతాన్ని కూడా ఎదుర్కొంటారని పేర్కొంది. మృత్యుంజయ్ తివారీ న్యాయవాది వినీత్ జిందాల్, రాహుల్ దివాన్ దాఖలు చేసిన యుజిసి ఈక్విటీ రెగ్యులేషన్స్2026 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం విచారిస్తోంది.

## 7% వృద్ధిరేటు
(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం యొక్క అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. తక్కువ ప్రస్తుతం అత్యంత సానుకూల పరిస్థితుల్లో ఉందని సర్వే వెల్లడించింది. అన్ని రంగాల్లో విస్తృతంగా సాగుతోందని, గ్లోబల్ షాక్‌లు లేదా అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన వ్యవస్థ భారత్ వద్ద ఉందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధిరేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మధ్యకాలికంగా చూస్తే.. భారతదేశం యొక్క వృద్ధి పథం చాలా బలంగా ఉందని, ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. బడ్జెట్ 2026 కు అసలైన 'రిపోర్ట్ కార్డ్ కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఈ ఎకనామిక్ సర్వేను సమర్పించారు. ఆర్థిక వ్యవహారాల విభాగం రూపొందించిన ఈ కీలక పత్రం, ప్రభుత్వ ఆర్థిక పనితీరుకు ఒక నివేదిక లాంటిది.

### ఎకనామిక్ సర్వే ప్రస్తావించిన కీలక అంశాలు..

1. విపరీతంగా పెరుగుతున్న 'డిజిటల్ అలవాటు' భవిష్యత్తులో విద్యా వ్యవస్థపై, యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
2. ఉద్యోగావకాశాలు పెరగడానికి, నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి కొత్తగా ప్రవేశపెట్టబోయే నాలుగు లేబర్ కోడ్స్ ఉపయోగపడ తాయి.
3. వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధ్యమైనప్పటికీ, వాతావరణ సమస్యలు, సాగునీటి వనరుల తగ్గుదల వంటి సమస్యలు వేధిస్తున్నాయి.
4. కృత్రిమ మేధస్సు (ఎఐ) రంగంలో మన దేశం కొంత ఆలస్యంగా అడుగుపెట్టినప్పటికీ, వేగంగా దూసుకెళ్లే సత్తా ఉంది.
5. యూరియా ధర 45 కిలోల సంచీకి రూ. 242గా 2018 నుంచి కొనసాగుతున్నది. ఈ ధరను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలి. అయితే, అందుకు సమానమైన మొత్తాలను ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలి.
6. రైతులు స్వచ్ఛందంగానే పంట మార్పిడి విధానాలను అనుసరించాలి. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి ఈ చర్య అత్యవసరం. కాబట్టి, రైతులే స్వయంగా పంట మార్పిడిని అనుసరించాలి.
7. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, మొత్తం జాతీయోత్పత్తి (జిడిపి)లో 4.4 శాతంగా ఉండవచ్చని అంచనా. ఈ లోటును భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది.
8. ఒకవైపు పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తూనే, మరోవైపు 'విక్సిత్ భారత్' లక్ష్యాలను చేరడానికి వీలుగా పరిశ్రమలను ప్రోత్సహించాలి. ఈ రకంగా స్వల్పకాల, దీర్ఘకాల ప్రయోజనాలను ఒకే సమయంలో అందుకోవడానికి భారత్ ప్రయత్నించాలి.
9. ప్యాక్ చేసిన ఆహార వస్తువులను నిషేధించాలి. కనీసం, వాటి అమ్మకాలకు సంబంధించిన ప్రకటనలను ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకూ నిషేధించాలి. జంక్ ఫుడ్ వల్ల దేశ ప్రజలు, ప్రత్యేకించి పిల్లలు, యువత ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవాలి. జిఎస్‌టి రేటుతో సంబంధం లేకుండా ఇలాంటి ఆహారంపై 'అల్ట్రా–ప్రాసెస్డ్ ఫుడ్' (యుపిఎఫ్) పన్నులు వేయాలి.
10. ఒడిదుడుకులు లేని స్థిరమైన విదేశీ సంస్థాగత పెట్టుబడులు రాబట్టుకునేందుకు ప్రభుత్వం బహుళ ప్రయోజన విధానాలను అనుసరించాలి.
11. పిల్లలకు విద్యా సంబంధమైన అంశాలను అందిస్తున్నట్టు ప్రకటించుకుంటున్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ సంస్థలే, అందులో పేర్కొన్న లేదా వివరించిన అంశాలకు బాధ్యత వహించాలి. అదే విధంగా ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అమలు చేస్తున్న రీతిలో, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను ఉపయోగించుకోవడానికి కనీస వయసును ఖరారు చేయాలి. కొవిడ్ 19 కాలంలో అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ బోధనా విధానాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాలపై ఆధారపడడాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించుకోవాలి. పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన, సులభంగా ఉపయోగించగలిగే టాబ్స్ వంటి పరికరాలు ఇవ్వాలి.
12. ఏప్రిల్ నుంచి అమలుకానున్న నాలుగు లేబర్ కోడ్స్ వల్ల దేశంలో ఉద్యోగితా శాతం పెరుగుతుంది. ప్రైవేటు రంగంలో పెట్టుబడులు అధికమవుతాయి.
13. ఆర్‌టిఐ చట్టాన్ని పునఃసమీక్షించాలి. రెండు దశాబ్దాల క్రితం నాటి ఈ చట్టాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సిన అవసరం ఉంది.
14. జిఎస్‌టి వంటి చట్టాల్లో సంస్కరణలను 2027లో అమల్లోకి తీసుకురావాలి.
15. 2027 నాటికి ద్రవ్యోల్బణం ప్రస్తుత అంచనాలకు మించి ఉండవచ్చు.
16.గిగ్‌వర్కర్లకు కొత్త విధానాలను రూపొందిం చాలి.
17. ఐరోపి దేశాలతో కుదిరిన ఒప్పందాల వల్ల దేశంలో ఉత్పత్తి రంగం బలోపేతం అవుతుంది.
18. 'స్వదేశీ' వస్తువులను వాడాలని ప్రచారం చేయాలి. తద్వారా దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి. దీనితో దేశంలో ఉత్పత్తితో పాటు ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి. విదేశాలకు ఎగుమతులుపెరగడం తో, విదేశీ ద్రవ్య నిల్వలు పెరుగుతాయి.
19. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అస్థిర పరిస్థితుల కారణంగా, ఎలాంటి రిస్క్ లేని పెట్టుబడులుగా బంగారం, వెండిని పరిగణలోకి తీసుకోవడంతో, వీటి ధరలు పెరుగుతున్నాయి. మరి కొంతకాలం ఇదే పరిస్థితి ఉంటుంది.



## అదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టులను

# త్వరితగతిన పూర్తిచేయాలి

మామునూరు ఎయిర్‌పోర్టుకు భూమి అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని మామునూరు తరహాలోనే అదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పనిని వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని, ఆయన తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సిఎం కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సిఎం అన్నారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ భూమికి సంబంధించిన పత్రాలను డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క ప్రసంగిస్తూ 2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పదేళ్లు పరిపాలించిన వారు పట్టించుకోకపోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సిఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ నగరాలు అయిన కొత్తగూడెం, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును తెలంగాణ మంత్రివర్గం కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ముందుకు వెళ్లడం శుభ పరిణామమని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలుపెట్టారని, ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అని డిప్యూటీ సిఎం తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు రూ.300 కోట్లు అవసరమని గుర్తించి వాటిని వెంటనే విడుదల చేసి వడివడిగా అడుగులు వేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని డిప్యూటీ సిఎం తెలిపారు.

## రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా కార్యాచరణ

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వచ్చే 'ఆర్థిక సంవత్సర 2026–27' బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని, రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలిగే విధంగా కార్యాచరణ రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. 'తెలంగాణ విజన్2047' లక్ష్యాలను సాధించేందుకు వీలుగా శాఖల వారిగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, సచివాలయంలో బడ్జెట్ ప్రతిపాదనలపైన వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి, తదితర ఉన్నతాధికారులతో మంత్రి గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ శాఖకు కేటాయించిన బడ్జెట్, ఖర్చులు, రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న వ్యవసాయ, ఉద్యానవనం, సహకార, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల పథకాల వివరాలను ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. రైతులకు ఇన్‌పుట్ సరఫరా, విస్తరణ సేవలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ సదుపాయాలు, డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలు,సహకార సంస్థల పనితీరు వంటి పలు అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. అనంతరం మంత్రితుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలను సమగ్రంగా, స్పష్టమైన లక్ష్యాలతో సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు,మౌలిక వసతుల కల్పన, ఆధునిక సాంకేతికత అభివృద్ధి, కేంద్ర ప్రాయోజిత పథకాలను పూర్తిగా వినియోగించుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వృథా ఖర్చులకు ఆస్కారం లేకుండా, పథకాల అమలుకు నిజంగా అవసరమైన అంశాలను మాత్రమే గుర్తించి, ఖచ్చితమైన అంచనాలతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంపు, రైతుల ఆదాయం మెరుగుదల, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాల రూపకల్పన, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సమర్థవంతంగా అమలు జరగాల్సిన పథకాల అవసరాన్ని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, వాస్తవ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతు కేంద్రంగా వ్యవసాయ విధానాలు రూపొందించడం, పథకాల అమలులో పారదర్శకత, ఫలితాలపై దృష్టి సారించడమే ప్రభుత్వ లక్ష్యమని తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వ్యవసాయ,ఉద్యాన వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు జానయ్య, రాజిరెడ్డి, తెలంగాణ సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎం.డి కిరణ్,మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ :** కేంద్ర ప్రాయోజిత పథకాలకు గత ఏడాది కేటాయించిన నిధులకు అదనంగా మరో రూ. 200ల కోట్లను కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తద్వారా రాష్ట్రంలో నేషనల్ మిషన్ ఆన్ అగ్రికల్చర్, పర్‌డ్రాప్ మోర్ క్రాప్, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసే అవకాశాలు ఉంటాయన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఆరు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడారు. కేంద్రం గత ఏడాది కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంగా కేంద్ర నిధులను వినియోగించుకోకపోవడంతో రైతులు నష్టపోయారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 202526 సంవత్సరానికి కేంద్రం కేటాయించిన నిధులకు రాష్ట్ర వాటాను కూడా కలిపి మొత్తం నిధులను వినియోగించినట్లు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ దిశగా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి అభినందించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. పామాయిల్‌పైన ఉన్న దిగుమతి సుంకాన్ని పెంచే దిశగా కృషి చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు.

## విచారణ కాదు... ప్రతీకారం : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రస్తుతం విచారణల పేరుతో బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు నోటీసులు జారీ చేయడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఇది విచారణ కాదని, ప్రతీకారమని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది న్యాయం కాదని, ఇదొక రాజకీయ దురుద్దేశమన్నారు. నోటీసులు, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరని, తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కెటిఆర్ అన్నారు.

కక్షసాధింపు రాజకీయాలను బిఆర్ఎస్ ఖండిస్తుందన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా అన్యాయ పాలనపై తాము పోరాటాన్ని కొనసాగిస్తామని, తెలంగాణ చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తామని కెటిఆర్ చెప్పారు.

**చౌక బారు రాజకీయాలకు పరాకాష్ట : హరీశ్‌రావు**

'సిట్' పేరుతో కెసిఆర్‌కు నోటీసులు జారీ చేయడం సిఎం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని బిఆర్ఎస్ఎల్పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్ రెడ్డి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని, తెలంగాణ సమాజమంతా కెసిఆర్ వెంటే ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాజకీయ వేధింపులకు తాము భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కెసిఆర్‌ను టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని హరీశ్ రావు తెలిపారు.

**ఇది రాజకీయ కక్ష సాధింపు : వినోద్ కుమార్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు సిట్ నోటీసు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఖండించారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు. సాధ్యం కాని హామీలను ఆచరణలో అమలు చేయలేక పోలీసులను అడ్డం పెట్టుకుని బిఆర్ఎస్ నాయకులను నోటీసుల పేరుతో బెదిరించే యత్నం చేస్తే భయపడేది లేదని వినోద్ కుమార్ అన్నారు.

## సిఎం, మంత్రుల ప్రమేయం లేకుండా...

# ఫోన్ ట్యాపింగ్ జరగదు

సిట్ విచారణతో అసలు నిజాలు బయటికి వస్తాయి

కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంలో రాజకీయ దురుద్దేశం లేదు

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగవని, అధికారులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడబోరని, సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటికి వస్తాయని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో జరిగిన వాస్తవాలు తెలుసుకోవడానికి సిట్ ఎవరికి అయిన నోటీసులు ఇవ్వొచ్చన్నారు. కెసిఆర్ అంటే ఉద్యమ నాయకుడిగా తమకు గౌరవం ఉందని, కెసిఆర్‌కి సిట్ నోటీసులు ఇవ్వడంలో రాజకీయ దురుద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో గురువారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని, తీసుకోవాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ 500లకు పైగా నంబర్లు ట్యాపింగ్ అయ్యాయనే సమాచారం ఉందని, ఫోన్ ట్యాపింగ్ కేసులో పారదర్శక విచారణ జరగాలని, ట్యాపింగ్‌కు కారకులు ఎవరో తెలియాల్సి ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వాస్తవాలు బయటికి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

**ఇన్‌చార్జి మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉంది**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ జారీ విషయంలో ఇంచార్జ్ మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉందని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల కోసం డైవర్షన్ పాలిటిక్స్ చెయ్యాల్సిన అవసరం లేదని, మెజారిటీ స్థానాలు గెలుస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, ఎంఎల్ఎ భూపతి రెడ్డి, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్, కేశ వేణు సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఉన్నాయనే కెసిఆర్‌కు నోటీసులు..

నేరస్తులు పర్యవసానాలను ఎదుర్కొంటారా? లేదా? వేచి చూడాలి : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ అనేది చాలా బాధాకరమైన అంశమని, దీని పర్యవసనాలను నేరస్తులు ఎదుర్కొంటారా లేదా ? అనేది వేచి చూడాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గుంపు మేస్త్రీ చేపట్టిన సిట్ నాన్ సీరియస్‌గా జరుగుతుందని, ఎన్నికల జరుగుతున్నాయనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. హైదరాబాద్‌లో కవిత గురువారం మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణను పూర్తి చేసి ఈ కేసును కంక్లూడ్ చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా లేదని, ఫోన్ ట్యాపింగ్‌లో ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని కవిత అన్నారు.



## పారిశ్రామిక రంగంలో యువత రాణించాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎపి మంత్రి టి.జి.భరత్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ఆర్థికాభివృద్ధికి రెండు దశాబ్దాలకు పైగా అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం (ఎఐఎవిఐఎఫ్) ఎంతో కృషి చేస్తున్నదని, ప్రభుత్వ సహకారంతో రానున్న రోజుల్లో యువతకు పారిశ్రామిక రంగంలో మెలకువలు నేర్పించడంతో పాటు ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందిస్తామని ఎఐఎవిఐఎఫ్ అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి తెలిపారు. ఎఐఎవిఐఎఫ్ రజతోత్సవాలను ఫిబ్రవరి 1న హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని 'ప్రధాన్ కన్వెన్షన్'లో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గురువారం జరిగిన ఎఐఎవిఐఎఫ్ ప్రి లాంచ్ మీడియా సమావేశంలో అధ్యక్షుడు రాంబాబు పబ్బిశెట్టి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బత్తుల, సంయుక్త కార్యదర్శి కాశి విశ్వనాథం చింత, ట్రెజరర్ విజయ ప్రసాద్ గుంపల్లి, కన్వీనర్ మంచి రాజశేఖర్, మీడియా చైర్మన్ ఎర్రం బాలక్రిష్ణ తదితరులు కలిసి ఫోరం రజతోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్, గౌరవ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ ఎంఎల్ఎ ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంఎల్‌సి బొగ్గారపు దయానంద్‌తో పాటు పలువురు ఎంఎల్ఎ లు, ఎంపిలు, ఐఎఎస్ లు, ఐపిఎస్ లు, ఆర్యవైశ్య ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని నిర్వాహకులు వివరించారు. ఈ వేడుకల్లో పారిశ్రామిక రంగం పట్ల యువతలో ఆసక్తిని పెంపొందించేందుకు 50 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గత 25 ఏళ్లుగా ఫోరం యువ పారిశ్రామికవేత్తలకు పొత్సాహాన్ని అందిస్తున్నదని, వ్యాపార, వాణిజ్య రంగాలలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తూ వారి అభ్యున్నతికి తొడ్పడుతున్నామన్నారు.

## మేడారం సందర్శించిన భట్టి, మహేష్ గౌడ్



**ప్రజాపక్షం/మేడారం :** మేడారం మహా జాతరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,దనసరి సీతక్కలు ఆదివాసీ సాంప్రదాయ కళాకారుల నృత్య ప్రదర్శన ద్వారా స్వాగతం పలికారు. అనంతరం వారు మేడారంలోని సమ్మక్క, సారలమ్మ లకు నిలువెత్తు బంగారంతో అమ్మవార్లకు మొక్కులు సమర్పించి అనంతరం సమ్మక్క సారలమ్మ లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని తల్లులను వేడుకున్నామని, ప్రభుత్వం రూ.210 కోట్లతో చేపట్టిన చరిత్రాత్మక కట్టడాలు దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయన్నారు. గతం కంటే ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని పేర్కొన్నారు. వనదేవతలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలా సుఖ సంతోషాలతో ఉంచాలని వేడుకున్నారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, జువల్ ఓరం



**ప్రజాపక్షం/ములుగు :** మేడారం మహాజాతరలో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జువల్ ఓరం, ఎస్‌సి ఎస్‌టి సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలు ప్రత్యేక ఛాపర్ ద్వారా గురువారం మేడారానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ దివాకరులు గిరిజన ఆచార సాంప్రదాయాలతో కొమ్ముకోయ బృందం నృత్యాలతో గద్దెల ప్రాంగణానికి కొమ్ముకోయ కళాకారుల డబ్బుల దరువులు, కొమ్ముల కిరీటాల నృత్యాల నడుమ సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు సమ్మక్క సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మేడారం శాశ్వత అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క




**ప్రజాపక్షం/మేడారం :** మేడారం సమ్మక్కసారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ గురువారం వరకు దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**మేడారం శాశ్వత అభివృద్ధికి 70 ఎకరాల విస్తరణ**

మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు.దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు.జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్పలక్నవరంజంపన్న వాగు వరకు పైప్లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్ డ్యాములు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**దుష్ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి : మంత్రి సీతక్క**

సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, నార్సింగి సర్కిల్-45, ఎస్‌ఎల్‌పి జోన్ : జిహెచ్‌ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No.01/EE/CIR-45/SLPZ/GHMC/1-4/2025-26 తేదీ: 29-01-2026
**పని కేటగిరి:** సివిల్ పనులు, **అంచనా విలువ:** రూ.52.35 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 30.01.2026న మ.03.00గం.ల నుండి 06.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సర్కిల్-45, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్: 9063816949.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-45, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 14653-PP/CL/ADVT/1/2025-26, Date: 29-01-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-9, ఉప్పల్.
టెండర్ నోటీసు
TENDER NOTICE NIT No.26/EEC-9/UPL/GHMC/2025-26 తేదీ: 28-01-2026
**పని పేరు:** 4 పనుల కోసం: 'జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, చిల్కానగర్, వార్డ్ నెం. 7, శ్రీ రాఘవేంద్ర కాలనీ, రోడ్ నెం. 2, హౌస్ నెం. 2-17-76/3/10లో సిసి రోడ్డు వేయడం ద్వారా నీటి నిల్వను తొలగించడం. (వెడ్డర / సాగర / ఉప్పర కమ్యూనిటీ వ్యక్తులు మరియు సంఘాల కోసం రిజర్వ్ చేయబడింది)........ జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-9లోని ఉప్పల్ జోన్ ఇంజనీరింగ్ విభాగాన్ని పునరుద్ధరించడం.', **అంచనా విలువ:** రూ.71.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 06.02.2026న మ.02.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరి కిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.9, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-9, ఉప్పల్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 14642-PP/CL/ADVT/1/2025-26, Date: 29-01-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
కార్యనిర్వాహక ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.
కొటేషన్ల ఆహ్వాన నోటీసు
NIQ No.10/EE-II/KHAIRATABAD ZONE/GHMC/2025-26 తేదీ: 29-01-2026
**NIQ No.**10, **పని పేరు:** జిహెచ్‌ఎంసి, కేజెడ్, ఖైరతాబాద్ సర్కిల్-35, రెడ్ హిల్స్ డివిజన్-146 పరిధిలోని పబ్లిక్ గార్డెన్‌లోని రాయల్ మసీదు ప్రాంగణంలో రంజాన్ పండుగ (2026) సందర్భంగా 40 రోజుల పాటు తాత్కాలిక ప్రాతిపదికన గాల్వనైజ్డ్ వాటర్‌ప్రూఫ్ షీట్లు మరియు చెక్క ఫ్లోరింగ్‌తో సూపర్ స్ట్రక్చర్ (వాటర్‌ప్రూఫ్) సరఫరా మరియు ఏర్పాటు చేయడం ద్వారా పౌర సౌకర్యాలను కల్పించడానికి కొటేషన్లు ఆహ్వానించడమైనవి.

| | |
|---|---|
| టెండర్ నోటిఫికేషన్/బిడ్ ఆహ్వాన తేదీ/స్పెసిఫికేషన్ పొందే తేదీ | 30-01-2026 మధ్యాహ్నం 12.00 గంటలకు, |
| బిడ్ సమర్పణ చివరి తేదీ మరియు సమయం / (లేదా) సీల్డ్ కొటేషన్లు స్వీకరించే తేదీ | 02-01-2026 మధ్యాహ్నం 12.15 గంటలకు, |
| ప్రీ-క్వాలిఫికేషన్ మరియు టెక్నికల్ బిడ్లను తెరవడం | 02-01-2026 మధ్యాహ్నం 12.30 గంటలకు |

**గమనిక:-** స్పెసిఫికేషన్‌ను కార్యనిర్వాహక ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్ నుండి పొందవచ్చు మరియు సీల్డ్ కొటేషన్లను కార్యనిర్వాహక ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్‌లో సమర్పించాలి. కావున, అర్హత గల ఏజెన్సీలు పైన పేర్కొన్న కాలంలో అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్లను సమర్పించవచ్చు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 14692-PP/CL/ADVT/1/2025-26, Date: 29-01-2026

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
30-01-2026
www.prajapaksham.in


## మైనర్ బాలికపై అత్యాచారయత్నం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని కాపుగల్లు గ్రామంలో చోటు చేసుకున్న మైనర్ బాలిక అత్యాచారయత్నం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరు సంవత్సరాల మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 20 సంవత్సరాల యువకుడు అత్యాచారానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే కాపుగల్లు గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఒంటరిగా చూసిన నింధితుడు ఆమెపై దాడికి ప్రయత్నించినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తీవ్రంగా భయభ్రాంతులకు గురికావడంతో కుటుంబ సభ్యులు తొలుత విషయం బయటకు చెప్పలేకపోయారని సమాచారం. అనంతరం బాలిక ఆరోగ్యం, మానసిక పరిస్థితి మరింత క్షీణించడంతో ఘటన వెలుగులోకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు కౌన్సిలింగ్ కూడా అందిస్తున్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సర్పంచ్‌లు, అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు జవాబుదారీగా ఉండాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మిర్యాలగూడ మండలం లావూడితండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. ఎన్నికల హామీలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావూడి శ్రీహరి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, ఎంపీడీవో శేషగిరిరావు, మాజీ ఎంపీపీ ఎస్‌కె.జిందా, కార్యదర్శి బంటు వాని, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాడిని నియమించాలి

ఎంఇఒను నిర్బంధించిన ఎఐఎస్ఎఫ్ నాయకులు



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని పలివెల ప్రభుత్వ హై స్కూల్‌లో గత మూడు నెలలుగా తెలుగు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా విద్యాపరంగా నష్టపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం మండల విద్యాధికారి మల్లేశంను అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) బీసీ సంఘం నాయకులు గదిలో తాళం వేసి నిర్బంధించారు.అనంతరం విద్యార్థులతో కలిసి పలివెల చౌరస్తాలో తెలుగు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు గోపగోని ఉదయ్ మాట్లాడుతూ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నప్పటికీ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలుగు ఉపాధ్యాయిని నియమించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృ తం చేస్తామని హెచ్చరించారు.బీసీ సంఘం నాయకులు ఆనగంటి కృష్ణ ధర్నా కు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షులు గోసుకొండ మల్లేష్,చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెరుకు సైదులు,సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఆనగంటి నరసింహ,వరికుప్పల రాజు,కొండూరు మల్లికార్జున్, దాడి జితేందర్ రెడ్డి,మాధగోని మల్లయ్య గోసుకొండ రవి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలేరులో 25 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/ఆలేరు :** మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా నామినేషన్ కార్యక్రమం రెండో రోజు గురువారం ఆలేరు మున్సిపాలిటీకి 25 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. మొత్తం రెండు రోజుల్లో 35 నామినేషన్‌లు దాఖలయ్యాయని పార్టీల వారీగా బిజెపి పార్టీ తరపున ఆరుగురు, బిఆర్ఎస్ పార్టీ తరపున పది మంది, కాంగ్రెస్ పార్టీ తరపున ఆరుగురు, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో రేపు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, నియమ నిబంధనలు పాటించడం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని చుట్టుపక్కల వారిని చైతన్యవంతం చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా సూర్యాపేట పట్టణానికి చెందిన ఎమ్మెస్సార్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టడం చాలా మంచి ఉద్దేశమని వారిని అభినందించారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, అతివేగాన్ని నివారించడం వంటి పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఫోక్సో చట్టం గురించి తెలియజేశారు. ప్రమాదరహిత జిల్లాగా సూర్యాపేటను చూపించడం అందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆదిత్య, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఎమ్మెస్సార్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఉన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు పట్టణ ముఖ్య కూడళ్లలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలంటూ వాహనాలకు స్టిక్కర్లను అంటిపెడుతూ అవగాహన కల్పించారు.



# ఆరు మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యం!

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధీమా



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కాంగ్రెస్ ఎన్నికల బరిలోకి దిగుతోందని స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట (12 వార్డులు), ఆలేరు (12 వార్డులు) మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సీపీఐ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగి, ప్రతిపక్షాలకు తావులేకుండా క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని, పట్టణాల అభివృద్ధి వేగంగా జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అనివార్యం అన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా బూత్ స్థాయి నుంచి పనిచేయాలని అయిలయ్య సూచించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటే విజయం మనదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, బబ్బురి శ్రీధర్, పెరబోయిన బంగారి, గోరేటి రాములు, పేరబోయిన పెంటయ్య, కాంగ్రెస్, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బందారపు బిక్షపతి, ముక్కెర్ల మల్లేష్, గుండ్లపల్లి భరత్, సీపీఐ కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఊపందుకున్న నామినేషన్లు

సూర్యాపేట జిల్లా ఐదు మున్సిపాలిటీల్లో
2వ రోజు 432 నామినేషన్ల దాఖలు
సూర్యాపేటలో 230, హుజూర్‌నగర్‌లో 67,
తిరుమలగిరిలో 49, కోదాడలో 49, నేరేడుచర్లలో 37



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల్లో గురువారం నామినేషన్ దాఖలాలు రెండవ రోజు ఊపందుకుంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో మొదటి రోజు మొత్తం 24 నామినేషన్లు దాఖలు కాగా, రెండవ రోజు 432 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో సూర్యాపేటలో 230, హుజూర్‌నగర్‌లో 67, కోదాడలో 49, తిరుమలగిరిలో 49, నేరేడుచర్లలో 37 దాఖలు అయినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులకు గాను 230 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 94, బిఆర్ఎస్ నుండి 62, బిజెపి నుండి 28, బిఎస్‌పి నుండి 3, సిపిఎం 2, ఏఐఎంఐఎం నుండి 2, స్వతంత్ర అభ్యర్థులు 37 నామినేషన్లు దాఖలు చేశారు. కాగా మొత్తం నేటి వరకు 243 నామినేషన్లు దాఖలయ్యాయి. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులకు గాను 67 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 19, బిఆర్ఎస్ నుండి 27, బిజెపి నుండి 11, సిపిఎం నుండి 3, ఇతర పార్టీలు 3, స్వతంత్ర అభ్యర్థులు 4 నామినేషన్లు దాఖలు చేశారు. కోదాడ మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులకు గాను 49 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 11, బిఆర్ఎస్ నుండి 18, టిడిపి నుండి 6, బిజెపి నుండి 5, స్వతంత్ర అభ్యర్థులు 10 నామినేషన్లు దాఖలు చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులకు గాను 49 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 25, బిఆర్ఎస్ నుండి 17, బిజెపి నుండి 9, సిపిఎం 2, స్వతంత్ర అభ్యర్థులు 5 నామినేషన్లు దాఖలు చేశారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులకు గాను 37 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 17, బిఆర్ఎస్ నుండి 12, బిజెపి నుండి 5, టిడిపి నుండి 1, స్వతంత్ర అభ్యర్థులు 2 నామినేషన్లు దాఖలు చేశారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన అత్యంత అవసరం అని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్బంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎన్‌జి కాలేజ్ నుండి రామగిరి,క్లాక్ టవర్ వరకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్‌లు జండా ఊపి ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని,ఇది అత్యంత ఆందోళనకరమని అన్నారు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడమే జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు.ఒక్క క్షణ నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపంగా మారుతుందని హెచ్చరించారు.ట్రాఫిక్ పోలీసుల సూచనలను గౌరవిస్తూ, రహదారిపై శాసనబద్ధంగా ప్రయాణించడమే సురక్షిత జీవనానికి మార్గమని పేర్కొన్నారు. ఈబైక్ ర్యాలీలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.వాణి, డిటిఓ లావణ్య,డిఎస్‌పి శివరాం రెడ్డి,ఎంవిఐ కొండయ్య,మల్లికార్జున్ రెడ్డి,స్వప్న,యువకులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపల్ ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై గురువారం ఆయన తన ఛాంబర్లో మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 28 నుండి 30 వరకు నామినేషన్ల స్వీకరణ, 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 11న పోలింగ్, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. పార్టీల ఆధారంగా నిర్వహించే ఈ ఎన్నికల్లో అభ్యర్థులు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ఖర్చుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో వివరించడం జరిగిందన్నారు. అలాగే రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు పాటించాల్సిన నియమ, నిబంధనలపై వారికి వివరించినట్లు తెలిపారు. బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించే మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నోడల్ టీములను ఏర్పాటు చేయడమే కాకుండా, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి ఏర్పాటు చేశామని, ఈ బృందాలు అన్నిటికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. జిల్లాలో 2,26,586 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల, సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటిలలో 141 వార్డులలో, 372 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేశామని, ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల సామాగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సూర్యాపేటలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పెయిడ్ న్యూస్, ప్రకటనలు, సోషల్‌మీడియా, న్యూస్ తదితర న్యూస్‌పై జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటిని ఏర్పాటు చేయడం జరిగిందని, పోటీలో ఉన్న అభ్యర్థులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల సందర్భంగా పాటించాల్సిన నియమ, నిబంధనలు తదితర వివరాలను వెల్లడించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి యు వెంకటేశ్వర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## 12 వార్డులకు 53 నామినేషన్లు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి జరగనున్న ఎన్నికల కోసం 12 వార్డులకు గాను రెండవ రోజు గురువారం వరకు 53 మంది నామినేషన్లను దాఖలు చేశారు. అత్యధికంగా బిఆర్ఎస్ పార్టీ నుండి 19 మంది, కాంగ్రెస్ పార్టీ నుండి 17, బిజెపి నుండి 5, బిఎస్‌పి నుండి 4, ఇండిపెండెట్లు 3, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుండి 5 మంది నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. రేపు నామినేషన్లకు చివరి తేది కావడంతో మరిన్ని నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తప్పలకు తావులేకుండా నామినేషన్లు

**ప్రజాపక్షం/ హాలియా:** హాలియా మున్సిపల్ నామినేషన్ల కేంద్రాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ పరిశీలించారు. గురువారం హాలియాలోని నామినేషన్ కేంద్రంలో ఏర్పాట్లను, సౌక ర్యాలను పర్యవేక్షించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎటువంటి తప్పులకు తావు లేకుండా నామినేషన్ల కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## చండూరు మున్సిపాలిటీలో బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న
డిసిసిబి మాజీ డైరెక్టర్ కోడి సుష్మ
సన్‌షైన్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న
మరో 30మంది ముఖ్య నాయకుల చేరిక

**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపద్యంలో చండూరు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. చండూరు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి అన్ని తానై నడిపిస్తున్న సన్‌షైన్ విద్యా సంస్థల చైర్మన్, మున్సిపాలిటీ 1వ వార్డు మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న తో పాటు ఆయన సతీమణి నల్లగొండ డిసిసిబి మాజీ డైరెక్టర్ చండూరు రైతుసేవా సహకార సంఘం మాజీ చైర్మన్ కోడి సుష్మా బిఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేశారు. గురువారం చండూరులోని తన నివాసంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోడి వెంకన్న దంపతులకు కాంగ్రేస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో చండూరులో 15 సంవత్సరాలుగా



ముగ్గురు కోడి బ్రదర్స్ మద్యలో ఉన్న సమస్యలను పరిష్కరించి ముగ్గురు కోడి బ్రదర్స్‌ను ఏకతాటిపైకి తెచ్చి కోడి బ్రదర్స్ కుటుంబాలను కలిపిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. వీరితో పాటుగా మరో 30మంది బిఆర్ఎస్ నాయకులు కాంగ్రేస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం జరుగుతున్న చండూరు మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మరోసారి కాంగ్రేస్ జెండా ఎగురవేయడం ఖాయం అని పలువురు కాంగ్రేస్ నాయకులు ధీమ వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు , కాంగ్రేస్ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం పాల్గొన్నారు.

## రెండో రోజు 176 నామినేషన్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వివిధ పార్టీ అభ్యర్థులు గురువారం నామినేషన్లు వేశారు. మిర్యాలగూడ మున్సి పాలిటీలో మొత్తం 48 వార్డులు ఉండగా మొదటి రోజు కేవలం నాలుగు నామి నేషన్లు మాత్రమే రాగా రెండవ రోజు గురువారం ఏకంగా 176 నామినేషన్లు రావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ నుంచి 79 మంది, బిఆర్ఎస్ పార్టీ నుంచి 67, సీపీఎం పార్టీ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి 13 మంది, ఇండిపెండెంట్ అభ్యర్థులు 12 మందితో కలిపి మొత్తం 176 నామినేషన్లు వచ్చినట్లు మున్సిపల్ కమీషనర్ గనవేని శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్లు వేయడానికి శుక్రవారం ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో మూడవ రోజు నామినేషన్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. రెండో రోజు మార్గశిర శుద్ధ భీష్మ ఏకాదశి కావడం శుభదినంగా భావించి భారీగా నామినేషన్లు వేశారని తెలుస్తుంది.

## చండూరులో 29 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/చండూరు :** ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మొదటిరోజు 4 నామినేషన్లు దాఖలు కాగ, రెండవరోజు 29 నామినేషన్లు దాఖలు కావడం జరిగింది. మొదటి రెండవరోజు కలిపి 27మంది వివిధ పార్టీల నుండి,5మంది స్వతంత్ర అభ్యర్థులతో మొత్తం 33 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల సహాయ జిల్లా అధికారి ,మున్సిపల్ కమిషనర్ మల్లేశం తెలిపారు. అందులో కాంగ్రేస్ నుండి 15మంది, బిఆర్ఎస్ నుండి 4, బిజెపి నుండి 1, బిఎస్‌పి 6, సిపిఐ 1, జనసేన 1, స్వతంత్రులు 5 నామినేషన్లు దాఖాలు కావడం జరిగింది.

## సవ్యంగా నామినేషన్ల ప్రక్రియ



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని,మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సవ్యంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ మున్సిపల్ ఎన్నికల పరిశీలకులకు వివరించారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులుగా రాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ జి.రమేష్ ను నియమించింది.అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకట్ ఆడిత్యను మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకలుగా నియమించింది.ఈమేరకు సాధారణ పరిశీలకులు రమేష్,వ్యయ పరిశీలకులు వెంకటాదిత్యాలు గురువారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలిసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.అనంతరం సాధారణ పరిశీలకులు జి. రమేష్,నల్లగొండ మున్సిపాలిటీతో పాటు,చండూరు,చిట్యాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,మున్సిపల్ ఎన్నికల పరిశీలకుల నోడల్ ఆఫీసర్,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ ఉన్నారు.

## రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు శాఖ నిఘా

నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు సస్పెక్ట్ షీటర్లకు నల్లగొండ డిఎస్‌పి కార్యాలయంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి శివరాం రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి,రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని,రౌడీ షీటర్లు ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని నేరచరిత్ర కలిగిన ప్రతి ఒక్కరిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి,వారి నుండి మంచి ప్రవర్తన కలిగి ఉంటామని బాండ్ రాయించుకోవడం జరుగుతుందని బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే,బాండ్ మొత్తాన్ని జప్తు చేయడంతో పాటు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని వీరు ఏరాజకీయ పార్టీకి కొమ్ముకాయకూడదని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయకూడదని ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు,అవసరమైతే జిల్లా బహిష్కరణ వేటు వేయబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐలు రాఘవ రావు,రాజ శేఖర్ రెడ్డి ఎస్ఐలు సైదులు,సతీష్,గోపాల్ రావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హాలియాలో 40 నామినేషన్లు




**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రెండవ రోజు నామినేషన్లు వేసేందుకు ఆసక్తి చూపారు. నామినేషన్ల రెండో రోజు గురువారం అన్ని పార్టీలు కలిపి 40 నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.పార్టీల వారీగా ఇండిపెండెంట్ లు5, కాంగ్రెస్ పార్టీ నుంచి19,బీఆర్ఎస్ నుంచి 13,బిఎస్‌పి నుంచి 1,బీజేపీ నుంచి 2 నామినేషన్లు వచ్చినట్లు చెప్పారు. నామినేషన్లకు చివరి గడువు నేటితో ముగియ నుండడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థులు నేడు నామినేషన్లు వేయనున్నట్లు తెలిసింది.

## ఉపకారం కాదు.. అవసరం

### సాగుకు మద్దతుపై సిపిఐ ఎంపి సందోశ్ కుమార్



**న్యూఢిల్లీ:** రబ్బర్, టీ, కాఫీ సాగుచేసే రైతాంగం సంక్షోభంలో చిక్కుకుపోవడంపై సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేరళలో వాణిజ్య పంటల సాగు నష్టాల్లో ఉన్నట్లు తెలిపారు. తక్షణమే జోక్యం చేసుకొని, సముచిత మద్దతు అందించడం అవసరమని కేంద్రానికి సూచించారు. సందోశ్ కుమార్ గురువారం రాజ్యసభలో మాట్లాడుతూ ప్లాంటేషన్ రంగం పరిస్థితిని వివరించారు. తక్షణమే జోక్యం చేసుకోవడం అంటే ఉపకారం చేసినట్లు కాదని, ఇది అవసరమైన చర్య అని సందోశ్ కుమార్ స్పష్టం చేశారు. 'ఈ రంగం కనీస లాభాలతో మనుగడ సాగిస్తోంది. పెరుగుతున్న సాగు వ్యయంతో ఇబ్బంది పడుతోంది. నేలలో సారం క్రమంగా తగ్గిపోవడం కూడా సమస్యగా మారింది' అని సిపిఐ ఎంపి అన్నారు. భారత్‌లో సాకుకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకాలను విమర్శించారు. వాటి వల్ల వాణిజ్య పంటల సాగు దెబ్బతింటోందని, వ్యవసాధారిత ఆదాయం ప్రభావితమవుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తెచ్చిన విధానాలతో రైతుల, పంటల సాగు బలహీనం కాగా, ప్రస్తుతం బిజెపి పాలన ఆ పరిస్థితి మరింత క్షీణింపజేస్తోంని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో రైతన్నకు సాగు భారంగా మారుతోందని సందోశ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణం

### ఎపిలో తగ్గుతున్న ద్రవ్యోల్బణం

### ఆర్థిక సర్వే వెల్లడి



**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో తెలుగు రాష్ట్రాల్లోని అభివద్ధి అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలు విషయాలను ఆర్థిక సర్వే వివరించంది. ఎపిలో ఏటా ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోందని తెలిపింది. తెలంగాణలో సాగుకు యోగ్యమైన భూ విస్తీర్ణం పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగు విస్తీర్ణం మెరుగుపడినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో ద్రవ్యోల్బణం 2022–23లో 7.57 శాతం ఉంటే... 2025–26 నాటికి 1.39 శాతానికి తగ్గిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. తెలంగాణలో 8.61 శాతం నుంచి 0.20 శాతానికి దిగిందని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సగటు ద్రవ్యోల్బణం 1.72 శాతం కంటే తక్కువగా నమోదైనట్లు వివరించింది. అకాల వర్షాలు, ప్రకతి ప్రకోపాల కారణంగా వ్యవసాయ దిగుబడి తగ్గుతోందని పేర్కొంది. కొత్త నగరాల విస్తరణ, అభివద్ధి వ్యవహారాల్లో ఏపి రాజధాని అమరావతి గురించి ప్రస్తావించింది. అమరావతి హరిత నగర నిర్మాణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నగర నిర్మాణంలో అరుదైన అవకాశాలు అమరావతికి లభించాయని తెలిపింది. వాణిజ్య సంస్కరణల కార్యాచరణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, దీని కారణంగా రాష్ట్రంలో వ్యాపార వాతావరణం మెరుగుపడుతోందని అభిప్రాయపడింది. సింగిల్ విండో ద్వారా పారిశ్రామిక అనుమతులు మంజూరు చేయడాన్ని ఆర్థిక సర్వే ప్రస్తావించింది. రాష్ట్రంలో 6,900 గ్రామాల్లో 81 లక్షల భూకమతాల రీ సర్వే, 86 వేల సరిహద్దు వివాదాలు పరిష్కారమయ్యాయని వివరించింది. ఏపిలో ప్రపంచ స్థాయి బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. పంజాబ్, ఏపి, గుజరాత్‌కు విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని సర్వే వెల్లడించింది. దేశంలో జీవన యోగ్య నగరాల్లో టాప్ 10లో విజయవాడ, తిరుపతి నిలిచినట్లు తెలిపింది. ఇక తెలంగాణలో సాగుకు యోగ్యమైన భూ విస్తీర్ణం 2014–23 మధ్య 1.31 కోట్ల ఎకరాలు ఉందని, అది 2.21 కోట్లకు పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటా నమోదు చేసినట్లు పేర్కొంది. ఏఐ స్టార్టప్‌ల్లో తెలంగాణ వాటా 7 శాతం కాగా... 30 శాతంతో కర్నాటక అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సర్వీసుల్లో కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల వాటా 40 శాతంగా ఉంది. భూభారతి పోర్టల్ ద్వారా రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల విభాగాలను తెలంగాణ ఏకీకతం చేసింది. అత్యధిక పట్టణ జనాభాలో ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూ రు, హైదరాబాద్ ఉన్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. అత్యంత వేగంగా అభివద్ధి చెం దుతున్న నగరాల్లో హైదరాబాద్ నాలుగో స్థానం, విజయవాడ 10వ స్థాన ంలో నిలిచాయి. 2035 నాటికి హైదరాబాద్ జిడిపి 201.4 బిలియన్ డాలర్లు, విజయవాడ 21.3 బిలియన్ డాలర్ల స్థాయికి పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.

## మోదీది కపటత్వంతో నిండిన సందేశం

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ విమర్శ

**న్యూఢిల్లీ :** బడ్జెట్ సమావేశాలపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. ప్రతి సమావేశం ప్రారంభానికి ముందు ఆయన సాధారణ కపటత్వంతో నిండిన సందేశాన్ని దేశానికి అందజేస్తారని, ప్రస్తుత పని తీరు కూడా ఈ శ్రేణిలో భాగమేనని మండిపడింది. 'జాతీయ సమస్యలపై ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవడానికి ఆయన (ప్రధాని) అంగీకరించరు. అఖిలపక్ష సమావేశాలకు అధ్యక్షత వహించరు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జ్ జైరాం రమేష్ పేర్కొన్నారు. చివరి నిమిషంలో అకస్మాత్తుగా బిల్లులను ప్రవేశపెట్టి, అవసరమైన శాసనసభ పరిశీలన లేకుండా పార్లమెంటును బుల్డోజర్‌తో ముంచెత్తుతారని, మోదీ పార్లమెంటులో కూర్చుని ప్రతిపక్ష నాయకుల ఆందోళనలకు స్పందించరని, బదులుగా ఉభయ సభలలో ఎన్నికల ర్యాలీ ప్రసంగాలు చేస్తారని రమేష్ పేర్కొన్నారు. ప్రతి సమావేశం ప్రారంభానికి ముందు, పార్లమెంటును నేపథ్యంగా చేసుకుని ఆయన తన సాధారణ కపటత్వంతో నిండిన 'దేశ్ కే నామ్ సందేశ్' చేస్తారని ధ్వజమెత్తారు.

## పార్లమెంటరీ విలువలు పాటించండి

### రాజ్యసభ సభ్యులకు చైర్మన్ రాధాకృష్ణన్ పిలుపు




**న్యూఢిల్లీ:** సభ్యులు సభా మర్యాద పాటించాలని, సభలో ప్రయోజనాత్మకమైన చర్చలు జరపాలని బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ పిలుపు ఇచ్చారు.ఎగువసభ 217వ సమావేశం సందర్భంగా గురువారం ఉదయం ఆయన సభలో తొలి ప్రసంగం చేస్తూ, 2026–27 బడ్జెట్ సమావేశాల చర్చలను ఫలప్రదం చేసేందుకు, ఇతర కీలకమైన శాసన ప్రతిపాదనలను ఆమోదించేందుకు వీలుగా సభ్యులు అత్యున్నతమైన ప్రామాణిక పార్లమెంటరీ విలువలను, మర్యాదను పాటించాలని కోరారు. పార్లమెంటరీ పార్టీల నాయకులు,సభ్యులు పూర్తి సహకారం అదించడం ద్వారా స్వయంసమృద్ధమైన, సంపద్వంతమైన, వికసిత్ భారత్ ప్రయాణంలో జరిగే ఈ చర్చలు అత్యంత ప్రయోజనాత్మకంగా, పటిష్టంగా, ఒక మైలురాయిగా ఉండేలా చేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య అత్యున్నత ప్రమాణాలను ప్రతిబింబించేలా ఈ బడ్జెట్ సమావేశాలను మనందరం కలిసి విజయవంతం చేద్దామని కోరారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధానదేశంగా ముందుపిఠిన నిలబడి ఉందని, ప్రపంచ మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ప్రయాణిస్తోందని అన్నారు. ''భారతదేశ ప్రభావం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ ఉన్నతి,స్థాయా రోజు రోజుకూ పెరుగుతోంది, ఈ పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్ది దిశా నిర్దేశం చేయడంలో అత్యున్నతమైన చట్టసభ సభ్యులుగా మనం కీలకపాత్ర పోషించాలి'' అని రాధాకృష్ణన్ కోరారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో రాజ్యసభ 30 సార్లు సమావేశమవుతుంది. కేంద్ర బడ్జెట్ పరిశీలనపైన, ప్రతిపాదిత శాసన తీర్మానాలపైన ప్రధానంగా దృష్టి సారిస్తుంది. శాఖాపరంగా పార్లమెంటరీ స్థాయా సంఘాలు కూడా విరామ సమయంలో గ్రాంట్స్‌కు సంబంధించిన డిమాండ్లను పరిశీలన చేస్తాయి. ''ఎగువసభపై తమదైన ముద్రవేసేవిధంగా సభ్యులు చర్చల్లో పాల్గొనాలి, అదేవిధంగా సభా కమిటీలలో కూడా తమ ప్రభావాన్ని చూపించాలి'' అని కోరారు. రాబోయేరోజుల్లో తక్కువ సమయంలో భారీ ఎత్తున శాసనపరమైన విధులు నిర్వర్తించాల్సి ఉందని ఆయన పదే పదే గట్టిగా చెబుతూ ప్రతి సభ్యుడూ బాధ్యతగా మెలగాలని కోరారు. చట్టసభలో క్రమశిక్షణను ప్రతి సభ్యుడూ పాటించాలని కోరారు. ''భిన్నాభిప్రాయాల ద్వారా, స్ఫూర్తిమంతమైన చర్చల ద్వారా మన ప్రజాస్వామ్యం వికసిస్తోంది, పరస్పర గౌరవంతో కూడిన నిర్మాణాత్మకమైన చర్చలు, సంభాషణలు పార్లమెంటు వేదికపై జరగాలి, ఈ సభను మర్యాదతో, క్రమశిక్షణతో,గౌరవంతో నిర్వహిద్దాం'' అని కోరారు. మహాత్మాగాంధీ స్ఫూర్తిని ఆయన స్మరిస్తూ, సభ్యులు తమ ప్రవర్తన ద్వారా ప్రజాస్వామ్య విలువలను, సభా క్రమశిక్షణను కాపాడాలని కోరారు.

#### వీధి కుక్కల కేసులో మునుపటి ఆదేశాల సవరణ పిటిషన్లపై...

## సుప్రీంకోర్టు 'తీర్పు రిజర్వ్'


### విచ్చలవిడి జంతువుల తొలగింపు ఆదేశాలను పాటించరా? అని అథారిటీపై సీరియస్



**న్యూఢిల్లీ :** వీధి కుక్కల కేసులో గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం సుప్రింకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. పంజాబ్, తమిళ్‌నాడు, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు తీసుకున్న చర్యలను సంగ్రహించిన అమికస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహ్‌తా, ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. 2027 నవంబర్ 7 నాటి ఆదేశాన్ని పాటించే విషయమై ఎన్‌హెచ్‌ఎఐ తరఫు న్యాయవాది వాదనలను ధర్మాసనం విన్నది. జాతీయ రహదారి, ఫెన్సింగ్ రోడ్ల నుండి విచ్చలవిడిగా సంచరించే జంతువులను తొలగించాలని 2025 నవంబరు 7న ఇచ్చిన తన ఆదేశాన్ని అధికార యంత్రాంగం పాటించడానికి సంబంధించి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) తరపున హాజరైన న్యాయవాది వాదనలను సుప్రింకోర్టు త్రిసభ్య ధర్మాసనం విన్నది. జంతు సంరక్షణ లేదా జంతు జనన నియంత్రణ సౌకర్యాలకు అనుమతిని కోరుతూ ఎన్‌జిఓలు దాఖలు చేసిన దరఖాస్తులను ప్రాసెస్ చేయాలని భారత జంతు సంక్షేమ బోర్డ్ (ఎడబ్ల్యుబిఐ)ని అత్యున్నత న్యాయస్థానం కోరింది. 'మీరు దరఖాస్తులను అంగీకరించవచ్చు, లేదా తిరస్కరించవచ్చు కానీ దానిని త్వరగా చేయండి' అని ఎడబ్ల్యుబిఐ తరపు న్యాయవాదికి ధర్మాసనం తెలిపింది. నవంబరు 7న కోర్టు ఉత్తర్వుల తర్వాత , వివిధ సంస్థల నుండి ఇటువంటి దరఖాస్తులు పెరిగాయని ఆయన ఎత్తిచూపారు. ఈ విషయంలో వీలైనంత త్వరగా పార్టీలు తమ లిఖిత పూర్వక వాదనలను దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం కోరింది. బుధవారం సుప్రింకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వీధి కుక్కల స్టెరిలైజేషన్ సామర్థ్యాన్ని పెంచుకోవాలనే ఆదేశాలు పాటించకపోవడంపై తన ఆందోళనను వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం 'వాళ్లందరూ గాలిలో కోటలు కడుతున్నారు' అని పేర్కొంది. సంస్థాగత ప్రాంతాలు, రోడ్ల నుండి విచ్చల విడి జంతువులను తొలగించాలని 2025 నవంబరు 7న ఇచ్చిన తన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన అనేక పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది. జనవరి 13న కుక్కకాటు సంఘటనలకు భారీ పరిహారం చెల్లించాలని, అలాంటి కేసులకు కుక్కలను పోషించే వారిని జవాబుదారీగా ఉంచాలని రాష్ట్రాలను కోరనున్నట్లు సుప్రింకోర్టు తెలిపింది. గత 5 సంవత్సరాలుగా విచ్చలవిడి జంతువులపై నిబంధనలు అమలు చేయకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పట్టుకున్న వీధి కుక్కలను వాటి అసలు ప్రదేశాలకు వదల కూడదని ధర్మాసనం సూచించింది. వీధికుక్కల కాటు వల్ల రేబిస్ వ్యాధి ముఖ్యంగా పిల్లలలో వస్తున్నదని మీడియాలో ప్రసారమైన ప్రత్యేక వార్తా కథనాలపై గత ఏడాది జులై 28న సుప్రింకోర్టు సుమోటో కేసు కింద పిటిషన్ల విచారణ చేపట్టిన విషయం తెలిసిందే.

## రాహుల్, ఖర్గేలతో భేటీ సక్సెస్

### 'మేమంతా ఒక్కటే' అంటూ క్లారిటీ ఇచ్చిన శశి థరూర్



**న్యూఢిల్లీ :** గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, ముఖ్యంగా అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై అసంతృప్తితో ఉన్నారనే వార్తల మధ్య సీనియర్ నేత, ఎంపి శశి థరూర్ ఎట్టకేలకు స్పందించారు. గురువారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో అత్యంత కీలకమైన సమావేశం నిర్వహించారు. భేటీ అనంతరం బయటకు వచ్చిన థరూర్ 'అంతా బాగుంది. పార్టీ నాయకత్వంతో నాకు ఎలాంటి విభేదాలు లేవు. మేమంతా ఒకే మాటపై ఉన్నాం. కలిసి ముందుకు సాగుతాం' అని ప్రకటించారు. ఈ కీలక సమావేశం పార్లమెంట్ భవన సముదాయంలోని మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో జరిగింది. సుమారు గంటకు పైగా ఈ భేటీ కొనసాగింది. ఇందులో రాహుల్, ఖర్గేలతో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. తమ మధ్య ఉన్న మనస్పర్థలు, కేరళ రాజకీయాలు, పార్టీ వ్యూహాలపై వారు కూలంకషంగా చర్చించారు. 'మా ఇద్దరు అగ్ర నేతలతో (ఖర్గే, రాహుల్) చర్చలు జరిపాను. సమావేశం చాలా నిర్మాణాత్మకంగా, సానుకూలంగా జరిగింది' అని థరూర్ మీడియాకు వెల్లడించారు. త్వరలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై చర్చ జరిగిందా? అని విలేకరులు ప్రశ్నించగా, థరూర్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. 'ఆ విషయం అసలు చర్చకు రాలేదు. సిఎం రేసులో ఉండటానికి, అభ్యర్థిగా ఉండటానికి నాకు ఆసక్తి లేదు. ప్రస్తుతం నేను తిరువనంతపురం ఎంపిగా ఉన్నాను. అక్కడి ఓటర్ల విశ్వాసం నాపై ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను కాపాడటమే నా బాధ్యత. నా పని నేను చేసుకుంటాను' అని ఆయన క్లారిటీ ఇచ్చారు. అధిష్టానంతో జరిగిన భేటీ పట్ల తాను పూర్తి సంతృప్తితో ఉన్నట్లు తెలిపారు.

## సరిహద్దు అక్రమ రవాణా ప్రయత్నాలు

### అధునాతన పిస్టల్స్, 2 కిలోల హెరాయిన్ స్వాధీనం

**చండీగఢ్:** పంజాబ్ పోలీసులు, బిఎస్ఎఫ్‌తో సమన్వయంతో, ఫజిల్కా జిల్లాలోని సరిహద్దు అవుట్‌పోస్ట్ సమీపంలో ఒక పెద్ద సరిహద్దు అక్రమ రవాణా ప్రయత్నాన్ని భగ్నం చేసి, పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారని గురువారం ఒక ఉన్నత పోలీసు అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో 2.1 కిలోల హెరాయిన్, 21 అధునాతన పిస్టల్స్‌తో పాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు డైరెక్టర్ జనరల్ (డిజిపి) గౌరవ్ యాదవ్ తెలిపారు. వీటిలో 11 గ్లోక్ పిస్టల్‌తో పాటు 22 మ్యాగజైన్లు, ఒక బారెట్టా పిస్టల్‌తో పాటు ఒక మ్యాగజైన్, ఐదు జిగానా పిస్టల్స్‌తో పాటు 10 మ్యాగజైన్లు, మూడు నోరింకో పిస్టల్స్‌తో పాటు ఐదు మ్యాగజైన్లు, ఒక గఫర్ సెక్యూరిటీ పిస్టల్ (ఎపి5 రకం), 310 లైవ్ కార్ట్రిడ్జ్‌లు (9ఎంఎం) ఉన్నాయని డిజిపి తెలిపారు. పాకిస్తాన్‌కు చెందిన స్మగ్లర్లు రాత్రి పరిస్థితులు, దట్టమైన పొగమంచును ఆసరాగా చేసుకుని భారత భూభాగంలోకి ఆయుధాలు, మాదకద్రవ్యాలను రవాణా చేయడానికి జీరో లైన్‌ను దాటినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అయితే, అప్రమత్తమైన సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) దళాలు ఉల్లంఘనను నిరోధించడానికి అనేక రౌండ్ల కాల్పులు జరిపాయి, తరువాత ఉమ్మడి శోధన ఆపరేషన్ నిర్వహించి స్వాధీనం చేసుకున్నాయని డిజిపి తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా, బిఎస్ఎఫ్ దళాలతో పాటు పోలీసు బృందాలు వ్యక్తిగత భద్రతా అధికారి ఇన్ కమాండ్ సుమిత్ కపూర్, పైలట్ సెకండ్ ఇన్ కమాండ్ శాంభవి పాఠక్ ఉన్నారు. అందరూ ప్రాణాలు కోల్పోయారు. ఫాజిల్కాలోని తేజా రుహేలా గ్రామంలో పాకిస్తాన్ స్మగ్లర్లు మాదకద్రవ్యాలు, ఆయుధాలను భారత భూభాగంలోకి రవాణా చేయడానికి చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టడానికి సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయని కౌంటర్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ గుర్నేవాక్ సింగ్ బ్రార్ తెలిపారు. మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించడానికి మరింత దర్యాప్తు జరుగుతోందని ఆయన చెప్పారు. ఫాజిల్కాలోని ఒక పోలీస్ స్టేషన్‌లో నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం, ఆయుధ చట్టంలోని సంబంధిత విభాగాల కింద కేసు నమోదు చేయబడింది.


## ప్రపంచానికి భారత్ ఆశాకిరణంగా ఎదుగుతోంది

### ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ :** ప్రపంచానికి భారత్ 'ఆశాకిరణం'గా ఎదుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ ప్రతిష్ఠాత్మక భారత్ కోసం ఒప్పందం కుదుర్చుకున్నామని, తయారీదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో మీడియాతో ప్రసంగించిన మోదీ, భారతదేశం రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో వేగంగా ముందుకు సాగుతోందని, సంస్కరణల ఆవిష్కరణకు తమ సానుకూల శక్తులను అందించినందుకు పార్లమెంటు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విమర్శకులు కూడా చివరి మైలు వరకు డెలివరీపై ప్రభుత్వం దృష్టి సారించడాన్ని గుర్తించారని, ఈ సంప్రదాయం తదుపరి తరం సంస్కరణలతో కొనసాగుతుందని మోదీ అన్నారు. భారత ప్రజాస్వామ్యం, జనాభా, ప్రపంచానికి గొప్ప ఆశను అందిస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రజాస్వామ్య దేవాలయంలో, భారతదేశం బలం, ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత, ప్రజాస్వామ్య ప్రక్రియల ద్వారా తీసుకున్న నిర్ణయాలకు గౌరవం అనే సందేశాన్ని పంపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత సమయం అంతరాయం కోసం కాదని, పరిష్కారాల కోసం, అడ్డంకుల కోసం కాదు, పరిష్కారం కోసం అని మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దపు తొలి త్రైమాసికం ముగింపు, తదుపరి త్రైమాసికం ప్రారంభానికి బడ్జెట్ సమావేశాలు నిదర్శనమని ప్రధాని అన్నారు. ఈ త్రైమాసికం ప్రారంభంలో భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) భారతదేశ యువత ఉజ్వల భవిష్యత్తును, రాబోయే ఆశాజనక దిశలను ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. 'ఈ ఒప్పందం ప్రతిష్టాత్మక భారతదేశానికి, ఆకాంక్షించే యువతకు, ఆత్మనిర్భర్ భారత్ (స్వావలంబన భారతదేశం) కోసం స్వేచ్ఛా వాణిజ్యం' అని ఆయన అన్నారు. భారత తయారీదారులు తమ సామర్థ్యాలను పెంచుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసించారు. అసంతృప్తి నుండి జాగ్రత్త వహించాలని, నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆయన పరిశ్రమ నాయకులు, తయారీదారులను కోరారు. ఉత్తమ నాణ్యత గల ఉత్పత్తులతో ఈ బహిరంగ మార్కెట్‌లోకి ప్రవేశించడం వల్ల 27 ఇయు దేశాలలోని కొనుగోలుదారుల నుండి లాభాలను ఆర్జించడమే కాకుండా, వారి హృదయాలను గెలుచుకుంటుందని, దశాబ్దాల పాటు దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. దేశ బ్రాండ్‌తో అనుసంధానించబడిన కంపెనీల బ్రాండ్లు కొత్త ప్రతిష్టను ఏర్పరుస్తాయని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ మానవ కేంద్రీకృతంగా, దేశం సమగ్ర అభివృద్ధి కోసం దృష్టి సారించిందని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం సాంకేతికతతో పోటీ పడుతుందని, దానిని గ్రహిస్తుందని, దాని బలాలను అంగీకరిస్తుందని, ప్రభుత్వం మానవ కేంద్రీకృత వ్యవస్థలపై ఎప్పుడూ రాజీపడదని ఆయన అన్నారు.

## కోల్‌కతా అగ్నిప్రమాదం.. 21కి చేరిన మృతుల సంఖ్య



**కోల్‌కతా:** కోల్‌కతా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మోమో ఆహార పదార్థాల గోదాంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 21కి చేరుకుంది. మరో 28 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అక్కడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అలాగే రాజకీయ నాయకుల పర్యటన నేపథ్యంలో.. బుధవారం అర్ధరాత్రి నుంచి ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించామని పోలీసులు తెలిపారు. జనవరి 26(సోమవారం) గణతంత్ర దినోత్సవం వేళ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జరిగిన భారీ అగ్నిప్రమాదం ఘోర విషాదాన్ని మిగిల్చింది. సోమవారం ఉదయం 3 గంటలకు ఆనంద్‌పూర్ ప్రాంతంలోని రెండు ఆహార గోదాంలలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే గోదాం లోపల పొడి ఆహార పదార్థాలతో పాటూ మండే వస్తువులు అధికంగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. గంటల తరబడి ఫైర్ సిబ్బంది ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. చాలా సమయం తర్వాత అగ్నిమాపక సిబ్బంది అందులో చిక్కుకున్న వారి కోసం గాలింపులు చేపట్టగా తొలి రోజు 16 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. తాజాగా గురువారం మరో ఐదు మృతదేహాలను గుర్తించారు. దీంతో మృతుల సంఖ్య 21కి చేరింది. మిగతా వారి కోసం గాలింపు చేపడుతున్నారు. అయితే మృతదేహాలను గుర్తించడం కష్టంగా ఉన్నందున.. డీఎన్ఏ ఆధారంగా మృతదేహాల గుర్తింపు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇక ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు మోమో కంపెనీ రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. అంతేకాకుండా వారి కుటుంబాలకు ప్రతి నెలా ఆర్థిక సహాయం, వారి పిల్లల చదువు బాధ్యతలు భరిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

## అజిత్ పవార్ విమానం బ్లాక్ బాక్స్ లభ్యం

### వేగంగా దర్యాప్తు పూర్తి చేస్తాం కేంద్రం

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ విమాన ప్రమాదంపై కేంద్ర పౌర విమానయాన శాఖ కీలక ప్రకటన చేసింది. బుధవారం ఉదయం బారామతిలో కూలిపోయిన లీయర్ జెట్45 మోడల్ విమానంలోని బ్లాక్ బాక్స్‌ను రికవర్ చేశామని వెల్లడించింది. ఈ దుర్ఘటనపై వేగంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపింది. ఈమేరకు ఎక్స్ వేదికగా పౌర విమానయాన శాఖ గురువారం ఒక ట్వీట్ చేసింది. సమగ్రంగా, పారదర్శకంగా, వేగంగా దర్యాప్తును పూర్తి చేసేందుకు టాప్ ప్రయారిటీని ఇస్తామని స్పష్టం చేసింది. ఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి)కు చెందిన ముగ్గురు అధికారుల టీమ్, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డిజిసిఎ) ముంబయి ప్రాంతీయ కార్యాలయానికి చెందిన మరో ముగ్గురు ఆఫీసర్ల టీమ్ జనవరి 28నే సంఘటనా స్థలాన్ని సందర్శించిందని వెల్లడించింది. లీయర్ జెట్45 విమానం బ్లాక్ బాక్స్‌ను ఆ నిపుణుల టీమ్ రికవర్ చేసిందని పేర్కొంది. 2025 ఏఏఐబీ మార్గదర్శకాల్లోని 5, 11 నిబంధనల ప్రకారం దర్యాప్తు చేస్తామని పౌర విమానయాన శాఖ తెలిపింది. విమాన ప్రమాదం వివరాలతో నిర్ణీత గడువులోగా సమగ్ర వివరాలతో దర్యాప్తు నివేదికను విడుదల చేస్తామని చెప్పింది.

**పైలట్ తప్పిదమే కారణం**

అజిత్ పవార్ విమాన ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు బందాలు శోధిస్తున్నాయి. ఈ క్రమంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బందం కీలక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. బుధవారం ప్రమాదం జరగగానే ఢిల్లీ నుంచి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని ఏఏఐబీ కీలక ఆధారాలు సేకరించింది. విమాన ప్రమాదానికి పైలట్ నిర్లక్ష్యమే కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. పైలట్ తప్పిదం కారణంగానే ఈ ఘోరం జరిగినట్లుగా అధికారులు అనుమానిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. పైలట్ రన్‌వేను తప్పుగా అంచనా వేయడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని తెలుస్తోంది. మొదటి ల్యాండింగ్‌కు కుదరనప్పుడు... రెండో ల్యాండింగ్‌కు సిద్ధపడుతున్న తరుణంలో పైలట్ పొరపాటు చేసినట్లుగా ప్రాథమిక పరిశోధనలో వెల్లడైనట్లుగా వర్గాలు చెబుతున్నాయి. ల్యాండింగ్ సమయంలో విజిబిలిటీ సరిగా లేదని, ఆ సమయంలో వెంటనే పూణెకు మళ్లించి ఉండవచ్చని దర్యాప్తు సంస్థ నివేదించింది. కానీ పైలట్ మాత్రం ఆ పని చేయనట్లుగా కనిపించింది. అయినా పైలట్ విమానాన్ని తిరిగి సమలేఖనం చేయడానికి ప్రయత్నించాడని, ఓ వైపు వేగం... ఇంకో వైపు ల్యాండింగ్‌కు ఆలస్యమైనట్లుగా కనిపించిందని ఆ వర్గాలు చెబుతున్నాయి. వీఐపీ విమానాలు, హెలికాప్టర్ కార్యకలాపాల్లో ఇది సర్వసాధారణంగా జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. సమయానికి ల్యాండ్ చేయడానికి ఒత్తిడి ఉన్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులు సూచిస్తున్నాయి. బుధవారం ఉదయం 8:10 గంటలకు ముంబై నుంచి బారామతికి విమానం బయల్దేరింది. బారామతి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కు సిద్ధపడుతున్న తరుణంలో కూలిపోయింది.

#### అశ్రునయనాల మధ్య

## అజిత్ అంత్యక్రియలు



**బారామతి:** విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి . గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్‌కు అంతిమ సంస్కారాలు నిర్వహించారు కుటుంబసభ్యులు కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమ ంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే, తదితర రాజకీయ ప్రముఖులు అంత్యక్రియ ల్లో పాల్గొన్నారు. గురువారం ఉద యం అజిత్ పవార్ పార్థివదేహాన్ని బారామతిలోని అహల్యాదేవి ఆసుపత్రి నుంచి ఆయన స్వగ్రామం కాటేవాడికి తరలించారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో జెడి మాడ్గుల్కర్ ఆడిటోరియానికి అజిత్‌పవార్ భౌతికకాయాన్ని తరలించారు. అ క్కడి నుంచి విద్యా ప్రతిష్ఠాన్ మై దానం వరకు అజిత్ పవార్ అంతిమ యాత్ర సాగింది. తమ అభిమా న నేత దాదాకు తుది వీడ్కోలు పలికేందుకు వేలాది మంది అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి తరలివచ్చారు. మరఠ్వాడా నలుమూలల వచ్చిన ప్రజలతో విద్యా ప్ర తిష్టాన్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03EV 5447 | Raj Kumar Ambala | CHEVROLET TAVERA NEO-P | 2015 |
| 2 | TS03UD 4977 | Sumathi Namindla | TATA SIGNA 2830K BS6 FBT | 2023 |
| 3 | TS03UD 1394 | Narasimhulu Kadem | APE XTRA LDX + BS6 DIESEL | 2022 |
| 4 | TS32 T 3798 | Malothu Arun | AL 3718 FBT | 2019 |
| 5 | TS03UC 1553 | Saidhamma Thoutam | APE PICK UP XTRA LD | 2018 |
| 6 | TS03UD 0439 | Bixapathi Gorre | TATA SIGNA 2825 K BS6 FBT | 2022 |
| 7 | YC14B 1397 | Raja Rajeshwara Granites | KOBELCO SK380 XDLC | 2019 |
| 8 | TS36K 0142 | Ram Reddy Enugala | JOHN DEERE 5405 HARVESTER | 2021 |

AUCTION DATE : 31-01-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9666576664, 9959103322 & 9676049567

# 'స్పష్టత' లేని యుజిసి!

విశ్వవిద్యాలయాలు జ్ఞానార్జనకు మాత్రమే కాకుండా, సమానత్వం, న్యాయం, సహనశీలత వంటి ప్రజాస్వామ్య విలువలను ఆచరణలో నేర్పే ప్రదేశాలుగా భాసిల్లాలి. అందుకు భిన్నంగా ఉన్న నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. యుజిసి 2026 ఈక్విటీ రెగ్యులేషన్స్‌పై సుప్రీంకోర్టు స్టే విధించడం ప్రభుత్వానికొక హెచ్చరికగా నిలుస్తుంది. చట్టాలు, నిబంధనలు మంచి ఉద్దేశంతో రూపొందించినా, అవి స్పష్టంగా లేకపోతే లేదా విస్తృతంగా వర్తించకుండా పరిమిత వర్గాలకు మాత్రమే న్యాయం చేయాలని ప్రయత్నిస్తే, సమాజాన్ని మరింతగా విభజించే ప్రమాదం ఉందని కోర్టు చేసిన వ్యాఖ్య పాలకులకు ఒక గుణపాఠం. యుజిసి తీసుకొచ్చిన కొత్త నిబంధనలు క్యాంపస్‌లలో కుల వివక్షను నివారించాలనే ఉద్దేశంతో రూపొందించినవే. అయితే, ఆ నిబంధనల్లో కుల ఆధారిత వివక్షను కేవలం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు మాత్రమే పరిమితం చేయడం అనుమానాలకు తావిస్తున్నది. సుప్రీం కోర్టు ముందు దాఖలైన పిటిషన్లు ఇదే అంశాన్ని కేంద్రంగా చేసుకున్నాయి.

కుల వివక్ష అనేది భారత సమాజంలో ఒకే దిశలో మాత్రమే జరగదని, కొన్ని సందర్భాల్లో సాధారణ వర్గాలకు చెందినవారు కూడా తమ కుల గుర్తింపుల ఆధారంగా వేధింపులకు గురవుతారన్నది పిటిషనర్ల వాదన. యుజిసి నిబంధనల్లో ఉపయోగించిన భాష నాసిరకంగా ఉందని, విషయంపై స్పష్టత లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం, లోపం ఎక్కడ ఉందో చెప్పకనే చెప్తున్నది. స్పష్టత లేని చట్టాలు.. నిబంధనలు దుర్వినియోగానికి ఆస్కారం ఉంది. 'ఒక పదం' లేదా 'నిర్వచనం' ఒక్కోసారి తీవ్రమైన సామాజిక ప్రభావాన్ని చూపుతుంది. ఒక వర్గానికి మాత్రమే రక్షణ కల్పించే విధంగా నిబంధనలు ఉంటే, మిగతా వర్గాల విద్యార్థులు తమ సమస్యలను ఎక్కడ, ఎలా చెప్పుకోవాలి? సుప్రీంకోర్టు జోక్యంతో ఇప్పుడు ఈ ప్రశ్నలు అధికారికంగా చర్చకు వచ్చాయి. కుల వివక్ష వంటి సున్నితమైన అంశాలను చట్టబద్ధంగా పరిష్కరించేటప్పుడు సమతుల్యత అవసరం. ఒక వర్గానికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని గుర్తించడం అవసరమే కానీ, ఆ పేరుతో కొత్తరకమైన అసమానతలు సృష్టించకూడదు. దీనివల్ల సమాజ విభజన జరిగే ప్రమాదం ఉంది. క్యాంపస్‌లు రాజకీయ, సామాజిక ఉద్రిక్తతలకు కేంద్రాలుగా మారితే, విద్యా నాణ్యత దెబ్బతింటుంది. యుజిసి 2012 నిబంధనల్లో సలహాలకు అత్యధిక ప్రాధాన్యం ఉండగా, తాజా నిబంధనలు, సలహాలను తప్పనిసరి చేస్తున్నాయి. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో ఈక్విటీ కమిటీల ఏర్పాటు, అందులో వివిధ వర్గాల ప్రాతినిధ్యం ఉండాలనే ఆదేశాలు మొదటి చూపులో ప్రగతిశీలంగా కనిపిస్తాయి. కానీ, వాటి అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను గమనించాలి. నిబంధనలలో వాడిన భాషలో స్పష్టత లేకపోతే, చిన్న చిన్న విభేదాలు కూడా కుల వివక్షగా ముద్ర వేయబడే ప్రమాదం ఉంది. అప్పుడు నిజమైన వివక్ష కేసులు, సాధారణ వ్యక్తిగత సంఘర్షణల మధ్య తేడా గుర్తించడం కష్టం. దీనివల్ల క్యాంపస్‌లలో అనవసర భయం, అనుమానం, విభజన పెరిగే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో యుజిసి 2026 నిబంధనలు యథాతథంగా అమలైతే, విశ్వవిద్యాలయాలు అనేక సమస్యలను ఎదుర్కొంటాయి. పరిపాలనా భారం పెరుగుతుంది. ఇప్పటికే అనేక కమిటీలతో సతమతమవుతున్న విద్యాసంస్థలు, మరో కొత్త వ్యవస్థను నిర్వహించాల్సి వస్తుంది. ఇది బోధన, పరిశోధనలపై దృష్టి తగ్గించే ప్రమాదం ఉంది. కాగా, ప్రతి ఫిర్యాదును కుల కోణంలోనే చూడాలనే ఒత్తిడి పెరిగితే, అధ్యాపకులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలకు ఆటంకం కలుగుతుంది. తమ మాటలు, నిర్ణయాలు విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకుంటారేమో అనే భయంతో ఉపాధ్యాయులు అనేకానేక రకాలుగా వెనుకడుగు వేయవచ్చు. ఇది విద్యా స్వేచ్ఛపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

వాస్తవానికి, విమర్శనాత్మక దృష్టితో చూస్తే, సమానత్వం అనేది కేవలం కమిటీల ద్వారా, నిబంధనల ద్వారా మాత్రమే సాధ్యం కాదు. అది క్యాంపస్ సంస్కృతిలో, తరగతి గదుల్లో, హాస్టళ్లలో, సహపాఠుల మధ్య సంబంధాల్లో ప్రతిఫలించాలి. సుప్రీంకోర్టు ఈ నిబంధనలను న్యాయవాదుల కమిటీ ద్వారా పునఃపరిశీలించాలన్న సూచన, చట్టసృష్టిలో నిపుణుల పాత్ర ప్రాముఖ్యతను తెలియజేసింది. ఇది విద్యార్థులకు ప్రజా విధానాల రూపకల్పనపై అవగాహన కలిగించే మరో అంశం. ఈ కేసు ద్వారా విద్యార్థులు న్యాయవ్యవస్థ పాత్రను ప్రత్యక్షంగా గమనించగలగడం సుప్రీం కోర్టు నిర్ణయంతో సాధ్యమవుతున్నది. ఒక ప్రభుత్వ సంస్థ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు సమీక్షించడం, అవసరమైతే స్టే విధించడం ప్రజాస్వామ్యంలో ఎంత కీలకమో స్పష్టమవుతుంది. ఇది విద్యార్థులకు కూడా ఒక సజీవ పాఠం. అధికార నిర్ణయాలు ప్రశ్నించదగినవని, అవి రాజ్యాంగ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సిందేనని వారికి తెలుస్తుంది. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వు తాత్కాలికమేకావచ్చు.. కానీ, దాని ప్రభావం దీర్ఘకాలికంగా ఉండే అవకాశముంది. మార్చి 19న కేసు తిరిగి విచారణకు వచ్చేలోగా, కేంద్రం, యుజిసి తమ నిబంధనలను పునఃపరిశీలించక తప్పదు. ఈ ప్రక్రియలో విద్యార్థుల నుంచి మేధావుల వరకూ, ఉపాధ్యాయుల నుంచి విద్యా నిపుణుల వరకూ... పలువురి అభిప్రాయాలు, అనుభవాలు కూడా పరిగణనలోకి రావాల్సిన అవసరం ఉంది. **(క్యాంపస్‌లలో నిజంగా ఏమి జరుగుతున్నదో, వివక్ష ఎలా వ్యక్తమవుతున్నదో విద్యార్థులకే బాగా తెలుసు. వారి స్వరం వినిపించకుండా రూపొందించే ఏ నిబంధనైనా అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.)** యుజిసి కొత్త నిబంధనలను స్థూలంగా చూస్తే, వివక్షకు గురైన వర్గాలవారికి న్యాయం కలిగించేవిగా కనిపిస్తాయి. కానీ, సూక్ష్మంగా చూస్తే, ఒక వర్గానికి మాత్రమే కొమ్ముకాస్తూ, మిగతా వర్గాలను అభద్రతా భావంలోకి నెట్టివేసే ప్రమాదం ఆవిష్కృతమవుతుంది. మంచి పేరుతో చెడును వండి వడ్డించడం విశ్వవిద్యాలయాల విశిష్ట వాతావరణాన్ని కలుషితం చేస్తుంది. విద్యార్థుల మధ్య కుల, మత అడ్డుగోడలు కడుతుంది. వైషమ్యాలు పెంచుతుంది. ప్రజాస్వామిక దేశంలో, పౌరులందరికీ సమానమైన హక్కులను కల్పించిన రాజ్యాంగాన్ని పరోక్షంగా దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకోక తప్పదు. న్యాయం అనేది ఏ ఒక వర్గానికో మాత్రమే పరిమితం కాకూడదు. సమానత్వం పేరుతో కొత్త అసమానతలు సృష్టించకూడదు.

చట్టాలు సమాజాన్ని ఏకం చేయాలే తప్ప, విభజించకూడదు. అప్పుడు మాత్రమే యుజిసి నిర్ణయం నిజం గా విద్యార్థులకు ఉపయోగపడుతుంది. అంతేకాకుండా విద్యావ్యవస్థను మరింత న్యాయపరమైన దిశలో.. అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. ●



## యుజిసి రోల్‌బ్యాక్ అనేది తిరోగమన భావన

యుజిసి తీసుకువచ్చిన ఉన్నత విద్యా సంస్థలలో 'సమానత్వ ప్రోత్సాహం నిబంధనలు–2026' ఆలస్యమైనప్పటికీ, స్వాగతించదగిన చర్య. లోతైన వివక్ష, సంస్థాగత ఉదాసీనతతో నిండిన ఉన్నత విద్యా వ్యవస్థను సంస్కరించడంలో ఇదొక అడుగు. కేంద్ర స్థాయిలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతీయ ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలు, ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. దక్షిణ భారతదేశం, కశ్మీర్, మైనారిటీ వర్గాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని పదేపదే దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయి. కాబట్టి సమానత్వ రక్షణలు అనేది ఎంపిక కాదు, అనివార్యమైన అవసరం. మండల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్ల అమలు సమయంలో చూసినట్లుగా, ప్రస్తుత యుజిసి రోల్‌బ్యాక్ ఆందోళన అదే తిరోగమన మనస్తత్వంతో నడపబడుతుంది. ఈ నిబంధనలను లేదా వాటి ప్రధాన లక్ష్యాలను నీరుగార్చడానికి కేంద్ర ప్రభుత్వం అటువంటి ఒత్తిడిని అనుమతించకూడదు.

తమిళనాడు సిఎం ఎం.కె.స్టాలిన్



# మహాత్ముని సూక్తులు... నేటి అవసరాలు

20వ శతాబ్దపు ప్రపంచ మేటి ఘనుల్లో ప్రముఖమైన మహాశక్తిగా నేటికీ నిలుస్తున్నారు మన మహాత్మాగాంధీ. భారతీయులకే కాకుండా నెల్సన్ మండేలా, లూథర్ కింగ్ జూనియర్ లాంటి అనేక విశ్వ విఖ్యాత నాయకులకు సహితం ప్రేరణగా నిలిచిన మోహన్‌దాస్ కమర్‌చంద్ గాంధీ జీవితం నేటికీ మానవాళికి దారిదీపంగా నిలుస్తున్నది. భారతీయ లాయర్, రాజకీయ నాయకులు, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్త, సాహితీవేత్త, అతి సాధారణ జీవనశైలిని పరిచయం చేసిన మహా నేత అయిన గాంధీ అహింస అనే పదునైన ఆయుధాన్ని ప్రయోగించి బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించి భరతమాతకు స్వేచ్ఛను ప్రదానం చేశారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిందనే సంతోషంతో పాటు దేశ విభజన గాయాలనతో బాధ పడుతున్న వేళ 30 జనవరి 1948న హిందుత్వవాది నాథూరామ్ వినాయక్ గాడ్సె తూటాలకు తుది శ్వాస విడిచారు. ఆయన సూక్తులు...నడచిన మార్గాలు నేటి సమాజ అవసరాలుగా మారాయి. హింస పెరుగుతున్న కాలంలో మహాత్ముని ఆశయాలను సింహావలోకనం చేసుకోవాలి.

మహాత్మాగాంధీ వర్ధంతి 30 జనవరి రోజున దేశవ్యాప్తంగా అమర వీరుల దినం (మార్టైర్స్ డే) లేదా గాంధీ పుణ్య తిథి లేదా షహీది దివస్‌గా పాటించడం ఆనవాయితీగా మారింది. గాంధీ పట్ల అభిమానంతో రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి మహాత్మా అని పిలవడంతో వారి పేరు మహాత్మాగాంధీ అని, జాతి పిత అని, ప్రేమతో బాపు అని నోరారా పిలుచుకునే గాంధీ జీవితం భరతమాత సేవకు అర్పించారు.

అహింస, ఏకత, మానవీయత లాంటి సమోన్నత విలువలను మానవాళికి పరిచయం చేసిన అసమాన మానవతీమూర్తి మన బాపు. గుజరాత్ రాష్ట్ర పోర్బందర్ పట్టణంలో 02 అక్టోబర్ 1869న జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ లండన్‌లో బారిస్టర్ పట్టాను పొంది. 21 ఏండ్ల పాటు దక్షిణ ఆఫ్రికాలో గడిపారు. అక్కడ నెలకొన్న అసమానతలను చూసి చలించారు.

దక్షిణ ఆఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ ఆ ఉద్యమ స్వరూపాన్ని ఆసాంతం మార్చివేసి బ్రిటీష్ తెల్ల దొరల గుండెల్లో దడ పుట్టించారు. అహింస అనే అత్యంత పదునైన ఆయుధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, వలస పాలకులతో చర్చలు జరుపుతూ, చివరకు బ్రిటీష్ పాలనకు అంతం చూపగలిగారు. సత్యం, అహింస, క్షమాగుణం, నిస్వార్థ సేవ, సానుకూల భావనలు, మానసిక దృఢత్వం, త్యాగం, సత్యాగ్రహాలను పునాదులుగా చేసుకొని ఉద్యమాగ్నికి ఆజ్యం పోశారు. తన జీవిత చరిత్రను 'మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్' అనే ఆత్మకథను రాసి భవిష్యత్ తరాలకు సన్మార్గం చూపుతున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, ఖాళీ ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, దండి మార్చ్ లాంటి అనేక రకాలైన ఉద్యమాలను నడిపి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టారు.

క్రమశిక్షణ, శాంతి, సమానత్వం, నైతికత, మానవీయ విలువలను శాశ్వత ఆభరణాలుగా ధరించి జీవితాన్ని కొనసాగించిన గాంధీ మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ఆదర్శాల తరంగాలు భారత్‌లో మాత్రమే కాకుండా ప్రపంచమంతటా వ్యాపించడం వాస్తవం, అనుసరణీయం. మానవీయ విలువ నిలువెత్తు రూపం మహాత్మాగాంధీ. చొక్కా తొడగడం వదిలి విలువల వస్త్రాలను ధరించి సాదాసీదా జీవితాన్ని మహోన్నతంగా గడిపిన గాంధీ ఐన్‌స్టీన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త చేత మహోన్నతుడిగా కొనియాడబడడం హర్షదాయకం, ఆశ్చర్యకరం. గాంధీ చూపిన బాటలో నడుస్తూ, సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకుంటూ, విలువలు పాటించి వ్యక్తిగతంగా ఎదుగుతూ, దేశాభివృద్ధికిసహకరిద్దాం, 'భారతమాతా కీ జై' అంటూ నినదిద్దాం.

*(30 జనవరి అమర వీరుల దినోత్సవం సందర్భంగా)*

**బి.మధుసూదన్‌రెడ్డి**

# బొగ్గు గనుల మసిని ప్రభుత్వానికి పూస్తున్న ప్రతిపక్షం



**ఎస్.బాబు,** అధ్యక్షులు
టిజిఎస్‌ఆర్‌టిసి
ఎంప్లాయీస్ యూనియన్

అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ కాదేదీ కవిత కనర్హం అన్నారు శ్రీశ్రీ. అలాగే బిజెపి ప్రభుత్వం ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వారికి ధారాదత్తం చేసింది. ఇంకా చేస్తూనే ఉంది. దానిలో భాగంగానే ఈ బొగ్గుగనుల వేలం. కేంద్ర ప్రభుత్వం బొగ్గుగనుల శాఖ ఒరిస్సాలోని 16 గనులు, మధ్యప్రదేశ్‌లో 15 గనులు, ఛత్తీస్‌గఢ్ 6, ఝార్ఖండ్ 6, బెంగాల్, బీహార్ 3గనులు, మహారాష్ట్ర, తెలంగాణల్లో ఒక్కో బొగ్గు గనికి వేలం నిర్వహించింది. డిఫెన్స్, సెక్యూరిటీ, రైల్వేలను ప్రైవేటీకరించే వారికి, నవరత్న కంపెనీలలో ప్రభుత్వ వాటాలను ఉపసంహరించేవారికి బొగ్గు గనులు వేలం వేయటం పల్లీ బఠానీలు తిన్నంత సులభం. రామ కార్యాన్ని చేయటానికి హనుమ ఎంత భక్తి శ్రద్ధలు చూపిస్తాడో, అంతకంటే ఎక్కువ శ్రద్ధను ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడంలో బిజెపి ప్రభుత్వం ముందంజ వేస్తోంది. సింగరేణిని మింగడానికి కేంద్ర ప్రభుత్వం అనకొండలా చూస్తోంది. ఎర్ర తివాచీలు పరచి కార్పొరేట్ కంపెనీలను ఆహ్వానిస్తోంది.

ఒడిషాలోని నైనీ బ్లాక్ బొగ్గు గని సింగరేణి సంస్థకు చెందినది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంధన, ఆర్థిక శాఖలు చూస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆ రాష్ట్రానికి వెళ్ళి అక్కడ ప్రభుత్వంతో చర్చించి 2,400 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా ఎం.ఓ.యు చేసుకున్నారు. నైనీ బ్లాక్ లో బొగ్గు ఉత్పత్తి చేయడం కోసం సింగరేణి సంస్థ టెండర్లను పిలిచింది. సాధారణంగా టెండర్ ప్రక్రియలో నిబంధనలు రూపొందించే బాధ్యత సింగరేణి సంస్థ చేస్తుంది తప్ప, ప్రభుత్వ జోక్యం ఉండదు. ఈ టెండర్లు దక్కించుకునేవారు ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా జత చేయాలని సింగరేణి కంపెనీ టెండర్ నిబంధనల్లో పొందుపరిచింది. రూ.1600 కోట్ల విలువైన ఈ కాంట్రాక్ట్ ను దక్కించుకోవడం కోసం 16 సంస్థలు వేలంలో పాల్గొన్నాయి. సింగరేణి సంస్థ పెట్టిన ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువు అయింది. దీనిపై బిఆర్‌ఎస్ విమర్శ మొదలు పెట్టింది. గతంలో తమ ప్రభుత్వం టెండర్లలో ఈ నిబంధన పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టింది కనుక, తమకు నచ్చినవారికే ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ ఇచ్చి టెండర్ వారికి దక్కేలా కుట్ర చేస్తోందని బట్ట కాల్చి మీద వేశారు. ఈ కుట్రలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రధాన సూత్రధారులని, వారే చక్రం తిప్పుతున్నారని కట్టుకథలు, పిట్టకథలు అల్లి అనుమానాల వలపన్ని బొగ్గు మసి బొడ్డుకు రాసుకుని కూర్చున్నారు ప్రతిపక్ష నాయకులు. దీనితో ఆగకుండా ముఖ్యమంత్రి బంధువులను కూడా ఈ కుంభకోణంలో ఇరికించి టెండర్లపై విచారణ జరిపించాలని సిబిఐకు లేఖలు రాశారు. అంతేకాకుండా ఈ వ్యవహారంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సంబంధం ఉందని, అందుకే ఆయన స్పందించడం లేదని తారక రాముని ఆరోపణలు. 'ఆలూ లేదు..చూలు లేదు..కొడుకు పేరు సోమలింగం' అన్నట్లుగా టెండర్లలో ఏమీ జరగకుండానే దానికి బొగ్గు కుంభకోణం అని నామకరణం చేసి బిఆర్‌ఎస్ పార్టీ మరియు మీడియా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది. గతంలో సింగరేణిని బిఆర్‌ఎస్ పార్టీ దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శిస్తున్నారు. మరి అప్పుడు బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండి బిఆర్‌ఎస్ దోపిడీని ఎందుకు అరికట్టలేకపోయింది?

ఇక్కడ బిఆర్‌ఎస్ పార్టీ వ్యూహం చాలా స్పష్టంగా అర్థమవుతోంది. ఒక్క దెబ్బకి రెండు పిట్టలు అంటే ఇదే. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులపై విచారణలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ దూకుడుకి అడ్డుకట్ట వేయడం ఒక ఎత్తైతే, రెండవది కిషన్ రెడ్డిని ఇరికించి బిజెపి ప్రభుత్వాన్ని కాళేశ్వరంతో పాటు ఇతర కేసుల్లో ముందుకు రాకుండా చేయడం కోసం బిఆర్‌ఎస్ చేస్తున్న ఎదురు దాడి. ఒకవైపు విపక్షం ఎదురు దాడి, మరోవైపు మీడియా ఈ వ్యవహారంపై కథనాలను బాగా మసాలా దట్టించి వండి వార్చాయి. ఓ ప్రముఖ మీడియా సంస్థకు చెందినవారు ఈ టెండర్లలో భాగస్వాములని, మీడియా వర్సెస్ మీడియా నడిచింది. మీడియా ఫైట్ కాస్తా కాంగ్రెస్ బిఆర్‌ఎస్ తన్నులాటగా మారింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్న బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఈ సమస్యని రణక్షేత్రం చేసి బొగ్గు మసి కాంగ్రెస్ కి పూసింది. వెంటనే నైనీ బ్లాక్ టెండర్లను రద్దు చేసింది. ఇక్కడ బిఆర్‌ఎస్ పైచేయి సాధించింది. కాంగ్రెస్ తప్పు చేసింది కనుక టెండర్లు రద్దు చేసిందని సన్నాయి నొక్కులు నొక్కుతూ మొసలి పట్టు పట్టింది. టెండర్లను రద్దు చేసినా రాజకీయ రగడ మాత్రం రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. కెటిఆర్ ఇంతటితో ఆగకుండా 9 సింగరేణి టెండర్లను ముఖ్యమంత్రి బావమరిది నియంత్రిస్తున్నారని, ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ కోసం వచ్చిన వారిని ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపణ చేస్తూ సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేయడం విచిత్ర వ్యవహారం. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి బావమరిది అయిన సుజన్ రెడ్డికి ఈ కాంట్రాక్ట్ అప్పగించే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్న బిఆర్‌ఎస్ నేతలు, వారు అధికారంలో ఉన్నప్పుడు సుజన్ రెడ్డికి ఎలా టెండర్ కాంట్రాక్ట్ ఇచ్చారో చెబితే ప్రజలకు అర్థం అవుతుంది.



సింగరేణిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనం 49 : 51 శాతంగా ఉంది. టెండర్లతో సంబంధం లేకుండా సింగరేణి నైనీ గనులతో పాటు శ్రావణపల్లి, సత్తుపల్లి బ్లాక్ 3, కొయ్యగూడెం ఓపెన్ కాస్ట్ సింగరేణి సంస్థే వెలికి తీసుకునే విధంగా అనుమతించాలని అక్కడ ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. సింగరేణిలో 40 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, 30వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. దేశంలో ఉన్న నవరత్న కంపెనీల్లో ఇది కూడా ఒకటి. దీన్ని ఎలాగైనా కాపాడుకోవాలి. ఎందుకంటే రాబోయే రోజుల్లో థర్మల్ విద్యుత్ తగ్గిపోతుంది. అప్పుడు సహజంగానే సింగరేణి బొగ్గు తగ్గుతుంది. కోల్ ఇండియా గనులు ఓపెన్ చెయ్యాలంటే 2 క్యూబిక్ మీటర్ల మట్టితీస్తే బొగ్గు బయట పడుతుంది. అదే సింగరేణిలో అయితే 6 నుండి 7 క్యూబిక్ మీటర్ల మట్టి ఎత్తి పోస్తే గాని గని బయట పడదు. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది. అప్పుడు సహజంగానే సింగరేణి బొగ్గుకు రేటు ఎక్కువవుతుంది. కోల్ ఇండియా బొగ్గు తక్కువ రేటుకి అందుబాటులో ఉంటుంది కనుక కొనుగోలు దారుడు సహజంగానే కోల్ ఇండియా బొగ్గు వైపు మొగ్గు చూపిస్తాడు. కర్ణాటక గవర్నమెంట్ సింగరేణితో పిపిఎ అగ్రిమెంట్ బొగ్గు సరఫరా కోసం చేసుకుంది. కాని వారు బొగ్గు కొనడానికి రావడం లేదు. ఎందుకంటే సింగరేణి బొగ్గు ఖర్చు ఎక్కువవుతుంది కనుక. అందుకే సంస్థ మనుగడ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి గనులకు టెండర్లు పిలవకుండానే ఆ సంస్థనే అనుమతించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర బొగ్గు గనుల శాఖకు లేఖలు కూడా వ్రాసింది. అయినా బిజెపి ప్రభుత్వం వినిపించుకునే స్థితిలో లేదు. కేంద్ర ప్రభుత్వమే 10 శాతం ఇంపోర్టెడ్ కోల్ వాడాలని కోల్ ఇండియాకు ఆదేశాలు ఇచ్చింది. మన దగ్గరే బొగ్గు పుష్కలంగా దొరుకుతున్నప్పుడు, ఇంపోర్టెడ్ కోల్ ఎందుకు వాడాలి? ఇందులో వస్తున్న అవినీతి సొమ్ము ఎవరి జేబులోకి పోతోంది? ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించాలన్న బిఆర్‌ఎస్ నేతలు దీని గురించి ఎందుకు అడగలేకపోతున్నారు?

భారతదేశంలో 75 శాతం థర్మల్ పవర్ ఉత్పత్తి అవుతోంది. ఆదానీ కంపెనీ ఇండోనేషియా నుండి నాసిరకం బొగ్గును 28 డాలర్లకు కొని తమిళనాడుకు హై క్వాలిటీ బొగ్గు పేరుతో 86 డాలర్లకు అమ్ముతోంది. అందువల్ల ఆ కంపెనీకి ఒక టన్నుకు 48 రూపాయలు లాభం రావడం వల్ల 7వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగింది. ఈ కుంభకోణం గురించి బిజెపికి, బిఆర్‌ఎస్ కి పట్టదా?

బొగ్గు గని కోసం టెండర్లు వేసిన తరువాత వాటిని సింగరేణి సంస్థ పరిశీలించి ప్రీ బిడ్ మీటింగ్ బిడ్డర్స్‌తో జరుపుతారు. టెండర్ కమిటీలోని అధికారులు కొన్ని మార్పులు చేర్పులు చేసి కొరిజెండం ప్రతిపాదిస్తారు. ఈ సవరణలు అంగీకరించటానికి సుమారు నెల సమయం పడుతుంది. ఇది జరిగిన తరువాత ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ సింగరేణి సంస్థ ఇస్తుంది. ఇది జరపకుండా ముందుగానే సర్టిఫికెట్ ఇవ్వరు. ఈ ప్రొసీజర్ పై అవగాహన లేనట్లుగా బిఆర్‌ఎస్ నాయకులు, మీడియా వారు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పు చేసిందని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కుట్రలు చేస్తున్నారని, బురద చల్లుతోంది. ఈ వాక్యం ఎందుకు రాశానంటే, ఈ ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం టెండర్ ఫారంలో పెట్టలేదు అని వారే అన్నారు కనుక దాని ప్రొసీజర్ గురించి వారికి తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్తవ్యస్త పరుస్తూ అధికారం కోసం బిఆర్‌ఎస్ నాయకు లు తహతహ లాడుతున్నట్లుగా కనిపిస్తోంది. కొరిజెండం జరిగిన తరువాత కూడా ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ సింగరేణి అధికారులు ఇవ్వకపోతే అది అధికారుల తప్పిదం అవుతుందే తప్ప, ప్రభుత్వానిది కాదు. ఈ విషయంపై కంప్లైంట్ చేస్తే సుప్రీంకోర్టుకు వారిపై చర్య తీసుకునే అధికారం కూడా ఉంటుంది. బిఆర్‌ఎస్ పార్టీ నాయకద్వయం సంస్థ అధికారులను వదిలిపెట్టి, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ రచ్చ చేస్తోంది. ఇది నార్సిస్టిక్ డిజార్డర్ అనే మానసిక వ్యాధి లక్షణంగా గోచరిస్తోంది.

కాంగ్రెస్ పార్టీలో ఎదుగుతున్నవారిని కాళ్ళు పట్టి కిందికి లాగటం, నాయకుల మధ్య అంతర్గత పోరు, గత 140 సంవత్సరాలుగా కాంగ్రెస్‌కి అంటువ్యాధిలా సోకి ఇప్పటికీ తగ్గలేదు. అందువలన మంత్రుల మధ్య, ఎమ్మెల్యేలు, ఐఎఎస్, ఐపిఎస్ ఆఫీసర్లతో వివాదాలు ఏర్పడుతున్నాయి. ఇవి బిఆర్‌ఎస్‌కు విమర్శనా అస్త్రాలుగా దొరుకుతున్నాయి. ఎక్కడో పుట్టిన బొగ్గు వివాదం సుడిగాలిలా రేగి ఉపముఖ్యమంత్రి మెడకు చుట్టుకుంది. దశాబ్దకాలంగా తప్పుల మీద తప్పులు చేస్తూ వచ్చిన వారు తప్పించుకు తిరుగుతూ మంత్రులను, ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతున్నారు. 'నిజం నిలకడ మీద తెలుస్తుంది అనుకునే సరికి అబద్ధం ఆమడ దూరం ప్రయాణం' చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఆత్మ పరిశీలన చేసుకుని విపక్షానికి చెక్ పెట్టకపోతే, గడ్డుకాలాన్ని ఎదుర్కోవలసిన దుస్థితి ఏర్పడుతుంది.

లేఖ

# 'విబి జి రామ్ జి' తో భారత్ వికసించేనా?

ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. ఐతే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తికాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య...తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరు ప్రతిష్టలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృధా అవుతుంది.

2005లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేకమార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతనే MGNAREGA చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ)నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి(పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించదానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది.

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2025లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్(వీబీ జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ 2005 చట్టం తు.చ. తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ 'విబి జి రామ్ జి' 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంతవరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది.

నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి–2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10శాతం వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100 శాతం, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90 శాతం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాటా 10 శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి..ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయరంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజులపాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బతింటుంది, ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది.

ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైన విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తు ల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంతమేరకైన సఫలీకృతమై సామాజిక , ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్, ఉగ్రవాదం,అవినీతి...లను ప్రధాన శత్రువులుగా భావించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది.

**డా. రాజు,** వరంగల్

## వాహనాలకు డబ్బులు వసూలు చేస్తున్న టోల్‌గేట్ సిబ్బంది

మంత్రి ఆదేశాలు బేఖాతరు చేస్తున్న అధికారులు


**ప్రజాపక్షం/ములుగు:** ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతరకు దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకొని సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటారు. అందువలన 28వ తేదీ నుండి ప్రారంభమైన మేడారం జాతర 30వ తేదీ వరకు పూర్తవుతుంది. ఈ మూడు రోజులు మంత్రి సీతక్క వాహనాలకు టోల్‌గేట్ డబ్బులు వసూలు చేయవద్దని వాహనాల డబ్బులు వసూలు చేస్తే వాహనాలు జామై ప్రయాణికులు ఇబ్బంది పడతారని అందువలన మూడు రోజులు టోల్‌గేట్ డబ్బులు తీసుకోవద్దని మంత్రి ఆదేశించినప్పటికి సీతక్క ఆదేశాలను బేఖాతర్ చేసి జవహర్‌నగర్ గ్రామం సమీపంలో ఉన్న టోల్‌గేట్ యజమానులు వాహనాల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. దీనిపై తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహదారులు కోరుతున్నారు.

## సిఎం కప్ క్రీడా విజేతలకు బహుమతులు ప్రదానం




**ప్రజాపక్షం / వేలేరు :** గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పలు క్రీడలలో పోటీల నిర్వహణలో బాగంగా గురువారం మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో చివరిరోజు వివిధ క్రీడలలో విజేతలైన క్రీడాకారులకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో వేలేరు మండల తహసీల్దార్ హెచ్ కోమి,ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న,ఎంఇఒ చంద్రమౌళి తదితరులు బహుమతులు ప్రధానం చేశారు.ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ మండలస్థాయి క్రీడలలో విజేతలైన వారికి త్వరలో జిల్లా ,రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం జరుగుతోందని ఈ క్రీడలలో విజేతలై కన్న తల్లి దండ్రులకు,పాఠశాలలకు మంచి పేరేప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.కార్యక్రమంలో గొల్లకిష్టంపల్లి గ్రామసర్పంచ్‌లు బత్తుల శ్రీనివాస్,పిడిలు,పిఇటీలు,ఉపాధ్యాయులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## మిషన్‌భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు




**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని వల్లబ్ నగర్ సభ్ స్టేషన్ పక్కనే గల నర్సంపేట మల్లంపల్లి 365 జాతీయ రహదారి వద్ద మిషన్‌భగీరద పైప్‌లైన్ లీకేజీ అయి నీరంతా వృధాగా పోతోంది. ఈ నీరంతా జాతీయ రహదారిపై పారుతుండడంతో వచ్చే పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అసలే మేడారం జాతర కావడంతో ఈ రహదారిపై వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తున్నాయి. వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో స్పందించిన జిల్లా వినియోగదారుల ఫోరం ప్రతినిధులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయించారు. ఈకార్యక్రమంలో జిల్లా సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, బోయిని వెంకటస్వామి, వెంకటాచారి, బెజ్జంకి ప్రభాకర్, ఎర్రబోయిన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గార్బేజ్ వర్నరబుల్ పాయింట్‌లలో చెత్త తరలింపు చేపట్టాలి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నగర పరిధిలోని గార్బేర్ వర్నరబుల్ పాయింట్(జివిబి)లలో ఉదయం వేళల్లో చెత్త తరలింపు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా పరిధిలోని 11వ డివిజన్లో గల భద్రకాళి ఆలయ సమీపంతో పాటు బ్రహ్మణ వాడ, ములుగు రోడ్డు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్, టౌన్ ప్లానింగ్ సంబంధిత అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ భద్రకాళి ఆలయ ఆవరణలో క్షేత్రస్థాయిలో సందర్శించి స్మార్ట్ సిటీ రోడ్డుపై అక్రమంగా ఆక్రమించిన నిర్మానాలను తొలగించాలని, అలాగే ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే క్లియర్ చేయడంతో పాటు స్మార్ట్ రోడ్డు వెంట ఉన్న ఫుట్ పాత్ సమీపంలో ఉన్న పొదలను తొలగించాలని జవాన్‌ను ఆదేశించారు.అనంతరం ప్రధాన రహదారిపై గల గార్బేజ్ వర్నరబుల్ పాయింట్‌ను పరిశీలించి ప్రతి రోజు ఉదయం సమయంలోనే చెత్త తలరింపు ప్రక్రియ పూర్తి చేయాలని సానిటరీ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఏసిపి ప్రశాంత్, డిఈ రాజ్‌కుమార్, రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్‌వైజర్‌లు గోల్కొండ శ్రీనివాస్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/జనగామ :** జిల్లాలో మున్సిపాల్టీ ఎన్నికలు పారదర్శంగా, సజావుగా జరిగేందుకు పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. గురువారం జనగామ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేన్ల ప్రక్రియను అకస్మికంతా తనిఖీ చేశారు. అభ్యర్థులు దాఖల్ చేసిన నామినేషన్ పత్రాలను సబంధిత రిజిష్టర్లను క్షుణంగా పరిశీలించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పరశీలించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ పత్రాలకు జతచేయాల్సిన ధృవపత్రాలు సరిగా ఉన్నాయా..లేదీ తనిఖీ చేయాలని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. పై అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఈ నెల 27న నోటిఫికేషన్ జారీఈ చేయగా జనగామలోని 30, స్టేషన్‌ఘనపూర్‌లోని 18 వార్డులకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. 30వ తేదీ 5 గంటల వరకు నామినేషన్లు దాఖల్‌కు చివరి తేదీ అని, నామినేషన్ వేయాలనుకునే అభ్యర్థులు చివరి రోజున హడావుడితో ఇబ్బందులు పడకుండా ముందుగా నామినేషన్లు దాఖల్ చేయాలన్నారు. అభ్యర్థులు ఏమైనా సమస్యలు, అనుమానాలు ఉండే నివృత్తి చేసుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినందున నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో జరుపుటకు రిటర్నింగ్ అధికారులను, నోడల్ అధికారులను ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయడం జరిగిందనానరు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు

పోస్టులు 23... బరిలో 203 మంది...
హన్మకొండలో 1041 మంది న్యాయ వాదుల ఓట్లు
టెన్ కోర్టు కాంప్లెక్స్‌లో భారీ ఏర్పాట్లు...
రాష్ట్ర వ్యాప్తంగా హోరా-హోరీ 133 బార్‌కౌన్సిల్లలో పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/హనుమకొండ :** నువ్వా...నేనా... అన్న రీతిలో హోరాహోరీగా అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగుతున్న తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 133 బార్ అసోసియేషన్ ల పరిధిలోని వందలాది మంది న్యాయ వాదులు తమ ఓటు హక్కును సద్వినియోగ పరుచుకునే తరుణం ఆసన్నమైంది. ఒక్కొక్కరు 23 ఓట్లను ప్రాధాన్యతా క్రమంలో వేసేలా రంగం సిద్ధమైంది. 30వ తేదీ శుక్రవారం జరిగే పోలింగ్ ఘట్టంలో ఒక్కొక్క న్యాయవాది 23 ఓట్లు ప్రాధాన్యతా క్రమంలో వేసి తమ భవిష్యత్ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని 133 బార్ అసోసియేషన్లలో ఎన్నికల పండుగ వాతావరణం నెలకొంది.ఈ మేరకు హన్మకొండ జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయాల పరిధిలో ఉన్న టెన్ కోర్టు కాంప్లెక్స్ సెల్లార్ లో 16 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేసిన చీఫ్ పోలింగ్ ఆఫీసర్ (ప్రధాన పోలింగ్ అధికారి) పులి సత్యనారాయణ హన్మకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడి హోదాలో బార్‌అసోసియేషన్ ప్రతినిధులతో గురువారం పోలింగ్ ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో బాగంగా హన్మకొండ బార్ నుంచి 1041 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో తలమునకలయ్యారు. స్వయంగా పర్యవేక్షించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా హన్మకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, చీఫ్ పోలింగ్ ఆఫీసర్ పులి సత్యనారాయణ వెంట బార్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, ఉపాధ్యక్షులు సీహెచ్ రమేష్, సంయుక్త కార్యదర్శి అంబేద్కర్, మహిళా సంయుక్త కార్యదర్శి నాగేంద్ర, లైబ్రరీ కార్యదర్శి కే. వెంకట్, స్పోర్ట్స్ కార్యదర్శి మల్లేశం, కోశాధికారి సీహెచ్. సాంబశివరావు, బార్ కార్యవర్గ సభ్యులు సునీల్, నిఖిల్, కమలాకర్, శివకుమార్,ఉన్నారు.

**అబ్జర్వర్ గా మేజిస్ట్రేట్ ప్రియాంక**

తెలంగాణ బార్ కౌన్సిల్ మొత్తం ఎన్నికల పరిశీలకురాలిగా మూడవ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సిరిసిల్ల ప్రియాంక వ్యవహరించనున్నారు. తెలంగాణా లోనే హన్మకొండ పోలింగ్ స్టేషన్ కు 104 వ నంబర్ కేటాయించి ఇందులో 16 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేయడం విశేషం. వీటి పరిధిలో 1041 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించు క్లోన్నున్నారు.

**ప్రశాంతంగా పోలింగ్ లో పాల్గొనండి..: పులి పిలుపు**

హన్మకొండ న్యాయవాదులంతా ప్రశాంతంగా... సాఫీగా పోలింగ్ లో పాల్గొని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కు ఉత్తమ ప్రతినిధులను ఎన్నుకోవాలని హన్మకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన పోలింగ్ అధికారి పులి సత్యనారాయణ న్యాయ వాదులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ప్రాంగణంలో ఉన్న టెన్ కోర్టు కాంప్లెక్స్ సెల్లార్ లో సకల ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. హన్మకొండ నుంచి 1041 మంది ఓటర్లు ప్రాధాన్యతా క్రమంలో 23 చొప్పున ఓట్లు వేసేలా రాష్ట్ర బార్ కౌన్సిల్ కు సర్వం సిద్ధం చేశామని ప్రకటించారు. ఈ మేరకు పోలీస్, వైద్య, న్యాయ పరమైన అధికారులతో సంప్రదించి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. న్యాయవాద ఓటర్లు నేరుగా పోలింగ్ బూత్ లకు వచ్చి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పులి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

**హన్మకొండ నుంచి 7గురు,వరంగల్ నుంచి 4గురు.**

తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల బరిలో 203 మంది అభ్యర్థులు తలపడుతుంటే...ఇందులో హన్మకొండ బార్ నుంచి ఏడుగురు... వరంగల్ బార్ నుంచి నలుగురు తలపడుతున్నారు. రాష్ట్ర స్థాయిలో కేవలం 23 మందికి మాత్రమే గెలిచే అవకాశం ఉన్నప్పటికీ 203 మంది న్యాయవాదులు కౌన్సిల్ పదవి కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇందులో వేలాదిగా ఉన్న ఓటర్లు కనీసం ఒక్కొక్కరు ఐదు ఓట్లు వేస్తేనే బ్యాలెట్ పత్రం చెల్లుతుంది. గరిష్టంగా 23 మందికి ఓటు వేయవచ్చు. అయితే ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే క్రమంలో ఆంగ్ల అక్షరాల్లో స్పెల్లింగ్ మిస్టేక్ తో ప్రాధాన్యత ను గుర్తిస్తే ఆ ఓటు చెల్లకుండా పోతుంది. దీనిపైనే అందరు న్యాయవాదులు తమ దృష్టిని కేంద్రీకరించారు.

**కోర్టుల్లో పండగ వాతావరణం..**

తెలంగాణ వ్యాప్తంగా అయిదేళ్ల కోసం అవసరమయ్యే కీలకమైన బార్ కౌన్సిల్ ఎన్నికల తో అన్ని జిల్లాల్లోని 133 బార్ లలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రత్యేకంగా తెలంగాణ హై కోర్టు నేరుగా పర్యవేక్షించే ఈ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 30 వ తేదీ పోలింగ్ ఘట్టం తో 23 మంది నేతలను ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకుని నెలరోజుల ప్రచార హడావుడి కి న్యాయవాదులు తెరదించనున్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మినీ సమ్మక్క సారలమ్మ జాతరలలో శాశ్వత నిర్మాణాలు చేపట్టి వచ్చే జాతర నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం, జిట్టేగూడెంతాటికొండ, చిల్పూర్ మండలం గార్లగడ్డ తండాఫతేపూర్ లలోని సమ్మక్క-సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కోసం చేపట్టిన త్రాగునీటి సరఫరా సౌకర్యాలను, అలాగే తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, హై మాస్ ఫ్లడ్ లైట్లు వంటి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడు తూ..., సమ్మక్క-సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో నిర్వహించే అన్ని జాతరలలో త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల కల్పన కు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జాతర నిర్వహణకు సంబంధించి త్రాగునీటి సరఫరా, విద్యుత్ ఏర్పాట్లు, మరుగుదొడ్లు, రహదారి మరమ్మత్తులు, లైటింగ్, పారిశుధ్య చర్యలు, వైద్య శిబిరాలు, పోలీస్ బందోబస్తు వంటి అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధికారులకు, జాతర కమిటీలకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని తెలిపారు. దర్శనం అనంతరం కూడా భక్తులు వారి వారి గ్రామాలకు, ఇళ్లకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారక్క సన్నిధిలో కేంద్ర మంత్రులు



**ప్రజాపక్షం/మంగపేట/తాడ్వాయి:** ప్రపంచంలో అతి పెద్ద గిరిజన మహా జాతర మేడారం సమ్మక్క సారక్క లను గురువారం కేంద్ర మంత్రులు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువాల్ ఓరం జి కిషన్ రెడ్డి మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకున్నారు రాష్ట్ర మంత్రులు దణసరి అనసూయ సీతక్క పొంగులేటి శ్రీనివాస రెడ్డి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ సన్నాయి డోలు డప్పులతో గిరిజన సంప్రదాయాలతో ఘన స్వాగతం పలుకగా ఆలయ ప్రాంగణంలో పూజారులు అధికారులు కేంద్ర మంత్రులకు స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రులు జువాల్ ఓరం జి.కిషన్ రెడ్డి నిలువెత్తు తులాబారం బంగారం (బెల్లం) సమ్మక్క సారక్కలకు సమర్పించిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేఖన్, ఏటూరునాగారం ఐటిడిఎ పిఒ చిత్రా మిశ్రా మేడారం జాతర ఇఒ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమష్టి కృషి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పాఠశాలల్లో స్టెమ్ విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో సీమెన్స్, ప్రథం సంస్థ ఆధ్వర్యంలో సైన్స్, ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్స్ తో పాఠశాల విద్యలో (ఎస్‌టిఈఎం) సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ నాణ్యమైన విద్య అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్యక్రమ రూపకల్పనకు అనుగుణంగా రూపొందించిన ఆధునిక అభ్యాస వనరులను పాఠశాలల్లో వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలచేంజ్ పెంపొందించొచ్చని అన్నారు. ఈ స్టెమ్ అభ్యాస వనరులను సీమెన్స్ ఇండియా, సీమెన్స్ స్టిఫ్టుంగ్, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా రూపొందించాయని, ఉపాధ్యాయులు వీటిని తరగతులలో విస్తృతంగా ఉపయోగించి విద్యార్థులకు అందించాలని ఆయన సూచించారు. ఈ దిశగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల అభ్యాసనా ప్రమాణాలను పెంపొందించేందుకు అందరూ కలిసి ముందుకు సాగాలని కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, సీమెన్స్ ప్రాజెక్టు మేనేజర్ శివ కుమార్, ప్రతం రాష్ట్ర కో ఆర్డినేటర్ సుధాకర్, ప్రాజెక్టు లీడ్ జగదీప్, సయాలి, చిన్మయి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సచిన్ తూటే, రుచిక పాల్గొన్నారు.

## ఆగ్రంపహాడ్ జాతరలో భక్తులకు అన్ని ఏర్పాట్లు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** భక్తులు ప్రశాంత వాతావరణంలో తల్లులను దర్శించుకోవాలని.. భక్తులందరూ మొక్కులు చెల్లించుకొని సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ.. ఆగ్రంపహాడ్ జాతరలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి న ట్లు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నియోజకవర్గంలో నిర్వహించే అన్ని జాతరల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మౌళిక వసతులు కల్పించామన్నారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధికారులకు, జాతర కమిటీలకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో తల్లులను దర్శించుకొ ని మొక్కులు చెల్లించుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధు లు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చింతలగట్టు వట్టేవాగు మేడారం గద్దెపై కొలువుదీరిన సమ్మక్క తల్లి

**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల శివారు చింతగట్టు వట్టేవాగు మినీ మేడారం జాతర సమ్మక్క తల్లి రాకతో జాతర జన సముద్రంగా మారిన చింతగట్టు వట్టేవాగు జాతర గురువారం అత్యంత వైభవంగా సాగింది. తెలంగాణ కుంభ మేళా చింతలగట్టు వట్టేవాగుమినీ మేడారం మహాజాతరలో గిరిజన పూజారులు కోబ్బరికాయలతో పూజాలే చేసి చింతలగుట్ట జాతర నుంచి ఆదివాసీ పూజలు జాతర కమిటీ సభ్యులు, నాయకులు కలిసి సూర్యుని గుట్టకు చేరుకుంటారు. మట్టెవాడ అడవి ప్రాంతాల్లో ఉన్న సూర్యునిగుట్ట పై నారచెట్టు కింద జాతర ప్రధాన పూజారి దారం సిద్ధు రహస్యప్రదేశంలో నిక్షిప్తమైన పూజారి సుమారు మూడు గంటల పాలు రహస్య పూజలు చేసి పూజారిపై దేవత పూనగా కుంకుమ భరణి తీసుకుని కిందకు దిగుతాడు గిరిజన పూజారులు సాయంత్రం 9 గంటలకు సూర్యునిగుట్ట నుంచి కుంకుమ భరిణెరూపంలో ఉన్న సమ్మక్క తల్లిని తెచ్చి గురువారం రాత్రి భారీ ఊరేగింపు మధ్య ప్రత్యేక వేషధారణలో ఉన్న పూజారులు వడ్డెలు వనదేవతలను గద్దెలకు తరలించే దృశ్యం భక్తులను పులకింతకు గురిచేసింది.మ్మక్క సారలమ్మలు ఇద్దరు గద్దెలపై కోలువుదీరిన తర్వాత ఆ వనదేవతలను దర్శించుకునేందుకు మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు.సమ్మక్క తల్లి రాకతో జాతర ప్రాంగణమంతా శివశక్తులు పూనకాలతో మారు మ్రోగింది. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో జాతర లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో కల్లోలం!




**ప్రజాపక్షం/జనగామ:** జనగామ కాంగ్రెస్‌లో కల్లోలం నెలకొంది. మున్సిపల్ ఎ న్నికల టిక్కెట్ల కేటాయింపులో మూడు ముక్కలాట నడు స్తోంది. జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి, నియోజకవర్గ ఇన్ చార్జీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరి స్తున్నారు. దీనితో ఎవరికి వారే ఇష్టారాజ్యంగా నామి నే షన్లు వేస్తున్నారు. పెద్ద తలకాయలకు పోటీకి దూరంగా ఉండగా నామినేషన్లకు ఇక ఒక్క రోజే ఉండడంతో ఏం జరుగుతుందన్నది ఉత్కంఠగా మారింది. ఉమ్మడి వరం గల్ జిల్లాలో 12 మున్సిపాల్టీలు ఉండగా 260 వార్డులు ఉన్నాయి. ఈ మున్సిపాల్టీల పరిధిలో 3లక్షల 35వేల 244 మంది ఓటర్లు ఉన్నారు. జనగామ జిల్లాలో రెండు మున్సిపాల్టీలు ఉండగా జనగామలో 30 వార్డులు, స్టేష న్ఘనపూర్‌లో 18 వార్డుల ఉన్నాయి. జనగామ, స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది. స్టేషన్ ఘనపూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారధ్యంతో టిక్కె ట్ల కేటాయింపు సాఫీగా జరుగుతుంది. జనగామలో మా త్రంలో జరగడం లేదు. ఇప్పటి ఒక్కరి పేరు కూడా అధి కారికంగా ప్రకటించలేదు. భువనగిరి పార్లమెంట్ ఎన్ని కల ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క మేడారం జాతర పనుల్లో బి జీగా ఉండడం, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరన్ కుమార్‌రెడ్డి ఇతర దేశాల్లో ఉండడం కూడా కా రణం. నామినేషన్ల రెండో రోజు ముగిసే వరకు ఒక్క అ భ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఇక ఒక్క రోజు మాత్రమే ఉండ దంతో ఎవరెవరు నామినేషన్లు వేస్తారు..కాంగ్రెస్ బి ఫాం ఎవరికి దక్కుతుందన్నది సందిగ్ధంగా ఉన్న పరిస్థితి.

**టిక్కెట్ల కేటాయింపులో మూడు ముక్కలాట**

కాంగ్రెస్ కేటాయింపులో మూడు ముక్కలాట నడు స్తోంది. పూర్తి బాధ్యత నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిదే. అయినా భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి మధ్య సయోధ్య కుదరడం లేదు. ఎవరికి వారుగా టిక్కెట్లు పంచుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి ఏకంగా తనకు ఐదు టిక్కెట్లు ఇవ్వాలని, తాను చెప్పిన వారి పేర్లనే ప్రకటిం చాలని హుకుం జారీ చేసినట్లు కాంగ్రెస్ కార్యకర్తల్లోనే చ ర్చ జరుగుతోంది. జిల్లా అధ్యక్షురాలి హోదాలో లకావత్ ధన్వంతి కూడా కొన్ని టికెట్ల కోసం పట్టుబట్టినట్లు స మాచారం. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పూర్తి బాధ్యత అం టున్నా ఆయన చెప్పినట్లు ఒక్కటి జరగడం లేదని చర్చ. ఈ మూడు ముక్కలాటలో పార్టీ కోసం పని చేసిన వారితో పాటు సమాజంలో పలుకుబడి ఉండి, గెలిచే అవకాశా లు ఉన్న స్థానాలు సైతం బిఆర్ఎస్ ఖాతాలో చేరే అవ కాశాలు లేకపోలేదు. ఇప్పటికే రెండు సర్వేలు చేయగా ఆ సర్వేల్లో కాం గ్రెస్‌కు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో నాయకులు త లపట్టుకుంటున్నట్లుతెలుస్తుంది.

**ఎవరికి వారే నామినేషన్లు**

బిఆర్ఎస్ టిక్కెట్ల కేటాయింపు వారం రోజుల క్రితమే పూ ర్తయ్యింది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ము న్సిపల్‌ను కైవసం చేసుకోవడం కోసం ఆచితూచి అడు గులు వేస్తున్నారు. కానీ కాంగ్రెస్‌లో ఆ పరిస్థితి కనిపిం చడం లేదు. ఎవరికి వారే నామినేషన్లు వేస్తున్నారు. ఉదా హరణకు ఆరవ వార్డులో పెద్ది వెంకటనారాయణకు ము ందు హామి ఇచ్చినా బిఎన్ మెడికల్ షాప్ యజమా నితో నామినేషన్ వేయించారు. ఇలా ఎవరికి వారే నామి నేషన్లు వేస్తుండడంతో ఎవరికి బీఫాం వస్తుందన్నది సంది గ్ధంగా ఉంది.

**పోటీకి దూరంగా పెద్ద తలకాయలు**

కాంగ్రెస్‌కు మేమే దిక్కు అని చెప్పుకునే కొందరు నాయకులు కౌన్సిలర్‌గా పోటీ చేయకుండా దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన వేమళ్ల సత్య నారా యణ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌గా పనిచేసిన వేమళ్ల సత్య నారాయణరెడ్డి, వైస్ చైర్మన్‌గా పనిచేసిన కంచె రాములు, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, చెంచారపు క రుణాకర్‌రెడ్డి లాంటి కొ ందరు నాయకులు పోటీకి దూరంగా ఉంటున్నారు. వీరు దూరంగా ఉండడానికి ప్రధాన కారణం ఓడిపోతామనా..లేక కౌన్సిలర్‌గా కూర్చోవ డానికి ఇష్టం లేకనా అనేది చర్చ జరుగుతుంది.

**ఇక ఒక్క రోజే నామినేషన్లు**

ఎన్నికల కమీషన్ మూడు రోజులు నామినేషన్లకు గడవు ఇవ్వగా రెండు రోజులు పూర్తయ్యాయి. ఇక ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల గడువు పూర్తి కానుండగా భారీగా నామినేషన్లు ధాఖల్ అయ్యే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ బిఫాం ఎవరికి దక్కుతుంది..ఏదీ ఏమైనా జనగామ మున్సిపల్‌పై గులాబి జెండా ఎగరేయాలని కాలుదు వ్వుతున్న బిఆర్ఎస్ టిక్కెట్ల కేటాయింపు, ప్రచారంలో దూసుకుపోతుండగా కాంగ్రెస్‌లో మాత్రం ఇంకా కొలిక్కి రాకపోవడం, అభ్యర్థుల కేటాయింపులో మూడు ముక్కలాట నడుస్తుండడంతో జనగామలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటన్నది చర్చనీయాంశంగా మారింది.

## ఇన్‌చార్జి డిఆర్‌డిఒగా కొండపల్లి శ్రీరామ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇన్‌చార్జి డిఆర్‌డివొగా జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం కొండపల్లి శ్రీరామ్ ఇన్‌చార్జి డిఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజను కలిశారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మండల పరిధిలోని రేగులచలక గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. గురువారం పనులను సర్పంచ్ యండపల్లి రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టి రోజు వారి వేతనం తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యండపల్లి జగన్‌మోహన్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మకు మేయర్ నీరజ పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 17వ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో గల సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మేయర్ పునుకొల్లు నీరజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మేయర్ పునుకొల్లు నీరజ సమ్మక్క సారలమ్మ లను దర్శించుకుని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో ఖమ్మం అభివృద్ధి చెందాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, కార్పొరేటర్ ధనాల రాధ, మహిళలు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లూమింగ్ మైండ్స్‌లో ఆస్ట్రోనాట్ సినిమా షూటింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆస్ట్రోనాట్ సినిమా షూటింగ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా శంబాల సినిమా ఫేమ్ చైత్ర నటిస్తున్నారు. ఈ చిత్రంలో గీతాభాస్కర్‌తో పాటు హీరో, హీరోయిన్లుగా వరుణ్‌సందేశ్, వితికా షేర్ నటిస్తున్న ఈ సినిమాకు కార్తీక్ భాగ్యరాజ్ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్ట్రోనాట్ సినిమా షూటింగ్ మా పాఠశాలలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మీడియా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పురపాలక ఎన్నికల మీడియా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. కలెక్టరేట్ మొదటి అంతస్తులో గల జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. పురపాలక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో భాగంగా మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా కేంద్రం ద్వారా నిఘా పెట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంబంధ సమాచారం మీడియాకు ఎప్పటికప్పుడు అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రింట్ మీడియాలో ప్రచార ఖర్చుపై నిఘా, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచార అనుమతులకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి ఎంఏ గౌస్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ కె. ప్రవల్లిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో నామినేషన్ దాఖలు

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేసిన ఆదూరి ప్రేమ్‌కుమార్ సతీమణి ఆదూరి రాధ. ఈ కార్యక్రమంలో మెదరమెట్ల రాము, పాముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 53వ డివిజన్ ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన ముండ్ల ప్రసాద్ సతీమణి ముండ్ల విజయ గురువారం గుండెపోటుతో మరణించారు. ఆమె పార్థివ దేహాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. విజయ ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, నంబూరి సత్యనారాయణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ‘అద్దె ప్రచారం’ షురూ..!

### మొదలైన మున్సిపల్ ఎన్నికల ప్రచార సందడి
### గిట్టుబాటు అవుతుందంటున్న అద్దె ప్రచారకులు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇప్పుడు రెడీమెడ్ యుగం నడుస్తోంది. కావాలనుకుంటే నిమిషాల మీద అన్ని సిద్ధమవుతున్నాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలకు పని చేసేందుకు కార్యకర్తలు కూడా రెడీమెడ్‌గా దొరుకుతున్నారు. గతంలో పార్టీలకు అంకితభావం కలిగిన కార్యకర్తలు ఉండేవారు. పార్టీ కార్యక్రమాల్లో వారే పాల్గొనడంతో పాటు ఎన్నికల సమయంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసేవారు. ఇప్పుడు రాజకీయ పార్టీలకు అంత అంకితభావం కలిగిన కార్యకర్తలు లేరు. కమ్యూనిస్టులను మినహాయిస్తే నాయకులు కూడా ఏ ఎన్నికలకు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి. అందువల్ల ఆయా ఎన్నికలకు అనుగుణంగా రెడీమెడ్ కార్యకర్తలను వాడుకుంటున్నారు. ఎన్నికల్లో ఖర్చుతో పాటు ప్రచారం ద్వారా ఓటర్లను ఆకర్షించడం అనేది ఆనాదిగా వస్తుంది. ఇప్పుడు ఆ ప్రచారానికి అద్దె కార్యకర్తలు విరివిగా దొరుకుతున్నారు. ఈ కార్యకర్తలను సరఫరా చేసేందుకు కొందరు బ్రోకర్లు కాస్త నాజుగ్గా చెప్పాలంటే ఏజెన్సీలు వెలిశాయి. ఎంత మంది కార్యకర్తలు కావాలి, ఎన్ని గంటల వరకు ప్రచారం నిర్వహించాలి, ఇంటింటి ప్రచారమా లేక ర్యాలీలా, వీటితో పాటు దూర ప్రాంతపు సభలకు వెళ్లాలా అనే దానిని బట్టి కూలీ నిర్ణయిస్తారు. అందులో మహిళలా లేక పురుషులా వీటితో పాటు మాస్ లేక క్లాస్ వీటిని బట్టి ఏజెన్సీలు ధర నిర్ణయిస్తాయి. బరిలో నిలిచిన అభ్యర్థి ఎలా కోరితే అలా ఎన్నికల ప్రచారకులను సిద్ధం చేస్తున్నారు. ఇంకా కొన్ని సందర్భాల్లో మద్యం, బిర్యానీలు అదనపు భారంగా ఉంటాయి. ఇది కొంత కాలంగా నడుస్తున్న ట్రెండ్. ఆ ట్రెండ్‌కు అనుగుణంగానే ఇప్పుడు మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో అద్దె ప్రచారం ప్రారంభమైంది. ఒక పక్క నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగానే మరి కొందరు ప్రచారాన్ని ప్రారంభించారు. స్వతంత్రులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు ఆయా డివిజన్లు లేదా వార్డుల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. మరి కొందరు నామినేషన్ వేసేటప్పుడే బలప్రదర్శన నిర్వహించాలని నామినేషన్ల సందర్భంగా భారీ ఊరేగింపులు పెడుతున్నారు. ఇందుకు కూడా అద్దె కార్యకర్తలే అవసరం అవుతున్నారు. ఏజెన్సీలు లేదా బ్రోకర్లు ప్రచారకుల కూలీ పోను అదనంగా ఆయా అభ్యర్థుల నుంచి రాబడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇప్పుడు మళ్లీ అద్దె కార్యకర్తల అవసరం పెరిగింది. నామినేషన్లు వేయగానే నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న కొందరు బ్రోకర్లు ప్రచారానికి మనుషులు కావాలంటే చెప్పండి సారూ అంటూ ఫోన్ నెంబర్లు ఇస్తుండటం గమనార్హం. గతేడాది డిసెంబర్‌లో జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా చాలా గ్రామ పంచాయతీల్లో రోజు వారి కూలీలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఓ అభ్యర్థి చివరి రోజు 1,800 ఓట్లు ఉన్న గ్రామ పంచాయతీలో 800 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని చూసిన కొందరు ఓటర్లు ఈ అభ్యర్థి గెలుపు ఖాయం అనుకున్నారు. కానీ చివరకు ఆ అభ్యర్థికి 350 ఓట్లకు మించ లేదు. ఆ ఊరేగింపు అంతా అద్దె కార్యకర్తలే. కొన్ని ప్రాంతాల్లో ఉదయం ఒక పార్టీకి సాయంత్రం మరో పార్టీకి ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతంలో ఉదయం ఒక గుర్తు, సాయంత్రం మరో గుర్తుకు ఓటేయమని చెబుతుండడంతో ఓటర్లు ఆశ్చర్యపోతున్నారు. ఓటర్లు విస్తుపోవడం అభ్యర్థులు ఖర్చు చేయడం పక్కన పెడితే అద్దె ప్రచారకులు మాత్రం ఎన్నికల సందర్భంగా కాస్త బాగానే గిట్టుబాటు అవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ప్రచారం చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి యువకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. సరదాకు సరదా డబ్బుకు డబ్బు వస్తుండడంతో ఈ అద్దె ప్రచారం పట్ల ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. రెడీమెడ్ యుగంలో అందుకు అనుగుణంగానే ఎన్నికల ప్రచారాలు సాగుతుండటం గమనార్హం.

## ఎన్నికల విధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

### ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ఘట్టం
### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎన్నికల విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు నిర్వహించనున్న ఎన్నికల కోసం మండలపరిషత్ కార్యాయలంలో ఏర్పా టు చేసిన నామినేషన్ కౌంటర్లను తనిఖీ చేశారు. అలాగే అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, హెల్ప్‌డెస్క్‌లో అ న్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నియమ, ని బంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగే వి ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు కీలక ఘట్టమని, నా మినేషన్ పత్రాలల్లో అన్ని అంశాలు సరిగా ఉన్నాయో, లేవో జాగ్రత్తగా నింధనలు ప్రకారం చూడాలని తెలిపారు. వార్డు సభ్యుడి పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రపోజర్‌గా ఉండాలని అన్నా రు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయిం పు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చే యదలుచుకున్న అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. అలాగే అ భ్యర్థుల అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో నమోదు చేసేందుకు అవగాహనకు హెల్ప్ డెస్క్‌లో నివృత్తి చేసుకోవచ్చని, ప్రతి చిన్న అంశాన్ని అనుమానాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని వివరించారు. ఈ కా ర్యక్రమంలో తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, కమిషనర్ మున్వర్ అలీ, ఎంపిడిఒ రవికుమార్ , ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు పరిశీలన**

ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వెంకటగిరిలోని నా మినేషన్ల స్వీకరణ కేంద్రాలను అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ని బంధనలను కచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ బందోబస్త్ పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల విధుల పట్ల పోలీస్ అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించా రు.

## ‘మధిర’లో రెండో రోజు నామినేషన్లు





**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మధిర మున్సిపాల్టీలో రెండవ రోజు గురువారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మున్సిపల్ ఎన్నికలు సందర్భంగా మొదటి రోజు బుధవారం నామినేషన్లు వేయకపోవడం విశేషం. రెండవరోజు మధిర మున్సిపాల్టీలో బిజెపి నుండి 7నామినేషన్లు, బిఆర్ఎస్, సిపిఎం కూటమి నుండి 7 నామినేషన్లు, జనసేన పార్టీ నుండి 1 నామినేషన్ దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు. బిజెపి పార్టీ నుండి 1వ వార్డుకు పగిడిపల్లి విజయమ్మ, 4వ వార్డుకు కుంచం మల్లేశ్వరి, 6వవార్డుకు పగడాల యామిని, 7వ వార్డుకు దుగ్గిదేవర మణికంఠ, 10వ వార్డుకు పాపట్ల రమేష్, 15వ వార్డుకు బొడ్డు సరిత, 18వ వార్డుకు చక్రవర్తుల వరదరాజన్ నామినేషన్లు వేశారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ నుండి 6వార్డుకు నీలం అమల, 2వ వార్డుకు ధీరావత్ మాధవి, గుగులోత్ కృష్ణా నాయక్, 17వ వార్డుకు అంగడాల పార్వతీ, 21వ వార్డుకు పరిశ నాగ లక్ష్మీ , బిఆర్ఎస్ బలపర్చిన సిపిఎం పార్టీ నుండి 9వ వార్డుకు డాక్టర్ రవి కిషోర్ సతీమణి కస్తూరిభాయి, 18వ వార్డుకు పంతంగి నాగయ్య నామినేషన్లు వేశారు. అదేవిధంగా మధిర మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 17వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ కోఆర్డినేటర్ అనంత శివరామకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.

## నేడే నామినేషన్లకు తుది గడువు

### అభ్యర్థుల ఎంపిక, పొత్తుల చర్చల్లో పార్టీలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టానికి నేటితో తెర పడనుంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, పొత్తుల చర్చల్లో నిమగ్నమయ్యాయి. ఆయా మున్సిపాలిటీలలో ఎడతెగకుండా చర్చలు సాగుతున్నాయి. సంఖ్య కుదిరిన చోట వార్డుల విషయంలో బేధాభిప్రాయాలు రావడం కొన్ని చోట్ల సంఖ్యపై తేడాలు రావడం తదితర కారణాలతో పొత్తులు అనుకున్న రీతిలో కుదరడం లేదు. చివరి నిమిషం వరకు పొత్తులకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల నామినేషన్లు వేద్దాం తర్వాత కూర్చుని చర్చించుకుందామనే రీతిలో రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

**రెండవ రోజూ భారీగా నామినేషన్లు :**

మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండవ రోజున భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీతో కలిపి 224 నామినేషన్లు దాఖలయ్యాయి. అశ్వారావుపేటలో 58, ఇల్లందులో 66, కొత్తగూడెం కార్పోరేషన్‌లో 60 వార్డులకు గాను 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఖమ్మం జిల్లాలో కల్లూరు మున్సిపాలిటీకి రెండవ రోజున 70 నామినేషన్లు దాఖలు కాగా వైరాలో 62 నామినేషన్లు దాఖలయ్యాయి. మధిరలో 13, ఏదులాపురంలో 87 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు చాలా మంది రెండవ రోజున నామినేషన్లు దాఖలు చేశారు.

## కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడం హేయమైన చర్య

### మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దే గెలుపు
### -మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేసిఆర్‌కు సీట్ విచారణ పేరుతో నోటీసులు జారీ చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ నోటీసులు ఇస్తూ శునకానందం పొందుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రికి నోటీసులు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవర్తిస్తున్నారని, రాజకీయాలను పక్కదారి పట్టించే ప్రయత్నమని ఆయన తెలిపారు. గురువారం వైరా, మధిరలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో శాసన మండలి సభ్యులు తాతా మధుసూదన్, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు లతో కలిసి ఆయన నామినేషన్ల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత, బిఆర్ఎస్ పట్ల ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో అక్రమ కేసులు బనాయించి బిఆర్ఎస్‌ను బలహీనపర్చాలని చూస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయలేదని మధిరను అభివృద్ధిలో ముందు నిలిపామన్నారు. రైతుభరోసాను ఎగవేశారని, పింఛన్లను పెంచలేదని, తులం బంగారానికి తూట్లు పొడిచారని అజయ్‌కుమార్ ఆరోపించారు.

## ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి : కలెక్టర్ జితేష్



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** జరగబోయే మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడిఒసిలో ఎన్నికల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ 9381082501 నెంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ 24గం. పాటు అందుబాటులో ఉంటుందని, అందిన ప్రతీ ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత అధికారుల ద్వారా తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనల మేరకు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు కట్టుదిట్టంగా అమలు చేస్తూ, సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

## నూతన జాతీయ విద్యా విధానం రద్దుకోసం ఉద్యమిస్తాం

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మ ణ్



**ప్రజాపక్షం/చింతకాని :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మ ణ్ పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో లక్ష్మ ణ్ మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటీలను మూడు నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ , ప్రైవేటీకరణ కాషాయికరణ చేస్తుందన్నారు. యూనివర్శిటీల్లో ఆరెఎస్ఎస్ భావాలు ఉన్నవారినే నియమిస్తున్నారకని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జీడీపీలో 6శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిదానం అమలు చేస్తారని ప్రశ్నించారు. దేశ చరిత్రను సాయుదపోరాట వాస్తవాలను బిజేపీ వక్రీకరిస్తుందన్నారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, నవీన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా అమ్మకాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో యూరియా అమ్మకాలు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ప్రారంభమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వానాకాలంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా యూరియా సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ యాప్ యొక్క ముఖ్య ఉద్దేశం అవసరమైన ప్రతి రైతుకు పారదర్శకంగా అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచటమన్నారు. క్యూలో రైతులు నిలబడి ఆందోళన చెందటాన్ని నిరోధించడం, ఎవరి వద్ద ఎంత యూరియా అందుబాటులో ఉందో తెలుసుకోవచ్చునన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంట రకాన్ని, వారికి ఉన్న విస్తీర్ణాన్ని బట్టి ఏ డీలర్ నుంచైనా, ఏ సొసైటీ నుంచైనా బుకింగ్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల్లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ వద్దకు వెళ్లి కొనుగోలు చేయవచ్చునన్నారు. బుక్ చేసుకున్న తర్వాత యూరియా తీసుకోకపోతే ఆ బుకింగ్ రద్దవుతుందని మరల బుక్ చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతులు కూడా ఈ యాప్‌లో యూరియాను బుక్ చేసుకోవచ్చని కౌలుకు తీసుకున్న పొలానికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ద్వారా బుక్ చేసుకోవాలని ఆ పట్టాదారు ఓటిపి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్‌ను రైతులకు అలవాటు చేయడానికి, అవగాహన కల్పించడానికి ప్రతి అవుట్‌లెట్ల దగ్గర వ్యవసాయ శాఖాధికారిని నియమించడం జరుగుతుందని, ఏఈవోలు రైతులకు సహాయ సహకారాలను అందిస్తారన్నారు. రైతులు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు.

## 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఫణితి సైదులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు మాజీ కౌన్సిలర్ ఫణితి ఉష భర్త ఫణితి సైదులు గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఫణితి సైదులు నామినేషన్ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున తరలివచ్చింది. ఈ కార్యక్రమంలో పోటు మధుసూదన్‌రావు, సరిపుడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టి–20 ప్రపంచకప్‌ను బాయ్‌కాట్ చేసేంత ధైర్యం పాకిస్థాన్‌కు లేదు..

భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహానే

టి–20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ వైదొలగగా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కొత్త నాటకానికి తెరతీసింది. మా ప్రభుత్వం అనుమతిస్తేనే వరల్డ్‌కప్ ఆడుతామంటూ పిసిబి చీఫ్ మొహ్సిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. అయితే.. పాక్ బోర్డు బాయ్‌కాట్ వార్తలను భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహానే ఖండించాడు. పాక్ బోర్డు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందని, వరల్డ్‌కప్ బాయ్‌కాట్ చేసేంత దమ్ము, ధైర్యం ఆ దేశానికి లేదని రహానే అన్నాడు. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ పిసిబి బెదిరింపులను టీమిండియా మాజీ ఆటగాడు అజింక్యా రహానే కొట్టిపారేశాడు. గురువారం క్రిక్‌బజ్‌తో మాట్లాడిన అతడు 'పాకిస్తాన్ భారత జట్టు వరల్డ్‌కప్ బాయ్‌కాట్ చేస్తుందని నేను అనుకోవటం లేదు. మెగా టోర్నీ నుంచి వైదొలిగేంత దమ్ము, ధైర్యం ఆ దేశ బోర్డుకు లేవు. ఇప్పటికే షెడ్యూల్ ఖరారు వ్వడంతో పాటు ఒప్పందం ప్రకారం ఆ జట్టు మ్యాచులన్నీ శ్రీలంకలోనే ఉన్నాయి. సో.. బాయ్‌కాట్‌కు సిద్ధపడుతుందని నేను భావించను. అన్ని జట్లలానే పాక్ కూడా వరల్డ్‌కప్ కోసం వస్తుంది' అని పేర్కొన్నాడు. ఒకప్పుడు టీమిండియాలో కీలక ఆటగాడైన రహానే ప్రస్తుతం దేశవాళీ క్రికెట్, ఐపిఎల్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.







## జింఖానాలో చెలరేగిన సిరాజ్..

ఓపెనర్ల జోరుతో పటిష్ఠ స్థితిలో హైదరాబాద్ !

టీమిండియా పేసర్ సిరాజ్ దేశవాళీ క్రికెట్‌లో చెలరేగిపోయాడు. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ డి మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ బ్యాటర్లను వణికిస్తూ వికెట్ల వేటతో హైదరాబాద్‌కు బ్రేకిచ్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు(456) తీసి ప్రత్యర్థిని ఆలౌట్ చేయడంలో కీలకపాత్ర పోషించాడు మియా భాయ్. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ వికెట్ పడకుండా 56 పరుగులు చేసింది. రంజీ ట్రోఫీలో భాగంగా ఎలైట్ డీలోని ఛత్తీస్‌గఢ్ జరిగిన మ్యాచ్‌లో సిరాజ్ రెచ్చిపోయాడు. జింఖానా మైదానంలో తన తడాఖా చూపిస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించాడు సిరాజ్. ఓపెనర్ అనుజ్ తివారీ(4)ను జెట్ స్పీడ్ బంతితో బోల్తా కొట్టించిన సిరాజ్.. ఆతర్వాత సంజీత్ దేశాయ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ప్రతీక్ యాదవ్(106)తో కలిసి జట్టును ఆదుకున్న వికెట్ కీపర్ తివారీ(94)ని సైతం వెనక్కి పంపిన అతడు.. టెయిలెండర్ ఆదిత్య సర్వాతే(4)ను ఔట్ చేసి నాలుగో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. సిటిఎల్ రక్షణ్(22–8) రెండు వికెట్లతో రాణించగా ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 283 కే ఆలౌటయ్యింది. ప్రతీక్ సెంచరీ, వికెట్ల శతకంతో భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లిన ఛత్తీస్‌గఢ్ మూడొందలలోపే కట్టడి చేసిన బౌలర్ల కృషిని బ్యాటర్లు వృథా కానివ్వలేదు. ఓపెనర్లు అమన్‌రావు పెరాల(32 నాటౌట్), అభిరత్‌రెడ్డి(23 నాటౌట్)లు అదిరే ఆరంభమిచ్చారు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 56 రన్స్ చేసింది.


## ఏంటి సంజూ.. ఈ ఆట!

### ఇలాగైతే వరల్డ్‌కప్‌లో కష్టమే?



అవకాశాలు రానప్పుడు ఒకలా.. జట్టులోకి వచ్చాక మరోలా ఆడడం సంజూ శాంసన్‌కే చెల్లుతుంది. అలాఅనీ పొట్టి క్రికెట్లో అతడికి అనుభవం లేదా? అంటే అదీ కాదు. ఐపిఎల్లో విధ్వంసక ఆటగాడిగా, సిక్సర్ల వీరుడిగా పేరుంది.. నిరుడు టి–20ల్లో సెంచరీలు కూడా కొట్టాడు. వరల్డ్‌కప్‌లో దంచేస్తాడులే అని సెలెక్టర్లు స్క్వాడ్లోకి తీసుకోగా.. సంజూ మాత్రం ఉసూరుమనిపిస్తున్నాడు. తోటి ఓపెనర్ అభిషేక్ శర్మ జాలీగా సిక్సర్ల మోతతో విరుచుకుపడుతుంటే.. మనోడు మాత్రం చెత్త షాట్లతో చతికిలపడుతున్నాడు. ఆఖరి మ్యాచ్‌లోనూ అలానే ఆడితే వరల్డ్‌కప్‌లో బెంచ్ మీదే కూర్చోవాల్సి వస్తుందేమో. ప్రతిభకు కొదవలేదు కానీ అదృష్టమే అతడివైపు లేదు అనే మాట సంజూ శాంసన్‌కు నూటికి నూరుపాళ్లు వర్తిస్తుంది. ఎప్పుడో అరంగేట్రం చేసిన సంజూ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకోలేకపోయాడు. అతడి వెనకాల వచ్చిన రిషభ్ పంత్, కుర్రాళ్లు యశస్వీ జైస్వాల్, ఇషాన్ కిషన్ అదరగొడుతున్నారు. శుభమన్ గిల్ ఏకంగా వన్డే, టెస్టు కెప్టెనయ్యాడు. కానీ, సంజూ ఇప్పటికీ జట్టులోకి ఇలా వస్తూ అలా వెళ్తున్నాడు. దీనికంతటికి కారణం.. నిలకడలేమి. అలవోకగా సిక్సర్లు కొట్టగల సత్తా ఉన్నా.. మ్యాచ్ గెలిపించగల ఆటగాడిగా పేరు సంపాదించలేకపోయాడీ కేరళ స్టార్. భారత జట్టు జెర్సీ ధరించే అవకాశం లక్షల్లో కొందరికే వస్తుంది. అలాంటి అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకుంటారు కొందరు. కానీ, మరొకొందరు చేజేతులా టీమిండియాకు దూరమవుతుంటారు. సంజూ రెండో కోవకే చెందుతాడు. అవును.. గతంలోనూ అతడికి అవకాశాలిచ్చినా ఆకట్టుకోలేదు. ఈమధ్యే మెరుపు ఇన్నింగ్‌తో జట్టులోకి వచ్చినా మళ్లీ 'నా తీరింతే' అన్నట్టుగా వరుస వైఫల్యాలతో సెలెక్టర్లు తలలు పట్టుకునేలా చేస్తున్నాడు. స్వదేశంలో ఫిబ్రవరి 7 నుంచి జరుగబోయే టి–20 ప్రపంచకప్ కోసం శాంసన్ ఎంపిక చేయడంతో అభిమానులు సంతోషించారు. సన్నాహక సిరీస్‌లో న్యూజిలాండ్ తన స్టయిల్ పవర్ హిట్టింగ్‌తో జట్టు విజయాల్లో కీలమవుతాడని అందరూ భావించారు. కానీ, మనోడు మాత్రం షాట్ ఎంపికలో అయోమయానికి గురవుతూ.. కివీస్ బౌలర్లకు తేలికగా వికెట్ ఇచ్చేస్తున్నాడు. తొలి మ్యాచ్‌లో 10, రెండో మ్యాచ్‌లో 6, మూడో మ్యాచ్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన సంజూ.. విశాఖలోనైనా చెలరేగుతాడనుకుంటే.. 24 పరుగులతో నిరాశపరిచాడు. చిట్టచివరి మ్యాచ్‌లోనైనా మెరిసి తన ఎంపిక సరైందేనని అతడు చాటుకుంటే సరి. లేదంటే.. వరల్డ్‌కప్‌లో అభిషేక్ శర్మ జతగా ఇషాన్ కిషన్ ఓపెనర్ అవతారమెత్తినా ఆశ్చర్యమేమీ లేదు.

## ఎముకల క్షీణత సాధారణం..



వయసుతోపాటు పెరిగే ఆరోగ్య సమస్యలు..వయసు పెరిగేకొద్దీ ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. అప్పటి వరకూ 'ఆరోగ్యానికి పర్యాయపదం నేనే' అనుకుంటూ తిరిగిన వారు కూడా క్రమంగా ఏదో ఒక రుగ్మత బారిన పడడం మొదలవుతుంది. కొందరిని 40 లేదా 45 ఏళ్ల లోనే అనారోగ్యం పలకరిస్తుంది. మరికొందరు 50 లేదా 60 ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవచ్చు. వయసు తేడా తప్ప, పెరిగే వయసులో శరీరం శిథిలం కావడం ప్రారంభమవుతుందనేది చేది నిజం. అలాంటి రుగ్మతల్లో మొదటగా ప్రస్తావించాల్సిన అంశం ఎముకల క్షీణత. యవ్వనంలో తెలియకుండా తిరిగేస్తాంగానీ ఒక వయసుకు వచ్చేసరికి ఎముక క్షీణత ఎక్కువగా ఉంటుంది. 4550 ఏళ్లు దాటిన వారిలో ఎముకలు ఎండుపుల్లల్లా పెళుసుగా, బోలుగా తయారవ్వటమన్నది చాలా ఎక్కువ. ఈ ముప్పు స్త్రీలలో మరీ ఎక్కువ. దీనివల్ల చీటికీమాటికీ పడిపోవటం, ఏ చిన్న దెబ్బ తగిలినా ఎముకలు విరిగిపోవటం చాలా తరచుగా చూస్తుంటాం. పైగా ఒకసారి విరిగితే వీరిలో అంత త్వరగా అతకవు కూడా. దీంతో మొత్తానికి కదలికలు తగ్గిపోవటం, తన పని తాను చేసుకునే పరిస్థితి కూడా లేకపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఎముక సాంద్రత తగ్గటం వల్ల వెన్నుపూసలు విరిగిపోవటం కూడా వీరిలో ఎక్కువే. అసలీ ఎముక బోలు సమస్య (ఆస్టియోపొరోసిస్) వృద్ధాప్యంలో చాలా సహజమని అంతా నమ్ముతుంటారుగానీ ఇది నిజం కాదు. ముందు నుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీని బారిన పడాల్సిన అసరమే లేదు. పొగ తాగకుండా ఉండటం, క్యాల్షియం అధికంగా ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవటంఅవసరం. మన జీవక్రియలకు తగినంత క్యాల్షియం అవసరం. మన ఆహారంలో క్యాల్షియం తగినంత లేకపోతే మన శరీరం దాన్ని ఎముకల నుంచి వెనక్కి తెచ్చుకుంటుంది. దీంతో ఎముకలు బలహీనపడతాయి. అలాగే కడుపులో బిడ్డ ఎదిగేటప్పుడు, బిడ్డకు పాలిచ్చే తల్లుల శరీరం నుంచి చాలా క్యాల్షియం బిడ్డకు వెళ్లిపోతుంది. దీంతో స్త్రీలు ఆస్టియోపొరోసిస్ బారినపడే అవకాశాలు చాలా ఎక్కువ. కాబట్టి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాల పదార్థాలు, ఆకుకూరలు, సోయా, గోబీ, చేపల వంటివి తీసుకోవాలి. ఈ తీసుకున్న క్యాల్షియం ఎముకలకు పట్టేందుకు వ్యాయామం చెయ్యటం కూడా అవసరం. అలాగే కాస్త ఎండలో తిరిగితే విటమిన్‌డి దక్కుతుంది, ఎముక బలానికి ఇదీ ముఖ్యమే. ఒక వయసు రాగానే అందరూ వైద్యులను సంప్రదించి ఎముక సాంద్రత పరీక్ష చేయించుకుని, ఆస్టియోపొరోసిస్ ఉంటే తగు జాగ్రత్తలు, చికిత్స తీసుకోవటం అవసరం. అలాగే బాత్రూముల్లో పడిపోకుండా నేల నునుపుగా జారిపోయేలా లేకుండా చూసుకోవటం, ఇంట్లో నడిచేటప్పుడు పరిస్థితిని బట్టి నాలుగుకోళ్ల కర్ర సాయం తీసుకోవటం, తల తిప్పు, తూలు రావటం వంటి లక్షణాలు కనబడుతుంటే తక్షణం వైద్యులకు చూపించుకుని, చికిత్స తీసుకోవటం కూడా చాలా అవసరం.

## ఆటిజంలోనూ ప్రేమ, సంరక్షణ..



ఆటిజం ఉన్న వ్యక్తులు తల్లిదండ్రులు కాలేరనే అపోహ ఇప్పటికీ చాలా సమాజాల్లో ఉంది. కానీ వాస్తవం ఏమిటంటే, ప్రేమ, సంరక్షణ, బాధ్యత అనే గుణాలు ఎలాంటి నాడీ భేదాలకూ పరిమితమవ్వవు. ఈ సత్యాన్ని నిశ్శబ్దంగా కానీ బలంగా నిరూపించే అనేక కుటుంబాల్లో ఒకటి, ఇటీవల తమ జీవితంలో కొత్త వెలుగును ఆహ్వానించిన ఒక ఆటిజం ఉన్న దంపతుల కుటుంబం. తమ బిడ్డను తొలిసారి చేతుల్లోకి తీసుకున్న ఆ క్షణంలో, ఆ తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం ఇతర తల్లిదండ్రుల ఆనందంతో ఏ మాత్రం భిన్నంగా లేదు. భయం, బాధ్యత, ఆశ, కలలు వంటి అనుభూతులన్నీ ఒకే సమయంలో వారి మనసుల్లో మెదిలాయి. మన బిడ్డ ఆరోగ్యంగా ఉంది అన్న సంతోషమే వారికి అన్నిటికంటే గొప్పది. సమాజం ఏ ముద్ర వేసినా, తాము తమ బిడ్డకు సంపూర్ణమైన ప్రేమ ఇవ్వగలమనే నమ్మకం వారికి బలంగా ఉంది. ఆటిజం ఉన్న తల్లిదండ్రులు జీవితాన్ని కొంచెం భిన్నంగా చూస్తారు. వారు వివరాలపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు, బాధ్యతను లోతుగా అర్థం చేసుకుంటారు, నిర్ణయాలను ఆలోచించి తీసుకుంటారు. ఈ లక్షణాలే వారిని మంచి తల్లిదండ్రులుగా మార్చుతాయి. పిల్లల పెంపకం అనేది పరిపూర్ణత కాదు, నిరంతర శ్రద్ధ, నేర్చుకోవడం, అంగీకారం వంటి అంశాలే ముఖ్యమని వారు నమ్ముతారు. తమ బిడ్డ భవిష్యత్తు గురించి అడిగినప్పుడు, 'మా బిడ్డ ఎలా ఎదిగినా, ఏ మార్గాన్ని ఎంచుకున్నా, మా ప్రేమ ఎప్పటికీ మారదు' అని ఆ తల్లిదండ్రులు ఒకే మాట చెప్పారు. ఈ మాటల్లో ఒక గొప్ప జీవన తత్వం దాగుంది. పిల్లలను తమ అంచనాలకు సరిపోల్చడం కాదు, వారు తమ స్వంత వ్యక్తిత్వంతో ఎదగడానికి అవకాశం ఇవ్వడమే నిజమైన తల్లిదండ్రత్వం. ఆటిజం గురించి సమాజంలో ఉన్న అపోహలు ఇంకా చాలానే ఉన్నాయి. కానీ ఈ కుటుంబంలాంటి ఉదాహరణలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. ఆటిజం అనేది లోపం కాదు, అది ఒక భిన్నమైన నాడీ నిర్మాణం మాత్రమే. అది మానవత్వాన్ని తగ్గించదు, ప్రేమించగల శక్తిని హరించదు, బాధ్యత తీసుకునే సామర్థ్యాన్ని నశింపజేయదు. ఈ కథ మనకు ఒక ప్రేరణను ఇస్తుంది. మనం వ్యక్తులను వారి వైద్య పదాలతో కాదు, వారి మానవ గుణాలతో కొలవాలని. తల్లిదండ్రత్వం అనేది సాధారణం అనే నిర్వచనానికి లోబడి ఉండాల్సిన అవసరం లేదని. ప్రేమ ఉన్న చోట, శ్రద్ధ ఉన్న చోట, అంగీకారం ఉన్న చోట కుటుంబం వికసిస్తుందని అర్థం చేసుకోవాలని ఈ ఘటన మనకు పాఠం చెప్తుంది.

## విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు : ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థిలోకం పోరాటాలు చేయాలని ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి వరక అజిత్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్ అధ్యక్షతన జరిగిన ఎఐఎస్ఎఫ్ పట్టణ మహాసభ విజయవంతమైంది. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ నానాటికీ విద్యావ్యాపారం పెరిగిపోతోందని, ప్రభుత్వంలోని పెద్దలే విద్యా వ్యాపారానికి పునాదులు వేస్తున్నారని, వారే కార్పొరేట్ విద్యాలయాలకు అధిపతులుగా, ప్రైవేటు యూనివర్సిటీలకు యజమానులుగా ఉన్నారని మండిపడ్డారు. దీంతో పేద విద్యార్థులకు శాస్త్రీయమైన చదువు అందని ద్రాక్షలా మారిందని, చదువులు కొనలేక అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పి బతుకు తెరువు కోసం పనిబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఏకం కావాలని, ప్రభుత్వాలు అవలంభిస్తున్న ధ్వంద విధానాలను నిలదీయాలని కోరారు. విద్యారంగ, కళాశాల సమస్యల పరిష్కారం కోసం ఎఐఎస్ఎఫ్ ముందుండి పోరాడుతుందని, అందుకు అంతా చేయి కలపాలన్నారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వీసంపల్లి హేమంత్, సాధనపల్లి మనోజ్‌తో పాటు 13 మందితో నూతన కమిటీ ఎంపికైంది. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి దుర్గం వరుణ్ ఉపాధ్యక్షులు గుర్రం అనిష్, మండల సమితి సభ్యులు సాధనపల్లి అవినాష్, సాధనపల్లి చరణ్, గుగ్గిళ్ల సంజయ్, కర్ర శివ కేశవ, నవీన్ మహేష్, కళ్యాణ్, వంశీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమిస్తాం : లక్ష్మణ్



**ప్రజాపక్షం/చింతకాని :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తిసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటీలను మూడు నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ చేస్తుందన్నారు. యూనివర్శిటీల్లో ఆరెఎస్ఎస్ భావాలు ఉన్నవారినే నియమిస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను సాయుధ పోరాట వాస్తవాలను బిజెపి వక్రీకరిస్తుందన్నారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, నవీన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులకు ఎఐటియుసి అండ

పల్లా దేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. గురువారం ఎఐటియుసి–2026 నూతన డైరీని దేవరకొండలో ఆవిష్కరించి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏర్పడ్డ మొట్ట మొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అన్నారు. నాటి నుండి నేటి వరకు కార్మికుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతుందన్నారు. కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చివేసి పెట్టుబడి దారులకు కొమ్ము కాసే విధంగా లేబర్ కోడ్‌లను తీసుకొని రావడం విచారకరమన్నారు. కొత్త లేబర్ చట్టాలతో సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, కనీస వేతనాల కోసం పోరాడే హక్కులను హరించివేశారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు మరింత తీవ్రతరం చేయాలని ఆయన కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు సమూలంగా మార్చివేస్తూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ల చేతుల్లో పెడుతుందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం కార్మిక లోకం పోరాటాలు మరింత తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బిజెపి పాలనలో కార్మికులు ఉపాధి కోల్పోయి దేశంలో నిరుద్యోగం మరింత పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ కోశాధికారి వెంకటరాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లయ్య, వెంకటయ్య, నాయకులు మైనోద్దిన్, హరి, సైదులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గురువారం సంఘం జిల్లా అధ్యక్షురాలు వనమాల అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసచారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 4 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకే పంపేలా ప్రభుత్వం జిఒ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలోజిల్లా ఉపాధ్యక్షుడు బుక్కా రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయంతిమాల, అనిత పాల్గొన్నారు.



## సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు





**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మునిసిపాలిటీలో కాంగ్రెస్, సిపిఎం పార్టీలు బలపర్చిన 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా సిపిఐ అభ్యర్థి తిరునాటి సంజయ్ గురువారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సయ్యద్ సలీం ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సలీం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కార్మికులు, కర్షకులు పేద మధ్య తరగతి ప్రజల కోసం సిపిఐ నిరంతరం శ్రమించి పోరాడిందన్నారు. పట్టణంలోని ఇళ్ళ స్థలాలు లేని వేలాది మంది ప్రజలకు ఇంటి జాగా కల్పించిన పార్టీ సిపిఐ అన్నారు. పట్టణంలో పెద్దఎత్తన ప్రజల మద్దతు కూడగట్టి పొత్తుల్లో ఉన్న పార్టీల విజయం కోసం సిపిఐ కృషి చేస్తుందన్నారు. 19వ వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసిన సిపిఐ అభ్యర్థి విజయానికి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షులు పఠాన్‌జలాల్, పార్టీ శ్రేణులు, విజయ్‌కాంత్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**చౌటుప్పల్ :** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్‌లో పలు వార్డులకు గురువారం సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 20వ వార్డు అభ్యర్థిగా ఉడుత రామలింగం, 4వ వార్డు అభ్యర్థిగా దాసరి కృష్ణ, 16వ వార్డు అభ్యర్థిగా బద్దుల సుధాకర్ నామినేషన్‌లు దాఖలు చేశారు. సిపిఐ అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారుల ఎదుట నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగుతున్నామని నామినేషన్ల సందర్భంగా సిపిఐ నేతలు తెలిపారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత, పేద ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీకి రెండవ వార్డు నుండి సిపిఐ అభ్యర్థిగా పెరిక మల్లమ్మ గురువారం పార్టీ నాయకులతో కలిసి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ వార్డు కౌన్సిలర్ సిపిఐ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సహకారంతో వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మండల కార్యవర్గ సభ్యుడు దోటి వెంకన్న, సిపిఐ చండూరు పట్టణ కార్యదర్శి దోటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 11వవార్డు సిపిఐ అభ్యర్థిగా దారదాసు సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జీ పులిజాల పరుషరాంతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి గురువారం నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దారదాసు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఐకి వార్డుప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగుతున్నామని నామినేషన్ల సందర్భంగా సిపిఐ నేతలు తెలిపారు.







## మాదక ద్రవ్యాల వినియోగంపై నిరోధానికి చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/సిద్దిపేట:** జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం జరుగకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్ కలసి మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం మూలంగా మనుషులు విచక్షణ కోల్పోయి ప్రవర్తించి సమాజానికి కీడు చేస్తారన్నారు. పోలీసు, ఎక్సైజ్ డ్రగ్ ఇన్స్పెక్టర్లు జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ తనిఖీలు నిర్వహించి మాదక ద్రవ్యాలు సరఫరా వినియోగం జరుగకుండ జరుగకుండ చూడాలన్నారు. ప్రతి మెడికల్ షాపులో అమ్ముతున్న మందుల వివరాలను పరిశీలించామన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు నివసించే ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. విద్యాసంస్థల్లో పేరెంట్స్, టీచర్స్ కమిటీలో మాదక ద్రవ్యాలపై చర్చించాలన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రచారాలను సినిమా హాల్‌లో స్లైడ్స్‌లో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో కేంద్రంలో గల డిఅడిక్షన్ సెంటర్‌లో అడ్మిట్ అయ్యేవారి వివరాలను పోలీస్ సంబంధిత అధికారులను తెలియజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డిసిపి కుశాల్కర్, ఏసిపిలు, శ్రీనివాసమూర్తి, డిఎంహెచ్ఓ ధనరాజ్. సురేష్‌బాబు. స్వరూపరాణి పాల్గొన్నారు.

## సజావుగా నామినేషన్ల స్వీకరణ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ముందుగా నామినేషన్ కేంద్రాల్లో ఓటర్ జాబితా, రిజర్వేషన్ జాబితా, నో డ్యూ సర్టిఫికెట్, హెల్ప్ డెస్క్, అభ్యర్థుల కోసం చేసిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కులం ధృవీకరణ పత్రాల మంజూరులో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సిరిసిల్ల తహసీల్దార్ కు ఆదేశించారు. ఈ నెల 30 వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి 05.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. సిరిసిల్లలో 39 వార్డులకు సంబంధించి.. 13 మంది ఆర్ఓలు, 13 మంది ఏఆర్ఓలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నియమించామని తెలిపారు. జనరల్ అభ్యర్థులకు ఎన్నికల డిపాజిట్ రూ. 2500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రూ. 1250 ఉందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, ఖదీర్ పాషా, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్' విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు




**ప్రజాపక్షం/కరీంనగర్:** అల్ఫోర్స్ ఈ టెక్నో విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో అత్యధిక బంగారు పథకాలు సాధించినట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష ద్వారా అనేక ఉపాధి అవకాశాలు ఉంటాయని మరియు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ భాషలో పట్టు రావాలని, వాటిలోని విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఇటీవల ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జాన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.వేదవిహార్, 4వ తరగతి, కె. సుకృత, 5వ తరగతి, బి.తన్మయి, 7వ తరగతి, టీ అమితా విక్రం, 9వ తరగతి, తదితర విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. విజేతలకు పుష్పగుచ్చాలను అందజేసి రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతమైన విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు: అడిషనల్ కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుండి గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న వేసవిలో గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో భాగంగా ఫిబ్రవరి 1నుండి 20 వరకు ప్రతి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. తాగునీటి సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో ఏ దైనా తాగునీటి సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1916 ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాస్, వివిధ మండలా ల నుండి ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏఈఈలు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేద్రాలను పరిశీలించిన అబ్జర్వర్

**ప్రజాపక్షం/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, నోడల్ అధికారులు గీత, నవీన్ కుమార్, భారతి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఓ అన్సార్ ఉన్నారు.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

కరీంనగర్ కార్పోరేషన్‌లో రెండో రోజు 120 నామినేషన్లు

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ వివరాలు ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా డివిజన్ స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, హెల్ప్ డెస్క్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా ఎన్నికల సిబ్బంది విధులను పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు.

**చొప్పదండి నామినేషన్ కేంద్రాల పరిశీలన**

చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు స్పష్టంగా వివరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు. **కార్పోరేషన్‌లో రెండో రోజు 120:** కరీంనగర్ కార్పోరేషన్ లో మొదటి రోజు 80 నామినేషన్లు దాఖలు కాగా రెండో రోజు 120 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు. తాజా మాజీ మేయర్ వై.సునీల్ రావు 42 వ డివిజన్ లో బిజేపి తరుపున నామినేషన్ వేశారు. తాజా మాజీ డిప్యూటి మేయర్ చల్లా స్వ రూప రాణి, హరిశంకర్ దంపతులు 47,21 వ డివిజన్ లలో బిఆర్ ఎస్ తరుపున నామినేషన్ దాఖలు చేయగా వారి వెంట మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఉన్నారు.

## రెండో రోజు 72 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/దుబ్బాక:** దుబ్బాక మున్సిపాలిటీలో నామినేషన్ ప్రక్రియలో రెండో రోజు భారీ నామినేషన్ దాఖలయ్యాయి. రెండో రోజు 72 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపాలిటీ కమిషన్ రమేష్‌కుమార్ తెలిపారు. మొదటి రోజు దాఖలైన 18 నామినేషన్లతో కలిసి ఇప్పటి వరకు మొత్తం 90 నామినేషన్ల దాఖలయ్యాయి. నామినేషన్ దాఖలుకు చివరి రోజు శుక్రవారం కావడంతో మరింత ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా అదనపు కౌంటర్లు,భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** జిల్లా పరిధిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లు, నూతన ప్రైవేట్ దవాఖానలకు అనుమతుల జారీ, నవజాత శిశు మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సుదీర్ఘ సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పని తీరుపై నిరంతరం పర్యవేక్షించాలని, భ్రూణ హత్యలు జర్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీసీ ఎన్ బీ యాక్ట్ సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. భ్రూణ హత్యలతో మగ, ఆడ పిల్లల లింగ నిష్పత్తిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ఆడ అయినా.. మగ అయినా ఒకటేనని, ఇద్దరూ సమానమేనని స్పష్టం చేశారు. దీనిపై వైద్య ఆరోగ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని అనుమతులు ఉన్న వాటికి నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు జారీ చేస్తామని తెలిపారు. జిల్లాలో నవజాత మరణాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

**సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి..**

ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని, అత్యధికంగా ప్రసవాలు జరిగేలా తీసుకోవాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని,అత్యవసరమైన పక్షంలోనే సీ సెక్షన్ ఆపరేషన్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ శోభారాణి, ఎన్జీఓ ప్రతినిధి భాస్కర్, ఆయా మండలాల వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

## నేత్రపర్వంగా మత్స్యగిరీంద్ర స్వామి కల్యాణం

హాజరైన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి





**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి కళ్యాణం లీలాదేవి, భూదేవిలతో గురువారం నేత్రపర్వంగా వేద పండితులు నిర్వహించారు. స్వామి వారి కళ్యణ వేడుకలకు బీసీ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వేరువేరుగా హాజరయ్యారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కవ్వంపల్లి సత్యానారాయణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేశంతో కలసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన విడపు వంశాస్తులు స్వామి వారికి పుస్తె మట్టెలు తీసుకురాగా గ్రామస్తులు ఆలయ కమీటి వేద పండితులు ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దమే కాకుండా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించిన పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో లయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోరెం రాజిరెడ్డి, పిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బసవయ్య గౌడ్, తిరుపతి, తిరుపతి గౌడ్, మల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **సమ్మక్క సారలమ్మకు ఎత్తు బంగారం సమర్పించిన మంత్రి పొన్నం:** శంకరపట్నం మండలం కేశవపట్నంలో సమ్మక్క సారలమ్మ దేవతలకు బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎత్తు బంగారం సమర్పించి,వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఈవో మారుతి రావు,చైర్మెన్ గుర్రం స్వామి,మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్,సర్పంచ్ గోదారి రాజేంద్ర ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్,మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ నాంపల్లి తిరుపతి,జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్,రాయిని రమేష్,జాతర కమిటి సభ్యులు భక్తులు పాల్గోన్నారు.

## హుస్నాబాద్‌లో రెండవ రోజు 26 నామినేషన్లు

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** హుస్నాబాద్ మున్సిపాలీటిమున్సిపల్ రెండవ సాదారణ ఎన్నికల లో బాగంగా గురువారం 20 వార్డుల్లో వివిధ పార్టీల 12 వార్డు నుండి గోనేల మధుకర్, 15 వార్డు నుండి చిత్తారి మంజుల, 16 వ వార్డు నుండి వైద్య కిరన్, 11వార్డు నుండి పచ్చిమట్ల రవిందర్, 5 వార్డు నుండి రాజ్‌కుమార్ , 6వ వార్డు నుండి భూక్యలక్ష్మ న్‌నాయక్, 1 వార్డు నుండి కూతాటి స్వప్న, 2 వార్డు నుండి బూర్గు లత, 1 వార్డు నుండి తోట స్వరూప, 4 వార్డు నుండి బూరవెంకన్న, 11వ వార్డు నుండి పి వరప్రసాద్, 20 వ వార్డు నుండి మేకల వికాస్ యాదవ్, 19 బండి పుష్ప, 1 వార్డు నుండి బాషవేని లక్ష్మి, 10 వార్డు నుండి గడిపె శౌభ, 18 వార్డు నుండి ఐలేని అనిత రెడ్డి, 3 వార్డు నుండి లక్కిరెడ్డి తిరుమల, 13 నుండి గందె చిరంజీవి, 9 నుండి బత్తుల శంకర్‌బాబు, 3 వార్డు నుండి కొండ రజిత, 5 వార్డు నుండి రాజు బొల్లి శెట్టి, 7వార్డు నుండి చిత్తారి పద్మ, 10వార్డు నుండి సావుల మంజుల, 8 వార్డు నుండి లత , 8 వార్డు నుండి వేల్పుల కళ్యాణిలు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## రక్తసంబంధీకుల నుండి పిల్లల దత్తత

ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఏడు సంవత్సరాల బాలికను హైదరాబాద్ కు చెందిన పిల్లల్ని దంపతులు దత్తత తీసుకున్నారు. కరీంనగర్ అర్బన్ పరిధిలోని గోపాల్ పూర్ కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి సమీప బంధువుల నుండి 13 సంవత్సరాల బాబును దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా ఈ దత్తత కార్యక్రమం కలెక్టరేట్ లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు, బాల సదనాల నుండి దత్తత కోరుకునేవారు జిల్లా పరిషత్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దర్ధాన పర్వీన్, సిడబ్ల్యుసి మెంబర్లు కళింగ శేఖర్, విజయ్ కుమార్, ఎల్‌పిఓ రాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది తిరుపతి, సాధినేని రమేష్, కవిత, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ధర్మపురిలో 40 నామినేషన్లు



**ప్రజాపక్షం/ధర్మపురి:** మున్సిపల్ ఎన్నికలకై బుధవారం నామినేషన్లు ప్రారంభంకాగా రెండవరోజు గురువారం ధర్మపురి పురపాలక సంఘంలో నామినేషన్ల జాతర కొనసాగింది. ధర్మపురి మున్సిపాలిటీలో 15 వార్డులకు తొలి రోజు 10 నామినేషన్ సెట్లు దాఖలు కాగా రెండవరోజు గురువారం వివిధ వార్డులనుండి పెద్ద సంఖ్యలో ఆశావహులు తరలివచ్చి ఏకంగా 40 నామినేషన్లు వేశారు. ధీంతో నామినేషన్లు స్వీకరణ కేంద్రమైన పురపాలక సంఘం ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ వేసే అభ్యర్థి అతని ప్రతిపాదకుడు మున్సిపల్ లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు తప్పనిసరిగా చెల్లిస్తుండటం తోపాటు దానికి రుజువుగా రూ.వెయ్యి చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్ సైతం జతచేస్తుండటంతో మున్సిపాలిటీకి భారీగా ఆదాయం వస్తోంది. కాగా గురువారం నామినేషన్ దాఖలు చేసిన వారిలో 1 వార్డు నుండి అయ్యోరి వేణుగోపాల్, పెరుమాల్ల ఎల్లాగౌడ్, నారవేణి మూర్తి, 2వార్డు నుండి పురాణపు కిరణ్మయి, గాజు లక్ష్మీ సుజాత, 3 నుండి పురాణపు కిరణ్మయి, వొజ్జల నరేందర్, 4 నుండి బాకి చంద్రశేఖర్, కొత్తకొండ రాజు, కొమురెల్లి పవన్ కుమార్, 5 లో వేముల నాగలక్ష్మి, 6 లో మామిడి శివసాయి, సామ శివాని, ముదుసుల ప్రశాంత్, బత్తిని నరేష్, 7లో గుర్రాల సుధాకర్, వాంకుడోతు విజయ్ బాబు, 8 లో దోనకొండ లత, బొల్లారపు భూలక్ష్మి, అనంతుల విజయలక్ష్మి, బత్తిని వీణ, 9 నుండి వీరవేణి నాగలక్ష్మి, జెట్టి విజయ లక్ష్మి, 10 నుండి సంగి ఆనంద్, మామిడి వినోద్ కుమార్, 11 వార్డు నుంచి ఎల్లాల వెన్నెల, 12 లో తిరుమందాసు అనూష,చుక్క సంధ్య, 13 లో సోమిశెట్టి శివసాయి, చీపిరిశెట్టి రాజేష్, 14 వార్డు లో సంగి రేఖ, వేముల రజిత, పిల్లి జ్యోతి, దురిశెట్టి హారిక, 15 వ వార్డు నుండి వొజ్జల లక్ష్మణ్, ముత్తినేని లక్ష్మణ్, వడ్లూరి సునీల్ కుమార్ లు నామినేషన్లు సమర్పించారు. మొత్తంగా తొలి రెండురోజుల్లో 50 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా అదనపు ఎన్నికల అధికారి మామిల్ల శ్రీనివాసరావు తెలిపారు. నామినేషన్ల చివరిరోజైన శుక్రవారం వివిధ పార్టీలనుండి అభ్యర్థులు బీఫారాలతో నామినేషన్లు వేయనుండటంతో ఏ అభ్యర్థి ఏ పార్టీ తరుపున పోటీపడనున్నాడో స్పష్టం కానుంది. నిన్నటి దాకా కొనసాగిన పార్టీని వీడి అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని బరిలో దిగేందుకు మంతనాలు జరుపుతున్నారు. ఈ ఉత్కంఠ ఇలా కొనసాగుతుండగా నిన్నటి మిత్రులు ప్రత్యర్థులుగా మారుతుండటంతో ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా ఏదీ?

డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు




**ప్రజాపక్షం/సిద్దిపేట:** కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా లేదని. పెట్టుబడి సాయానికి దిక్కు లేదని బ్రేకులు లేని బస్సులా కాంగ్రెస్ పాలన ఉందని మాజీ మంత్రి, శాసనసభపక్ష ఉపనేత హరీష్‌రావు విమర్శించారు. గురువారం సిద్దిపేట మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కందులకు రూ. 8వేల మద్దతు ధర నిర్ణయించిందని. దళారులకు నమ్మిమోస పోకుండ రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన దేశంలో నూనే, గింజలు, పప్పు దినుసుల కొరత ఉందని అందుకే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించి వరికి ప్రత్యామ్నాయంగా సన్‌ఫ్లవర్, అయిల్‌ఫామ్, పప్పు దినుసులు సాగుచేస్తే భూసారం పెరుగుతుందన్నారు. చీడపీడలు తగ్గుతాయని అధిక లాభాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో రైతులు పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని, రైతులు పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల కోసం మళ్లీ చెప్పులు క్యూలైన్‌లో పెట్టె రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలోకాంగ్రెస్ సర్కార్ పంపిణీలో పూర్తిగా విఫలమైందన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ఏనాడు ఎరువుల కొరత రాలేదన్నారు. కరోనా వచ్చినా, నోట్లు రద్దయిన రైతులకు ఇబ్బంది రాలేదన్నారు. కాని కాంగ్రెస్ వచ్చాక మళ్లీ ఎరువులు కోసం తెల్లవారుజామున 3గంటల వచ్చి క్యూలైనులో చెప్పులు పెట్టి నిలబడి చీకటి రోజులు తీసుకవచ్చినట్లు తెలిపారు. యూరి యా దొరక్క రైతులు ప్రైవేటులో అధిక ధరలకు లిక్విడ్ ఎరువులు కొంటూ నష్టపోతున్నారన్నారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు. మధుసూదన్‌రెడ్డి , సత్యనారాయణరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ ఉంటేనే వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్

జగిత్యాల జిల్లా డిపిఆర్ఓ పల్లికొండ నరేష్

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో సమాచార పౌరసంబంధాల శాఖ నుంచి అధికారికంగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్ వేసుకోవాలని జగిత్యాల జిల్లా డి.పి.ఆర్.ఓ పల్లికొండ నరేష్ స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డు లేకుండా వాహనాలపై 'ప్రెస్' అని రాసుకోవడం మోటారు వాహన చట్టానికి విరుద్ధమని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని డి.పి.ఆర్.ఓ పల్లికొండ నరేష్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో అనధికారికంగా వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్లు వేసుకున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు డి.పి.ఆర్.ఓ తెలిపారు. పత్రికా స్వేచ్ఛ పేరుతో కొందరు దుర్వినియోగానికి పాల్పడకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నామని నిజమైన జర్నలిస్టుల ప్రతిష్ఠను కాపాడడమే లక్ష్యమని జగిత్యాల జిల్లా డి.పి.ఆర్.ఓ పల్లికొండ నరేష్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

## మార్చి 15లోగా అభివృద్ధి పనులు పూర్తి

### కలెక్టర్ హరిత



ప్రజా పక్షం / ఆసిఫాబాద్ : జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మార్చి 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హరిత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పాఠశాలల మూత్రశాలలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, వంటశాలలు, సిసి రహదారులు, ధాన్యపు గిడ్డంగిలు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.పనులకు సంబంధించిన బిల్లులను రికార్డు చేసి వెంటనే సమర్పించాలని, జిల్లాలో 222 గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణానికి ఒక్కొక్క దానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు సూచించారుసంపూర్ణత అభియాన్ 2.0 లో భాగంగా బాలికల కోసం ప్రత్యేక మూత్రశాలల నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధర్మేందర్, ఇంజనీరింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపిఓలు, సెర్ప్ ఎపిఎంలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెం. 08462220183కి కార్యాలయ పని వేళల్లో కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటాదివెం ట పరిశీలిస్తూ పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

## అనుమతులు లేని ఇళ్ల నిర్మాణాలపై చర్యలేవీ?

### నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కడుతున్న ఇళ్లకు అనుమతులు లేవు,అనుమతులు లేని ఇళ్లను అధికారులు చూ సి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. గ్రామాల్లో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నిర్మాణాలు చేపట్టే వారికి నోటీసులతోనే సరిపెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు విమర్శలున్నాయి. పారదర్శకత కోసం ఆన్లైన్ వ్యవస్థలు,గ్రామకంఠం స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న,పంచాయతీ అనుమతి,ప్లాన్ ఆమోదం నిబంధనలు ప్రభుత్వం తప్పనిసరి చేసింది.ఇందుకోసం భూమి సంబంధిత పట్టా, ఆధార్,ఇంటి ప్లాన్,పన్ను రశీదులు పంచాయతీలో సమర్పించి అనుమతి ఆమోదం తర్వాతే నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన సంగతి పంచాయతీ కార్యదర్శులకు తెలిసిన,చూసిన నోటీసులు జారీ చేయకపోవడం,చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంతో జాప్యం ఎందుకని ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ కార్యదర్శుల తీరును ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్న పెడచెవిన పెడుతున్నట్లు అనుమానం, ఒకవేళ అవగాహన లేమితో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ప్రజలకు,ఇళ్లు కల్పించే బాధ్యత అధికారులకే ఉంది కదా అని ప్రజులుఉ చర్చించుకుంటున్నారు.

## వాగ్దానాలకు కార్యరూపం కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### రూ.3 కోట్లతో సిసి రోడ్లు,డ్రైనేజీ పనులు



ప్రజాపక్షం/భీమ్‌గల్ : మున్సిపాలిటీ పరిధిలోని 2వ, 10వ వార్డులలో బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ చొరవతో టియుఐఎఫ్‌డి నిధుల నుండి రూ.3 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భీమ్‌గల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సయ్య పర్యవేక్షణలో ప్రజల అవసరాలకనుగుణంగా అభివృద్ధి పనులు సక్రమంగా అమలవుతున్నాయని నాయకులు తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులే కాంగ్రెస్ పార్టీ పనితీరుకు నిదర్శనమని పేర్కొంటూ మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలుపొందిన అనంతరం పట్టణ అభివృద్ధికి మరిన్ని కీలక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. మాట మీద నిలబడి పని చేసే నాయకులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించుకోవాలని కోరారు.పర్స అనంతరావు (ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు), మాజీ కౌన్సిలర్ సిహెచ్.గంగాధర్, చెప్పల రాజన్న, బందుక్, చింతలూరి దశరథ్, చెప్పల నర్సయ్య, రూపాల నర్సయ్య, చెప్పల కాంతయ్య, సేవలాల్, చెప్ప కర్ణం, పత్రి కిషన్, చింతలూరి గంగాధర్, జంగిడి గంగాధర్ పాల్గొన్నారు.

## పశు సంవర్ధక శాఖలో.. ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాపక్షం/పాపన్నపేట: పశు వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని పోడ్చన్‌పల్లి లో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచితం పశువైద్య శిభిరం ఏర్పాటు చేశారు. ఆ గ్రామ సర్పంచ్ ఎర్ర వెంకయ్య (యేసు) జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ వెంకటయ్య, ఉచిత గర్భకోశ నివారణ శిబిరం ప్రారంభించారు. పాడి పశువులలో గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేయించుకొని సకాలంలో చూడికట్టేలా చూసుకోవాలన్నారు. పాడి పశువు ఈనిన తర్వాత 90 రోజుల ఎద లక్షణాలను గుర్తించి గోపాలమిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలన్నారు. కృత్రిమ గర్భధారణ చేయించుకోవడం 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయని మేలు జాతి లేగ దూడలు జన్మించడం వలన పాడి రైతులు లాభం పొందుతారని పుట్టిన లేగ దూడలకు 15 రోజుల తర్వాత నుండి ఆరు నెలల వర కు నట్టల నివారణ మందులు తాగించుకోవాలన్నారు. పాపన్నపేట్ పశువైద్య అధికారి డాక్టర్ స్వామ్య రెడ్డి కొడపాక పశు వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్, జేవిఓ సతీష్ కుమార్, శివాజీ, పులి సురేష్ సమీర్, మెదక్ జిల్లా గోపాల మిత్ర సూపర్ వైజర్ యం.శ్రీనివాస్ రెడ్డి, గోపాల మిత్రులు ఎం.డి.సరిపోద్ది, కే.సాయిలు, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దుగా ఆడబిడ్డలు ఎదగాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్





ప్రజాపక్షం/నిర్మల్ : ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలను చేసి వేడుకలను ప్రారంభించిన అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నేటి సమాజంలో బాలికలు బాలురతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని కొనియాడారు .చదువుతో పాటు ఆటలు,సాంస్కాతిక రంగాల్లోనూ బాలికలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని,తమకు ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.జిల్లాలోని కేజీబీవీలు,వసతి గృహాల్లో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తూ వారి మేధోవికాసానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, బాలికలకు చిన్నతనం నుంచే సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు.ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థినుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలను అందజేశారు.అనంతరం వివిధ పనుల నిమిత్తం చంటి పిల్లలతో కలెక్టరేట్ కు వచ్చే మహిళా సందర్శకుల సౌకర్యార్థం ప్రజావాణి హాలు సమీపంలో ఏర్పాటు చేసిన 'బేబీ ఫీడింగ్ రూమ్'(తల్లులు పాలు ఇచ్చే గది)ను కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.కార్యాలయాలకు వచ్చే తల్లులకు ఇబ్బంది కలగకుండా ఈ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి.సీడబ్ల్యూసీ చైర్మన్ వాహిద్ ,డీఈఓ భోజన్న,డీఆర్‌డీఓ విజయలక్ష్మి ,సీడీపీఓలు,ఉపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గుండంపల్లి సర్పంచ్ తక్కల రమణరెడ్డి,నాయకులు ముత్యం రెడ్డి,మండల గ్రామ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ ఒ సి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే..

నిర్మల్ రూరల్ : మండల భాగ్యనగర్ గ్రామానికి చెందిన గంటడి స్వప్న కు అనారోగ్య కారణంగా హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం రూ,5,50,000 ల సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసి చెక్కును బీజేఎల్పీ నేత ,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల నాయకులు రాజేందర్,సన్నిత్ రెడ్డి,సృజన్, భోజన్న తో పాటు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మేడారం భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలి

### జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్

ప్రజాపక్షం / నస్పూర్ : మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సూచించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ శ్రీరాంపూర్ బస్టాండ్ ప్రాంతంలో ఆర్‌టిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.జాతరకు పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నందున ముఖ్యంగా వృద్ధులు, గర్భవతులు, చిన్న పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరిశుభ్రమైన మంచినీటిని మాత్రమే తాగాలని, వంటలకు కూడా వాటినే ఉపయోగించాలని, దుమ్ము ధూళి పడిన, ఈగలు వాలిన ఆహార పదార్థాలను తినకూడదని హెచ్చరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే గద్దెల సమీపంలో ఉండే ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాల్లో చికిత్స పొందాలని, అత్యవసర సేవల కోసం 108 కు కాల్ చేయాలని సూచించారు. భక్తులందరూ అవగాహనతో ఉండి వ్యాధుల బారిన పడకుండా అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

## పకడ్బందీగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత



ప్రజా పక్షం / కాగజ్ నగర్ : రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత అధికారులను ఆదేశించారు. గురువారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గాను 15 కౌంటర్ల ద్వారా నామినేషన్లు స్వీకరిస్తున్నామని, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని లక్ష్మీ పత్ సింఘానియా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణంలోని చెక్ పోస్టును సందర్శించి వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు. ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల రవాణా కాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 8500844365ను సంప్రదించాలని కోరారు. జవహర్ నవోదయ పాఠశాలను సందర్శించి నీట్ పరీక్షల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ మధుకర్, నవోదయ ప్రిన్సిపల్ కృష్ణ పాల్గొన్నారు.


## భూతగాదాలు లేని మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లాను భూ తగాదాలు లేనీ జిల్లాగా తీర్చిదిదలని,ప్రతి భూ కమతానికి సరైన నక్షను, మ్యాప్ ను, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం కోసం మెదక్ మండలంలోని పైలెట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్ లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కోసం నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,అదనపు కలెక్టర్ నగేష్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం అవుతుందని తెలిపారు. పాషాపూర్ గ్రామంలో భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహించుకోవడనికి గ్రామ సభ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. భూ భారతి భూముల రీసర్వే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు పక్కగా భూ హద్దులు, భూమి యొక్క నక్ష, మ్యాప్ లను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులను తయారు చేయడమే అని అన్నారు. ప్రతి కమతానికి రీసర్వే చేసి రైతులకు భూ తగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. డిజిటల్ సర్వే తో హద్దుల నిర్ణయించి ,అక్షాంశ రేఖాంశాలతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే తో భూ హద్దులు చెరిగి పోకుండా ఉంటాయని, భూమి ఆక్రమణలకు గురి కాకుండా ఉంటుందన్నారు. ఈ రీసర్వే అనంతరం రైతులు భూమిని ఎక్కడకు వెళ్లిన లేదా విదేశాల్లో సైతం తన భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. తర్వాత రోజుల్లో ఈ గ్రామాన్ని నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూ భారతి భుముల రీసర్వే చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న భూములాన్ని రీసర్వే చేసి భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ప్రజలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ బిడ్ తండాలో సమ్మక్క,సారలమ్మ జాతర



ప్రజాపక్షం/ముధోల్ : ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ తండా గ్రామంలో సమ్మక్కసారలమ్మల జాతర గురువారం రెండో రోజు సమ్మక్క అమ్మ వారు గద్దె పై చేరుకుంది.దీంతో సమ్మక్క వనం నుండి గద్దెపైకి చేరుకొని భక్తులకు దర్శ నమిచ్చారు.అదే విధంగా సమ్మక్కసారలమ్మ మొక్కులను తీర్చుకొని నిలు వెత్తు బంగారం (బెల్లం),ఓడి బియ్యం,మేకలు,కోళ్లతో భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.పోతరాజు మేకను గావ్ పట్టారు. సమ్మక్క సారలమ్మను బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు.జాతర ప్రారంభమై రెండు రోజులు కావడంతో భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.దేవాలయ స్థాపకులు రేణుకమ్మ బోనాలను సమర్పించి దేవాలయ ధర్మకర్త జాదవ్ సతీష్ కుమార్ అమ్మవార్లకు పూ జలు నిర్వహించారు. సమ్మ క్క సారలమ్మ జాతరకు భక్తులు అధి క సంఖ్యలో వస్తున్నారన్నారు.భక్తులు కోరుకున్న కోరికలను అమ్మవారు తీరుస్తారన్నారు. జాతరలో ఇలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ ధూమ్ నాయక్,బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంనాథ్ రాథోడ్,ఆయా గ్రామాల నుండి, వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గంగాపూర్ జాతరకు పటిష్ట బందోబస్తు

### ఎస్‌పి నితిక పంత్



ప్రజాపక్షం / రెబ్బెన : రెబ్బెన మండలం గంగాపూర్ లో ఈ నెల 31 నుండి మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరకు పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి నితిక పంత్ తెలిపారు. భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఊరేగింపు సాగే ప్రాంతాలు, సున్నిత ప్రదేశాల్లో తగినంత మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీ, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించి జాతర విజయవంతానికి తోడ్పడాలని కోరారు. రెబ్బెన సిఐ సంజయ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొత్తు విచ్ఛిన్నమైతే 'కారు'కు వరమే..

### మున్సిపల్ ఎన్నికల వేళ మారుతున్న సమీకరణాలు

ప్రజాపక్షం /మంచిర్యాల : మున్సిపల్ ఎన్నికల న గారా మోగడంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. సింగరేణి ప్రాంతంలో అత్యంత బలంగా ఉన్న సిపిఐతో పొత్తును కాపాడుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అనివార్యంగా మారింది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీలు కార్మిక ప్రాంతం కావడంతో పాటు సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియుసి ఇక్కడ గుర్తింపు సం ఘంగా ఉండటం కాంగ్రెస్ విజయానికి ప్రధాన బలం. అయితే సీట్ల పంపకాల విషయంలో సయోధ్య కుదరకపోవడంతో మిత్రపక్షాల మధ్య దూరం పెరుగుతోంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని బిఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మంచిర్యాల కార్పొరేషన్ కేంద్రంగా సాగుతున్న ఈ పొత్తుల వ్యవహారం జిల్లాలోని మిగిలిన మున్సిపాలిటీల భవిష్యత్తును శాసించనుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో పొత్తు విచ్ఛిన్నమైతే దాని ప్రభావం లక్షెట్టిపేట, క్యాతనపల్లి, చెన్నూరు, బెల్లంపల్లి మున్సిపాలిటీలపై పడటం ఖాయంగా కనిపిస్తోంది. మంచిర్యాల ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు తీసుకునే నిర్ణయంపైనే జిల్లావ్యాప్తంగా పొత్తుల కొనసాగింపు ఆధారపడి ఉంది. ఒకవేళ కాంగ్రెస్ కమ్యూనిస్టులను దూరం చేసుకుంటే వారిని కలుపుకొని పోవడానికి బిఆర్ఎస్ ఇప్పటికే సిద్ధమైనట్లు తెలుస్తుంది. అంతేకాకుండా పొత్తులకు తాము సిద్ధమంటూ గులాబీ శ్రేణులు వామపక్షాలకు స్పష్టమైన సంకేతాలు కూడా పంపినట్లు సమాచారం. అధికార మేయర్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్, కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందాలని బిఆర్ఎస్ ఎప్పటికప్పుడు ఎత్తుగడలు మారుస్తున్నాయి. నామినేషన్ల గడువు ముగుస్తున్న తరుణంలో పొత్తుల విషయం ఇంకా కొలిక్కి రాకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. మేయర్ పీఠమే లక్ష్యంగా సాగుతున్న ఈ పోరులో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను గమనించి సిపిఐతో పొత్తును కొనసాగించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఈ చీలిక ప్రత్యర్థి పార్టీలకు భారీగా కలిసి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని కీలక నేతలు, కార్యకర్తలు ఇప్పుడు అధిష్టానం తీసుకోబోయే తుది నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా పోలీసు యంత్రాంగం అప్రమత్తం

### ఎస్‌పి పరితోష్ పంకజ్

ప్రజాపక్షం /సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అదికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మున్సిపలిటీల పరిధిలోని పోలింగ్ లోకేషన్లు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలనుసందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించిన చెడు నడత కలిగిన వ్యక్తులను గుర్తించి సత్ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బౌండ్ ఓవర్ చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ రోజు తేది 28012026 నుండి 30012026 వరకు కొనసాగునున్న నేఫథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

**నామినేషన్ కేంద్రాల వద్ద పాటించావలసిన సూచనలు :** నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో 163 బిఎస్ఎస్ (144 సిఆర్‌పిసీ) అమలులలో ఉంటుంది . ప్రజలు గుంపులుగా ఉండరాదని, నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒకరు ,ఇద్దరు ప్రతిపాదకులను మాత్రమే అనుమతించబడునని, నామినేషన్ కేంద్రంలో శాంతి భద్రతలు పాటించాలి ,నినాదాలు, ప్రచారం పూర్తిగా నిషేదమని తెలిపారు నామినేషన్‌కేంద్రం బయట ఏలాంటి ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సంబందిత అనుమతి లేనిదే ర్యాలీలు ,సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదు. నామినేషన్ ప్రక్రియ కు అంతరాయం కలిగించే విధంగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారం చేయరాదని తెలిపారు. ఎన్నికల సమయంలో చట్ట విరుద్ద చర్యలకు పాల్పడితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు శాఖ హెచ్చరిస్తోంది. ఎన్నికలు శాంతి యుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తుంది.



## ఫిర్యాదుల పరిష్కారంలో మరింత వేగం

### అదనపు ఎస్‌పి మహేందర్

ప్రజాపక్షం/శివ్వంపేట : ఫిర్యాదుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. గురువారం శివ్వంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా జిల్లా అడిషనల్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో వివిధ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలు వాటి నమోదు భద్రతను ఆయన పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతి, విధుల నిర్వహణలో పోలీసు సిబ్బంది పనితీరుపై ఆ యన సమిక్ష నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ప్రాం గణం పరిశీలించి శుభ్రత, భద్రతతో పాటు ప్రజలకు అనుకూల వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

'మనశంకర వరప్రసాద్ గారు' సినిమా ఇప్పటి వరకూ రూ.358 కోట్లు వసూళ్లు చేసి భారీ కలెక్షన్లు సాధించిన ప్రాంతీయ చిత్రంగా రికార్డును సృష్టించింది. ఈ సినిమాలో ఓ కీలక సన్నివేశంలో వచ్చే 'పెద్దిరెడ్డి..' పాట ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. తాజాగా ఈ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు.

# రీల్



## దసరాకు 'ఫౌజీ' సిద్ధం

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఫౌజీ'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో టిసిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్‌కి ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ యేడాది దసరా పండుగ సందర్భంగా 'ఫౌజీ' చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి విరామం లేకుండా కంటిన్యూ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రభాస్ సరసన హీరోయిన్‌గా ఇమాన్వీ నటిస్తోంది. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సుదీప్ చటర్జీ నిర్వహిస్తుండగా, సంగీతాన్ని విషాల్ చంద్రశేఖర్ అందిస్తున్నారు. అనిల్ విలాస్ జాధవ్ ప్రొడక్షన్ డిజైనర్, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో విడుదల కానుంది.

## 'గ్యాంగ్‌స్టర్స్'గా బాలయ్య, చిరంజీవి!





టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్స్ చిరంజీవి, బాలకృష్ణ ఇద్దరూ ఒకే తరహా మూవీస్ లో నటించబోతున్నారు. ఆ రెండు సినిమాలు కూడా ఒకే సీజన్ లో జనాన్ని పలకరిస్తాయని వినిపిస్తోంది.టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక సంవత్సరాలు ఢీ అంటే ఢీ అంటూ సాగిన స్టార్ హీరోస్ ఎవరంటే మెగాస్టార్ చిరంజీవి , నటసింహ బాలకృష్ణ అనే చెప్పాలి. వీరిద్దరి సినిమాలు పోటీ పడితే చూడాలని సినీ ఫ్యాన్స్ కూడా ఆశిస్తూ ఉంటారు. ఒక సారి చిరుది పైచేయిగా సాగితే, మరోమారు బాలయ్యది అప్పర్ హ్యాండ్‌గా ఉన్న సందర్భాలున్నాయి. అందువల్లే పోటీ అంటే వీరిద్దరి మధ్యే అన్నది తెలుగు సినీ ఫ్యాన్స్ అభిప్రాయం. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు ఇద్దరూ ఒకే తరహా కథల్లో నటిస్తున్నారని టాక్. పైగా ఆ రెండు చిత్రాలు వచ్చే 2027 సంక్రాంతికి రిలీజ్ అవుతాయని వినిపిస్తోంది.చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వ ంలో రూపొందుతోన్న చిత్రం గ్యాంగ్ స్టర్ నేపథ్యంలో తెరకెక్కబోతోందట. ఈ సినిమాను రాబోయే సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలని ఆశిస్తున్నారు. ఇక మరోవైపు బాలకృష్ణ కథానాయకునిగా గోపీచంద్ మలినేని తెరకెక్కించబోయే మూవీ కూడా గ్యాంగ్ స్టర్ కథతోనే సాగనుందట. అందువల్ల సినీ ఫ్యాన్స్ లో అమితాసక్తి నెలకొంది. పైగా 2023లో కూడా ఓ వైపు బాలకృష్ణ గోపీచంద్ మలినేని తమ 'వీరసింహారెడ్డి'తో బరిలోకి దూకారు. ఆ సినిమా వచ్చిన మరుసటి రోజునే చిరంజీవి బాబీ కాంబోలో 'వాల్తేరు వీరయ్య' వెలుగు చూసింది. రెండు సినిమాలను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించగా, ఈ చిత్రాలు విజయాన్ని చవిచూశాయి. రెండు సినిమాలనూ అభిమానులు పోటాపోటీగా గోల్డెన్ జూబ్లీ ఆడించడం విశేషం. అందువల్ల చిరు బాలయ్య బాక్సాఫీస్ వార్ మళ్ళీ సంక్రాంతికే సాగితే రంజుగా ఉంటుందని సినీజనం భావిస్తున్నారు.గతంలోనూ చిరంజీవి, బాలకృష్ణ కొన్ని చిత్రాల్లో గ్యాంగ్ స్టర్స్‌గా నటించి అలరించారు. అయితే అప్పట్లో చిరంజీవి గ్యాంగ్ స్టర్ గా 'లంకేశ్వరుడు', 'గూండా' వంటి చిత్రాల్లో నటించారు. ఆ చిత్రాల్లో 'గూండా' హిట్ అయింది. ఇక బాలయ్య విషయానికి వస్తే ఆయన 'యువరత్న రాణా', 'అశోక చక్రవర్తి' మూవీస్ లో గ్యాంగ్ స్టర్ గా కనిపించారు. 'యువరత్న రాణా' ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో బాలకృష్ణ, చిరంజీవి ఇద్దరూ గ్యాంగ్ స్టర్స్ గా నటించే కొత్త సినిమాలపై సినీ ఫ్యాన్స్ లో ఆసక్తి నెలకొంది. నవతరం ప్రేక్షకులను ఈ సీనియర్ స్టార్స్ గ్యాంగ్ స్టర్స్ గా ఏ రీతిన మెప్పిస్తారో చూడాలన్న ఇంట్రెస్ట్ కూడా కలుగుతోంది. మరి చిరంజీవిని బాబీ, బాలయ్యను గోపీచంద్ ఏ తీరున తెరపై చూపిస్తారో చూడాలి.



## కీలక పాత్రలో శ్రుతి హాసన్

వరుస బ్లాక్‌బస్టర్లు, పాన్‌ఇండియా స్టార్ దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్, ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార'తో అలరించబోతున్నారు. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఈ మధ్య కాలంలో చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న శ్రుతి హాసన్, ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఆమె కళ్ళకు అద్దాలు పెట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం ఆకట్టుకుంది. పెదవులపై ఉన్న సిగరెట్, దాని నుంచి వగసే పొగ ఆమె పాత్రకు రఫ్, టచ్ ను జోడిస్తోంది. కథలో శ్రుతి హాసన్ పాత్ర కీలక మలుపుగా నిలవనుంది. ఆమె ప్రజెన్స్ పవర్ ఫుల్‌గా ఉండబోతోంది. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఉండబోతుంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీని, శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం నిర్మా ణ చివరి దశలో ఉన్న 'ఆకాశంలో ఒక తార' చిత్రం 2026 వేసవిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో పాన్ఇండియా స్థాయిలో విడుదల కానుంది. రచయిత: గంగరాజు గున్నం, సంగీతం: జి.వి. ప్రకాష్ సినిమాటోగ్రాఫర్: సుజిత్ సారంగ్.

## శ్రీ చిదంబరం ట్రైలర్ విడుదల



చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేశారు. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఆలపించిన 'వెళ్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు బచ్చిబాబు సానా విడుదల చేశారు. ఫిబ్రవరి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్‌ను గమనిస్తే.. శ్రీచిదంబరం ఓ ఫీల్‌గుడ్ ఎమోషనల్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. ఈ కథలో కమర్షియల్ మేసేజ్‌తో పాటు ఓ బ్యూటిఫుల్ మేసేజ్ కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రతి సన్నివేశం ఎంతో నేచురాలగా ఉంది. తప్పకుండా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు చక్కని అనుభూతిని పంచేవిధంగా ఉంది. నిర్మాత వినిషా మాట్లాడుతూ '' అంతా కొత్తవాళ్లతో తీసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. చాలా మెచ్యూర్డ్ అండ్ ఇన్స్పిరేషన్ స్టోరీతో రాబోతున్న సినిమా ఇది. నేటి సమాజానికి ఎంతో అవసరమైన కథ ఇది. చాలా మంది యువత చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌కి సూసైడ్ వరకు వెళ్లిపోతున్నారు. అలాంటి వారందరికి ఎంతో ఇన్స్పయిర్ అయ్యే కథ ఇది. మీలో లోపం మీకు బలం అవ్వాలి అనే చెప్పే కథ ఇది. తప్పకుండా ఈ సినిమా అందరిని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట, గోపీనాథ్, శివకుమార్ మట్ట, కల్పలత గార్లపాటి, అరుణ్ కుమార్, తులసి, నాయుడు మోరం, శంకర్ రావు తదితరులు డిఓపి అక్షయ్ రామ్ పొడిశెట్టి, ఎడిటర్ అన్వర్ అలీ, సంగీత దర్శకుడు చందు రవి.



## జూ.ఎన్టీఆర్ హక్కులకు రక్షణ కల్పించిన ఢిల్లీ హైకోర్టు

జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిగత , ప్రచార హక్కులను రక్షణ కల్పించేలా ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.వివిధ మాధ్యమాల్లో తన పేరు, ఫోటోలు, గుర్తింపును అనుమతి లేకుండా వాణిజ్య పరమైన ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ కోర్టును ఆశ్రయిస్తూ పిటిషన్ వేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఆయన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పిస్తూ ఆదేశాలను జారీ చేసింది. ఆదేశాల మేరకు ఎన్టీఆర్ పేరు గానీ, ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్, తారక్ లాంమాసెస్ వంటి పేర్లు గానీ, అలాగే ఆయన ఫోటోలు, ఇమేజ్‌ను అనుమతి లేకుండా వాణిజ్య పరంగా వాడితే చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. ఎక్కడైనా ఇలా అనధికారంగా వాడినట్టు తెలిస్తే..చట్టం ప్రకారం వెంటనే తీసేయాలని ఆదేశాలను కోర్టు జా రీ చేసింది. ఒక వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి వ్యక్తిత్వ హక్కులనే విజీవించే హక్కు, స్వేచ్ఛతోనే కలిసి ఉంటాయని చెప్పిన ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని, అలాగే కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్మార్క్ చట్టం 1999 ద్వారా అమలు చేయవచ్చని స్పష్టం చేసింది.

## 'సీతా పయనం'లో పయనమే... పాట



శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్‌నెషనల్ బ్యాన్ప మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతోన్న కొత్త చిత్రం 'సీతా పయనం'. ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్ని పోషించారు. యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటించారు. అతని మేనల్లుడు యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషించారు. ఈ మూవీని ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో 'పయనమే' పాటను చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. ఈ పాటను కాసర్ల శ్యాం రచించారు. అనూప్ రూబెన్స్ అందించిన బాణీ ఎం తో క్యాచీగా ఉంది. ఈ మెలోడియస్, రొమాంటిక్ పాటను అనూప్ రూబెన్స్, సత్య ప్రకాష్ కలిసి ఆలపించారు. ఇక ఈ పాటలో అర్జున్, అనూప్ రూబెన్స్ కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేశారు. హీరో, హీరోయిన్ల కెమిస్ట్రీని కూడా ఈ లిరికల్ వీడియోలో చక్కగా చూపించారు.ప్రస్తుతం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని పూర్తి చేశారు. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి జి బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ అందించారు. నిరంజన్, ఐశ్వర్య అర్జున్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ, యాక్షన్ కింగ్ అర్జున్, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డైలాగ్స్ సాయి మాధవ్ బుర్ర, మ్యూజిక్: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: బాల మురుగన్, ఎడిటర్: అయూబ్ ఖాన్, ఆర్ట్ డైరెక్టర్స్: మోహన్ బి కేరీ, శివ కామేష్ డి, కృష్ణ, ఫైట్స్ : కిక్ యాస్ కాళీ

## చైనా ముప్పు కాదు

(మొదటి పేజీ తరువాయి)


ఆ భావాలు తొణకిసలాడాయని పిటిఐ వార్తాసంస్థ పేర్కొ ంది. ట్రంప్ పేరు చెప్పకుండా జీ జిన్‌పింగ్ నేరుగా మాట్లాడుతూ, అన్నిదేశాలూ కట్టుబడి ఉన్నప్పుడే అన్నిదేశాలూ అంతర్జాతీయ చట్టాలు వాస్తవరూపంలో అమలులో ఉం టాయన్నారు. ముఖ్యంగా ఈ విషయంలో అగ్ర రాజ్యాలు నాయకత్వస్థానంలో ఉండి నడిపించాలని, లేకపోతే ఆరాచక పాలనవైపు ప్రపంచం వెళ్ళిపోతుందన్నారు.ఈ పర్యటనలో స్టార్‌మర్ అనేక వ్యాపార ఒప్పందాలపై సంతకాలు చేశారు. బ్రిటన్ నుండి చైనాకు 30 రోజులపాటు వీసా లే కుండా ఉచితంగా ప్రయాణాలు చేసే సదుపాయాన్ని క ల్పించేందుకు జిన్‌పింగ్ అంగీకరించారు.సమావేశానంత రం కీర్ స్టార్‌మర్ మాట్లాడుతూ, జిన్‌పింగ్‌తో సమావేశం ఎంతో ప్రయోజనాత్మకంగా ముగిసిందని అన్నారు. బ్రిటన్ ప్రజలకు ప్రయోజనం కలిగించే బ్రహ్మాండమైన అవకాశాల గురించి తాము చర్చించామన్నారు. రెండు దేశాలమధ్యా మంచి సంబంధాలు ఉన్నాయని, సంబంధాలు బ లంగా ఉన్నాయని చెప్పారు. బ్రిటన్ విస్కీపై టారిఫ్‌లు స హా, చైనాకు బ్రిటన్ నుండి వీసాలేని ఉచిత రాకపోకల విషయంపై కూడా చర్చల్లో పురోగతి సాధించామన్నారు. వీసాలపై ఒప్పందం గురించి ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ంలో అత్యంత శక్తిమంతమైన ఆర్థికకేంద్రంగా ఉన్న చై నాలో తమ స్థానాన్ని పదిలపరచుకునే మార్గాలను అన్వేషి ంచేందుకు అనేక వ్యాపారసంస్థలు తహ తహలాడుతున్నాయన్నారు. వీసా నియమ నిబంధనలను సడలించడంద్వా రా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు తాము కూ డా చర్యలు తీసుకుంటామన్నారు. వైరుధ్యాలున్న విషయాలపై కూడా రెండు దేశాలూ నిర్మొహమాటంగా బాహాట ంగా పరస్పర అభిప్రాయాలను పంచుకున్నాయన్నారు. కా గా బ్రిటన్ ప్రధానమంత్రి వెంట 60 బ్రిటన్ కంపెనీలు ,వాణిజ్య సంస్థలకు చెందిన సిఇఓలు చైనా పర్యటనకు వ చ్చారు. వీరిలో బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న ఆస్ట్రా జెనికా ఫార్మాస్యూటికల్ సంస్థ 15 బిలియన్ డాలర్లు చైనాలో పె ట్టుబడులుగా సమకూరుస్తున్నట్లు ప్రకటించింది. స్టార్‌మర్ పర్యటన ద్వారా చైనా–బ్రిటన్ మధ్య ఉన్న దౌత్యపరమైన సంబంధాలు పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపజేసుకోవడాని కి అవకాశం లేనప్పటికీ దౌత్యపరమైన అపోహలు కొన్ని క రిగిపోవడానికి దోహదం చేస్తాయని స్టార్‌మర్ వెంట వెళ్ళిన జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు.

**మన రెండు దేశాలూ ఎరుపే:జిన్‌పింగ్**

కార్మిక ప్రభుత్వాలను మేం ప్రేమిస్తాంజిన్‌పింగ్–స్టార్‌మర్ మధ్య జరిగిన సమావేశంలో చైనా అ ధ్యక్షుడు కొన్ని ఛలోక్తులు కూడా విసిరారు. మనిద్దరం ఎ రుపే (ఉయ్ ఆర్ బోత్ రెడ్స్), మీదీ కార్మిక పార్టీయే (లేబర్‌పార్టీ), మేం కార్మిక ప్రభుత్వాలను ప్రేమిస్తాం'' అని జిన్‌పింగ్ అన్నారు. గురువారం ఉదయం ఈ నాయకులిద్దరిమధ్యా 80 నిమిషాలు సమావేశం జరిగిందని పిటిఐ వా ర్తాసంస్థ పేర్కొనగా రెండు గంటలపాటు సమావేశం జరిగినట్లు బ్రిటన్ పత్రికలు పేర్కొన్నాయి. గడచిన సంవత్సరాలలో రెండు దేశాలమధ్యా సంబంధాలు వెనకబడ్డాయని చ ర్చల సందర్భంగా స్టార్‌మర్‌తో జిన్‌పింగ్ అన్నారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో రెండు దేశాలమధ్యా సంబంధాలు పటిష్టం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 2018లో థెరిసా మే పర్యటన తర్వాత గడచిన ఏడేళ్ళలో ఇప్పటివరకూ చైనాను బ్రిటన్ ప్రధానమంత్రి సందర్శించలేదు. కానీ ఈసారి పర్యటన ఎంతో కృతనిశ్చయంతో చేస్తున్నామని స్టార్‌మర్ ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత 2024 జులైలో స్టార్‌మర్ బ్రిటన్ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. బ్రిటన్‌లో సమస్యలు పరిష్కరిస్తానని 18 నెలలక్రితం తాను ప్రజలకు వాగ్దానం చేశానని ఆయ న అన్నారు. ఈ సమస్యల పరిష్కారంలో భాగంగా చైనా ఒక శక్తిమంతమైన మార్కెట్‌గా ఉండబోతోందని ఆయన అన్నారు.

## ఎన్నికల్లో ఫిర్యాదుల కోసం టీ - పోల్ యాప్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం టీ పోల్ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. tsec.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చునని ఎస్ఈసి తెలిపింది.



## గద్దెపైకి సమ్మక్క

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ అధికారులు, కింది స్థాయి సిబ్బంది వైఫల్యం కనిపించింది. కాగా మేడారం మహాజాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన తల్లీ సమ్మక్క గురువారం రాత్రి సమయంలో మేడారం గద్దెపైకి చేరుకున్నది. సారలమ్మ, సమ్మక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువై ఉండటంతో భక్తులు మొక్కులు అప్పజెప్పనున్నారు. సామాన్య భక్తజనంతో శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లోని వీఐపీలు వనదేవతలను దర్శించుకుంటున్నారు. గురువారం కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి,గిరిజన శాఖా మంత్రి జువల్ ఓరం అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు అప్పగించారు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,పిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ దంపతులతో పాటు పలువురు రాజకీయ, వివిధ రంగాలకు చెందిన వీఐపీలు వనదేవతలను దర్శించుకున్నారు. వీరి వెంట రాష్ట్ర రెవెన్యూ,సమాచార.గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ( సీతక్క),గిరిజన శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్,జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు ఉన్నారు.

**మహా నగరాన్ని తలపిస్తున్న మేడారం**

భక్తుల గుడారాలు, తాత్కాలిక దుకాణాలతో ఇప్పుడు మేడారం మహానగరాన్ని తలపిస్తోంది. విడిదిచేసిన తావునే సమ్మక్క, సారక్కల నెలవుగా భావిస్తున్న భక్తులు అక్కడే మట్టితో గద్దెలను తయారుచేసుకొని పసుపు కుంకుమలు, కంకవనంతో పూజలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు వినూత్నంగా తమ సంప్రదాయ ప్రకారం తమ గుడారంలోనే ఎత్తుబంగారానికి పూజలుచేసి మద్యం బాటిళ్లతో నైవేద్యం సమర్పిస్తున్నారు. ఆతర్వాత బెల్లం, కానుకలను దేవతల గద్దెలవద్ద సమర్పిస్తున్నారు. దీంతో చెట్టూ, పుట్టా, వాగూవంకా, గుడిసె, డేరా.. ఎక్కడా చూసినా సమ్మక్క, సారక్క పూజలే దర్శనమిస్తున్నారు. ఛత్తీస్గఢ్, ఒడిశా, మహారాష్ట్రనుంచి వచ్చిన భక్తులు జంపన్నవాగు పొడవునా విడిదిచేశారు. వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న త ర్వాత కోళ్లు, మేకలను బలిచ్చి కుటుంబసభ్యులు, బం ధుమిత్రులతో విందూవినోదాల్లో మునిగితేలుతున్నారు.

## సమప్రాధాన్యం (మొదటి పేజీ తరువాయి)

సరికొత్త మార్గాన్ని అందించింది.అన్ని వర్గాల సంక్షేమమే కేంద్రంగా కేరళ రాష్ట్ర ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ గురువారం బడ్జెట్ 2026–27ను శాసనసభలో ప్రవేశపెట్టారు. కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.గోపాలన్ రూ.1.82 లక్షల కోట్ల రూపాయల రెవెన్యూ రాబడి సహా, రూ.2.4 లక్షల కోట్ల వ్యయాన్ని అంచనా వేస్తూ 2026–27 బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. సామాజిక భద్రతా పెన్షన్లు నిలిచిపోవనే హామీయే ఈ బడ్జెట్ ప్రధానాంశం. సంక్షేమ పెన్షన్ల కోసం రూ.14,500 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రజారోగ్య రంగంలో కూడా ఇదే తరహాలో ప్రకటించారు. మహిళా భద్రతా పెన్షన్ల కోసం రూ. 3,820 కోట్లు కేటాయించారు. ఉపాధి హామీ పథకాన్ని ఆటంకం లేకుండా కొనసాగించేందుకు అదనంగా 1,000 కోట్ల రూపాయలను కేటాయించారు. అంగన్‌వాడీ వర్కర్లకు 1000 రూపాయలు, అంగన్వాడీ హెల్పర్లకు 500 రూపాయలు పెంచారు. ఆశా వర్కర్లు, ప్రీప్రైమరీ టీచర్లు, సాక్షరతా ప్రేరక్‌లకు 1000 రూపాయల చొప్పున పెంచారు. స్కూల్ వంట కార్మికుల రోజువారీ వేతనాన్ని 25 రూపాయలు పెంచారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఇతర సామాజిక సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులు కాని 35 నుండి 60 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు (ట్రాన్స్ ఉమెన్ సహా) నెలకు రూ.1000 ఆర్థిక సాయం అందించడం ఈ బడ్జెట్ ప్రత్యేకత. దీనివల్ల 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

**అసంఘటిత కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ :** అసంఘటిత రంగ కార్మికుల కోసం విస్తృతమైన గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రకటించారు. హరితకర్మ సేన సభ్యులు, ఆటోటాక్సీ కార్మికులు, లాటరీ కార్మికులకు ప్రమాద బీమా కల్పిస్తారు. ప్రభుత్వ రంగసహకార సంస్థల ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారి కోసం మెడిసెప్ మాదిరిగా ఇన్సూరెన్స్ అమలు చేస్తారు.

ఉద్యోగులకు పిఆర్‌సి, చివరి వేతనంలో 50 శాతం పెన్షన్ : బడ్జెట్ సందర్భంగా 12వ వేతన సవరణ కమిషన్‌ను ప్రకటించారు. కమిషన్ సభ్యులు మూడు నెలల్లోగా నివేదిక సమర్పిస్తారు. బకాయి ఉన్న అన్ని డిఎ, డిఆర్ గడువులోగా చెల్లిస్తారు. ఒక విడత ఫిబ్రవరి జీతంతో పాటు, మిగిలినవి మార్చి నెలలో అందజేస్తారు. బకాయిలను దశలవారీగా చెల్లించేందుకు నిధులు కేటాయించారు. **అష్యూర్డ్ పెన్షన్ :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ (ఎన్‌పిఎస్)కు బదులుగా పెన్షన్ మొత్తానికి హామీ ఇచ్చే 'అష్యూర్డ్ పెన్షన్' పథకాన్ని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు చివరి జీతంలో 50 శాతం పెన్షన్‌గా హామీ ఇచ్చే ఈ పథకం ఏప్రిల్ 1 నుండి అమలులోకి వస్తుంది. ఇందులోకి మారడానికి ఉద్యోగులకు అవకాశం కల్పిస్తారు. రూ.17వేలు కోత విధించిన కేంద్రం :రాష్ట్రాన్ని ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేస్తూ, కేరళను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ కేరళ ఆర్థిక మంత్రి గోపాలన్ బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. కేరళ వాటాను తగ్గించడం, రెవెన్యూ గ్రాంట్‌ను కుదించడం, అప్పుల పరిమితిని తగ్గించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కేరళను ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. కేంద్రం కేవలం ఓట్లను దొంగిలించడమే కాదు, నోట్లను కూడా దొంగిలించిందని విమర్శించారు. ఈ ఏడాది 17,000 కోట్ల రూపాయల కోత విధించారని చెప్పారు.


**మరికొన్ని హైలైట్స్:** స్థానిక సంస్థలకు జనరల్ పర్పస్ ఫండ్ ₹3237 కోట్లు, మెయింటెనెన్స్ ఫండ్ ₹4316 కోట్లు, ప్లాన్ ఫండ్ ₹10,189 కోట్లు * జర్నలిస్టు పెన్షన్ నెలకు ₹1500 పెంపు * పంచాయితీ సభ్యులు, కౌన్సిలర్ల గౌరవ వేతనం పెంపు * స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధుల సంక్షేమం కోసం సంక్షేమ నిధి * గిగ్ (Gig) కార్మికుల కోసం ఆధునిక సౌకర్యాలతో 'గిగ్ హబ్' ₹20 కోట్లు * పాత పెట్రోల్, డీజిల్ ఆటో రిక్షాలను తుక్కుగా మార్చి ఎలక్ట్రిక్ ఆటోలు కొనేవారికి ఒకేసారి ₹40,000 స్క్రాపేజ్ బోనస్ *ఎలక్ట్రిక్ ఆటో రిక్షాల కొనుగోలు రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ * ఆటో స్టాండ్లలో సోలార్ ఆధారిత ఛార్జింగ్ యూనిట్ల ఏర్పాటుకు ₹20 కోట్లు.
* ఉపాధి హామీ పథకం కోసం గత ఏడాది కంటే అదనంగా ₹1000 కోట్లు
* రిటైర్మెంట్ హోమ్‌ల ఏర్పాటుకు సంస్థలు, గ్రూపులు,వ్యక్తులకు ప్రభుత్వ సబ్సిడీ. దీని కోసం ₹30 కోట్లు * ఇళ్లలో ఒంటరిగా ఉండే వృద్ధులకు ₹10 కోట్లుతో 'ఆన్ కాల్ వాలంటీర్ల' సేవలు

### కేరళ ప్రత్యామ్నాయాన్ని ప్రతిబింబించిన బడ్జెట్: బినోయ్ విశ్వం



శాసనసభలో ప్రవేశపెట్టిన 2025–26 రాష్ట్ర బడ్జెట్ కేరళ ప్రజల పక్షపాత ప్రత్యామ్నాయాన్ని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న ప్రతిఘటనను ప్రతిబింబిస్తోందని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం పేర్కొన్నారు. దశాబ్దాలుగా కేరళ నిర్మించుకున్న సంక్షేమ వ్యవస్థలను పటిష్టం చేస్తూనే, నూతన కాలానికి అవసరమైన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ఈ బడ్జెట్ ముందుకు తీసుకెళ్తోందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆర్థిక వివక్షకు పాల్పడుతున్నప్పటికీ, కేరళ వంటి రాష్ట్రం ఎలా పోరాడి నిలబడుతుందో ఈ బడ్జెట్ ప్రత్యక్షంగా చూపుతోంది. జిఎస్‌టి చట్టం వచ్చిన తర్వాత పన్ను వసూలు అవకాశాలు తగ్గిపోయి, రెవెన్యూ లోటు గ్రాంటు , జిఎస్‌టి పరిహారాన్ని కేంద్రం నిలిపివేసినప్పటికీ, రాష్ట్రం ముందడుగు వేస్తూనే ఉందని బినోయ్ విశ్వం అన్నారు.తీవ్రమైన ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లో కూడా, మలయాళీలను అన్ని రంగాల్లో భవిష్యత్తు వైపు నడిపించాలనే వామపక్ష ప్రభుత్వ దూరదృష్టి బడ్జెట్‌లో కనిపిస్తోందని ఆయన ఎత్తిచూపారు.

### అన్ని వర్గాలకు కేటాయింపులు : సిఎం పినరాయ్ విజయన్



అన్ని రంగాల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంలో ప్రజల కేంద్రంగా రూపొందిన ప్రణాళిక అని బడ్జెట్‌ను ఉద్దేశించి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ వ్యాఖ్యానించారు. గత పదేళ్ళలో కేరళ ఆధునిక, అభివృద్ధి చెందిన మధ్యతరగతి సమాజంగా రూపాంతరం చెందిందన్నారు. కార్మికులు, రైతులు, మధ్యతరగతి, ప్రభుత్వోద్యోగులు, వ్యాపార వర్గాలందరికీ సమదృష్టితో కేటాయింపులు జరిగాయని చెప్పారు. ఈ బడ్జెట్ భారతీయ సమాఖ్య, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిని కేంద్ర ప్రభుత్వ చర్యలకు బలమైన రాజకీయ స్పందనగా నిలుస్తోందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com